హర్మన్‌ప్రీత్ సేనకు తొలి పరీక్ష

- నేడు న్యూజిలాండ్ మహిళలతో తొలి పోరు
- రాత్రి 7.30గం॥ల నుంచి

10

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 64 | విజయవాడ, శుక్రవారం 4 అక్టోబర్ 2024 | 10 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 4 October 2024 | Rs

ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు 3

జిఎస్‌డిపిపై వ్యవసాయ అనుబంధ, పారిశ్రామిక, సేవల రంగాలపై సమీక్షిస్తున్న సిఎం చంద్రబాబు

15శాతం వృద్ధి లక్ష్యం

జిఎస్‌డిపిపై సమీక్షలో సిఎం
ప్రజల జీవన ప్రమాణాలు పెంచాలని సూచన
జనవరి నుండి పి4 విధానం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పదిహేనుశాతం వృద్ధి రేటును సాధించడమే లక్ష్యంగా పనిచేయాలని అధికార యంత్రాంగానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచించారు. జిఎస్‌డిపిపై వ్యవసాయ అనుబంధ రంగాలు, పారిశ్రామిక, సేవల రంగాలపై గురువారం రాష్ట్ర సచివాలయంలో ఆయన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమానాలు పెంచడంతో పాటు, అదనపు భారాలు లేకుండా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచే విధానాలను అమలు చేయాలని అన్నారు. గత ప్రభుత్వ విధ్వంసక విధానాలతో అన్ని రంగాలు తిరోగమనంలోకి వెళ్లాయని, దీంతో ఆర్థిక వ్యవస్థ కుదేలైందని సిఎం చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రతి శాఖలోనూ కొత్త విధానాలను తీసుకొస్తున్నామని, వాటిని సమర్థవంతంగా అమలు చేసి ఆర్థిక పురోగతి సాధించాలన్నారు. ప్రభుత్వం అంటే పథకాలు ఇవ్వడమే కాదని, ఆయా రంగాలను బలోపేతం చేసేందుకు సిద్ధం కావాలని చెప్పారు. 2014 తరువాత విభజన కష్టాలున్నా నాడు తీసుకున్న నిర్ణయాలతో రాష్ట్రం 13.7 శాతం వృద్ధి రేటు సాధించిందన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో రిటైల్ వృద్ధి రేటు 10.59 శాతానికి తగ్గిందని అన్నారు. 2019లో తెలంగాణాతో పోలిస్తే ఎపి జిఎస్‌డిపిలో వ్యత్యాసం కేవలం 0.20 శాతం ఉండేదని, ఆ వ్యత్యాసం 2024కు 1.5 శాతానికి పెరిగిందని సిఎం తెలిపారు. 2014-15 మధ్య రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం రూ.93,903 ఉండగా తెలుగుదేశం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో 2019 నాటికి రూ.1,54,031 పెరిగిందని చెప్పారు. టిడిపి హయాంలో తలసరి ఆదాయం వృద్ధిరేటు 13.21 శాతం ఉండగా గత ప్రభుత్వంలో అది 9.06 శాతానికి పడిపోయిందన్నారు. గతంలో తెలంగాణాకు, ఎపికి మధ్య తలసరి ఆదాయంలో వ్యత్యాసం 0.16 శాతం ఉంటే గత ప్రభుత్వంలో అది 1.84 శాతానికి పెరిగిందన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో ఎపి తలసరి ఆదాయంలో ఐదో స్థానంలో ఉందన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ శాఖలు విజన్ సిద్ధం చేసుకుని నిర్దిష్ట లక్ష్యాలతో పనిచేయాలని అధికారులకు సూచించారు. కొన్ని శాఖలు వెనుకబడి ఉన్నాయని, ఆయా శాఖలు ముందుకు రావాలని తెలిపారు. ఈ మూడు రంగాల్లో లక్ష్యాలపై ప్రణాళికలతో రావాలని సిఎం అధికారులను ఆదేశించారు. జనవరిలో పి4 విధానాన్ని ఆచరణలోకి తెస్తామన్నారు. ఈ విధానం ద్వారా సమాజంలో ఆర్థికంగా ఉన్నతస్థానంలో ఉన్నవారు ఆర్థికంగా అట్టడుగున 10 శాతం మందిని పైకి తీసుకువచ్చేందుకు సహాయం చేయాలని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే పథకాలతో పాటు సంపన్నులు, సంస్థలు, సిఎస్ఆర్ ద్వారా పేదల జీవన ప్రమాణాలు పెంచే అవకాశాలు కల్పించడానికి దోహదపడాలని సిఎం సూచించారు.

దలాల్ ధమాల్

ఒక్క రోజులోనే రూ.11 లక్షల కోట్ల సంపద ఆవిరి
సెన్సెక్స్ భారీ పతనం
ముడిచమురు ధరలకు రెక్కలు

ముంబయి : లెబనాన్‌లో ఇజ్రాయిల్ భూతల దాడులు, ఇరాన్ ప్రతీకార దాడులతో పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు భారత దేశ స్టాక్ మార్కెట్లలో తీవ్ర కల్లోలం రేపాయి. గ్లోబల్ చమురు మార్కెట్‌పైన, అలాగే ఆర్థిక వ్యవస్థపైనా ప్రభావం చూపాయి. యుద్ధ భయంతో 5,579.35 కోట్ల విలువైన విదేశీ సంస్థాగత పెట్టుబడులు వెనక్కి పోవడంతో దలాల్ స్ట్రీట్ ధమాల్‌మంది. బిఎస్ఇ సెన్సెక్స్ 1800 పాయింట్లు పతనమైంది. ఒక్క రోజులోనే 11 లక్షల కోట్ల రూపాయల మదుపర్ల సంపద ఆవిరైంది. భారత స్టాక్ మార్కెట్లు గురువారం ఉదయం నుంచి పతనోన్ముఖంగానే సాగాయి. దీనికి తోడు ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్‌పై సెబీ తీసుకున్న నిర్ణయాలు కూడా స్టాక్ మార్కెట్‌పై ప్రభావం చూపాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో మూడవ అతి పెద్ద పతనం ఇది. ఏ దశలోనూ ఈ పతనం ఆగలేదు. దీంతో బిఎస్ఇ సెన్సెక్స్ దాదాపు 1800 పాయింట్లు మేర పతనమయింది. సెన్సెక్స్ ఇంట్రాడేలో 82,449 పాయింట్ల కనిష్టాన్ని తాకింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు మూడు శాతం మేర పెరిగి బ్యారెల్ 75 డాలర్లకు చేరుకుంది. జెఎస్‌డబ్ల్యు స్టీల్ షేర్లు గ్రీన్‌లో ట్రేడింగ్ కాగా, మిగిలిన షేర్లన్నీ నెత్తురోడాయి. బాగా నష్టపోయినవాటిలో లార్సెన్ అండ్ టుబ్రో, ఎస్ అండ్ పి, టాటా మోటార్స్, రిలయెన్స్, మారుతి సుజుకీ కంపెనీలు ఉన్నాయి. చైనా అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజుల పాటు సెలవు ప్రకటించడంతో శుక్రవారం అక్కడి స్టాక్ మార్కెట్లు అన్నీ మూతపడ్డాయి. లండన్, పారిస్, ఫ్రాంక్‌ఫర్ట్ స్టాక్ ఎక్స్ఛేంజిలు ఉదయం డీల్స్ గ్రీన్‌లో ట్రేడ్ అయినా, మధ్యాహ్నం డీల్స్ రెడ్‌లో ట్రేడింగ్ అయ్యాయి. వాల్ స్ట్రీట్ షేర్లు కూడా పతనమయ్యాయి. వడ్డీ రేట్లపై అమెరికన్ ఫెడరల్ రిజర్వు తీసుకోనున్న నిర్ణయంపై ఊహాగానాలు, పశ్చిమాసియా నుంచి చమురు సరఫరాకు అవరోధాలు ఇవన్నీ యూరప్, అమెరికాలో స్టాక్ మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపాయి.

నష్టాల ప్రయాణం ఇలా...

బాంబే స్టాక్ ఎక్స్ఛేంజిలో 83,002 పాయింట్లతో నష్టాలతో ప్రారంభమైన సెన్సెక్స్ (క్రితం ముగింపు 84,266) రోజంతా క్షీణిస్తూనే ఉంది. ఏ దశలోనూ మదుపరులకు ఊరట లభించలేదు. 1,769 పాయింట్లు లేదా 2 శాతం పతనమై చివరకు 82,497 వద్ద ముగిసింది. ఒక దశలో ఇది 82,434 కనిష్టాన్ని తాకింది. మరోవైపు నిఫ్టీ 547 పాయింట్లు లేదా 2.12 శాతం క్షీణించి 25,250 వద్ద ముగిసింది. దీంతో బిఎస్ఇలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.474 లక్షల కోట్ల నుంచి రూ.465 లక్షల కోట్లకు పడిపోయింది. గతంలో సార్వత్రిక ఎన్నికల ఫలితాల సమయంలో జూన్ 4న సెన్సెక్స్ అత్యధికంగా 4,390 పాయింట్లు పతనమయ్యింది. ఆగస్టు 5న మరో 2,223 పాయింట్లు కోల్పోయింది. ఆ తర్వాత ఇదే అతిపెద్ద నష్టం కావడంతో మదుపర్లు బోరుమన్నారు.

2024లో సెన్సెక్స్ పతనం

తేది	పాయింట్లు
జూన్ 4	4390
ఆగస్టు 5	2223
అక్టోబర్ 3	1832
జనవరి 17	1628
సెప్టెంబర్ 30	1272
మే 9	1062
జనవరి 23	1053
సెప్టెంబర్ 6	1017

ఒక్కటి మాత్రమే...

సెన్సెక్స్-30లో జెఎస్‌డబ్ల్యు స్టీల్ సూచీ మాత్రమే 1.18 శాతం రాణించింది. మిగిలిన 29 సూచీలు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. నిఫ్టీ 50లో జెఎస్‌డబ్ల్యు స్టీల్, ఒఎన్‌జిసి స్టాక్స్ మాత్రమే లాభపడ్డాయి. ప్రధానంగా హెచ్‌డిఎఫ్‌సి, మిగతా 2లో

తొలిరోజు టెట్ ప్రశాంతం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) తొలిరోజు ప్రశాంతంగా జరిగింది. తొలిరోజు గురువారం స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజెస్ పరీక్షకు 23,301 మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 20,413 మంది పరీక్షకు హాజరయ్యారని టెట్ కన్వీనర్ ఎంవి కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9:30 నుంచి 12 గంటల వరకు జరిగిన తొలి సెషన్‌కు 12,732 మందిని కేటాయించగా, 11,091 (87.11 శాతం) మంది 63 పరీక్ష కేంద్రాల్లో హాజరయ్యారు. మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటలకు జరిగిన పరీక్షకు 10,569 మందిని కేటాయించగా, 9,322 (88.20 శాతం) హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా టెట్ కేంద్రాలను రాష్ట్ర పరిశీలకులు, జిల్లా కలెక్టరు ఆధ్వర్యాన జిల్లా విద్యాశాఖ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్ తనిఖీ చేశారని కన్వీనర్ వెల్లడించారు.

'పౌరసరఫరాల'పై ఆర్థికభారం

- రూ.37,750 కోట్ల వరకు అప్పులు
- సగటున వడ్డీయే 8.76 శాతం
- సబ్సిడీ బకాయిలివ్వని రాష్ట్ర ప్రభుత్వం

3

సనాతన ధర్మం కోసం చట్టం

- తిరుపతి వారాహి సభలో పవన్‌కల్యాణ్
- విద్వేష, వివాదాస్పద వ్యాఖ్యలు

బహిరంగ సభలో వారాహి డిక్లరేషన్ చూపుతున్న పవన్ కల్యాణ్

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో, తిరుపతి సిటీ

సనాతన ధర్మం కోసం దేశమంతా అమలయ్యేలా బలమైన చట్టాన్ని తీసుకురావాలని జనసేన అధినేత, రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. తిరుమల శ్రీవారి దర్శనానంతరం గురువారం తిరుపతి బాలాజీ కాలనీలో జరిగిన వారాహి సభలో ఆయన వారాహి డిక్లరేషన్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన ప్రసంగం వివాదాస్పదంగా మారింది. 'ఎవరి మతం వారికి గొప్ప' .. 'నా జీవితంలో ఇలా మాట్లాడే రోజు వస్తుందనుకోలేదు' అని అంటూనే పవన్ రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. తిరుమల ప్రసాదంపై అత్యున్నత న్యాయస్థానంలో విచారణ జరుగుతున్న సమయంలోనే కోర్టులనూ తప్పుపట్టేలా వ్యాఖ్యలు చేశారు. సభ అనంతరం 'అతనికంటే ఘనుడు ఆచంట మల్లన్న ..' అన్నట్లు విద్వేషం వెదజల్లడంలో ఆర్ఎస్ఎస్, సంఘ్‌పరివార్‌లను పవన్ మించిపోయారన్న అభిప్రాయం పలువురిలో వ్యక్తమైంది. అంతకుముందు వారాహి డిక్లరేషన్‌లో భాగంగా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సనాతన ధర్మంపై ఒకే గొంతు వినిపించాలన్నారు. సనాతన ధర్మ విశ్వాసాలకు భంగం కలుగచేసే చర్యలు అరికట్టడానికి దేశమంతా అమలయ్యేలా బలమైన చట్టాన్ని తక్షణం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ చట్టాన్ని అమలు చేసేలా జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో సనాతన ధర్మ పరిరక్షణ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ బోర్డులకు ప్రతి ఏటా నిధులు కేటాయించాలన్నారు. సనాతన ధర్మాన్ని కించపరచి, ద్వేషం చిమ్మే వ్యక్తులకు, వ్యవస్థలకు సహాయ నిరాకరణచేయాలని చెప్పారు. ఆలయాల్లో జరిగే నైవేద్యాలు, ప్రసాదాల్లో వినియోగించే వస్తువుల స్వచ్ఛతని ధ్రువీకరించే విధానాన్ని తీసుకురావాలన్నారు. ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగా మాత్రమే కాకుండా, విద్యా కేంద్రాలుగా, కళా కేంద్రాలుగా, పర్యావరణ పరిరక్షణ కేంద్రాలుగా, సంక్షేమ కేంద్రాలుగా రూపుదిద్దుకోవాలన్నారు. ఆ దిశలో ఒక ప్రణాళిక రూపొందించాలన్నారు. ఏ మతానికి, ఏ ధర్మానికి భంగం కలిగినా ఒకేలా స్పందించే లౌకిక వాదాన్ని పాటించాలని చెబుతూనే మతం ప్రాతిపదికన విమర్శలు చేశారు. 'ఇస్లాం దేశాల మాటలు సూడో సెక్యులరిస్టులకు వినిపించవు. బంగ్లాదేశ్ ఇస్లాం రాజ్యంగా ప్రకటించుకున్నా ఎవరు ఒక్క మాట అనరు' మిగతా 2లో

వరద బాధితులందరికీ న్యాయం చేయండి

- లేకపోతే మంత్రుల ఇళ్లముందు ధర్నా : సిపిఎం హెచ్చరిక

కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొన్న బాబూరావు, డివి కృష్ణ, శ్రీదేవి, వరద బాధితులు

ప్రజాశక్తి-విజయవాడ

వరద బాధితులందరికీ పరిహారం ఇవ్వాలని, లేనిపక్షంలో మంత్రుల ఇళ్ల ముందు ధర్నా చేయడానికైనా వెనుకాడబోమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు హెచ్చరించారు. వరద బాధితులకు తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. సింగ్‌నగర్‌లోని వాంబేకాలనీ, పైపుల రోడ్డు, ఎల్‌బిఎస్ నగర్, రాజీవ్‌నగర్, రాధానగర్, ఆర్ఆర్‌పేట, శాంతి నగర్, ప్రకాష్ నగర్, జక్కంపూడి కాలనీ, కండ్రిక తదితర ప్రాంతాల్లోని వరద బాధితులు పెద్ద ఎత్తున ధర్నాలో పాల్గొన్నారు. బాధితులందరికీ పరిహారం పెంచాలని, నష్టం అంచనా లోపాలను సరిచేయాలని, ఆటో రిపేర్లకు రూ.25 వేలు, ద్విచక్రవాహనానికి రూ.10 వేలు పరిహారం ఇవ్వాలని నినదించారు. ధర్నానుద్దేశించి బాబూరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన నష్ట పరిహారం రూ.25 వేలు చాలదని, దానిని రూ.50 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఫస్ట్ ఫ్లోర్ వారికి రూ.20 వేలు ఇవ్వాలని కోరారు. నష్టపరిహారం అందలేదని పెట్టుకున్న అర్జీలను వెంటనే పరిశీలించి, వారందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్ఒ శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ వరద బాధితుల నుంచి స్వీకరించిన దరఖాస్తులన్నింటినీ సమగ్రంగా పరిశీలించి, అర్హులందరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. సిపిఎం వెస్ట్ సిటీ కార్యదర్శి బోయి సత్యబాబు అధ్యక్షతన జరిగిన ధర్నాలో రాష్ట్ర కమిటీ సభ్యులు కె శ్రీదేవి, జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, విజయవాడ సెంట్రల్ సిటీ కార్యదర్శి భూపతి రమణారావు, తూర్పు సిటీ ఇన్‌చార్జి కార్యదర్శి పి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు నలుగురు మృతి

ప్రజాశక్తి-యంత్రాంగం

వేర్వేరు జిల్లాల్లో పిడుగులు పడి నలుగురు ప్రాణాలు కోల్పోయారు. కడప జిల్లాలో ముగ్గురు, బాపట్ల జిల్లాలో ఓ విద్యార్థిని మరణించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లా పెండ్లిమర్రి మండలం తుమ్మలూరుకు చెందిన నందిరెడ్డి శివపార్వతి (30), ఆమె మరిది కుమారుడు నందిరెడ్డి తేజేశ్వర్‌రెడ్డి(10) తమ పశువులను మేపేందుకు గ్రామ పరిసరాలకు వెళ్లారు. అదే గ్రామంలో పగడాలపల్లి గ్రామానికి చెందిన జి మారుతి ప్రసాద్‌రెడ్డి (30), నాగాయపల్లెకు చెందిన కర్ణాటి నరేష్ కుమార్‌రెడ్డి కూడా తుమ్మలూరులో వ్యవసాయ పనులకు వచ్చారు. గురువారం సాయంత్రం భారీ వర్షంతోపాటు పిడుగు పడటంతో శివపార్వతి, తేజేశ్వర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. నరేష్ కుమార్‌రెడ్డి తీవ్రంగా గాయపడటంతో, సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. బాపట్ల నగరంలోని నరాలశెట్టివారిపాలేనికి చెందిన నూతక్కి తులసి (20) బాపట్ల ఎన్‌టిఆర్ ఫుడ్ టెక్నాలజీ కళాశాలలో బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. దసరా సెలవులకు చీరాలలోని అమ్మమ్మ ఇంటి వచ్చిన ఆమె ఆరేసిన దుస్తులు తెచ్చేందుకు డాబాపైకి వెళ్లారు. అదే సమయంలో పిడుగు పడడంతో అక్కడికక్కడే మరణించారు.

నిర్వాసితుల గొంతు ఏచూరి

- ప్రజలను ముంచి ప్రాజెక్టు కట్టొద్దని ఉద్యమం
- కూనవరం సంస్మరణ సభలో వి.శ్రీనివాసరావు

సంస్మరణ సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, వేదికపై పలు పార్టీల నాయకులు

ప్రజాశక్తి - కూనవరం, చింతూరు, విఆర్.పురం విలేకరులు (అల్లూరి జిల్లా)

పోలవరం నిర్వాసితుల పక్షాన కడవరకూ పోరాడిన నాయకుడు సీతారాం ఏచూరి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. పోలవరం సమస్య పరిష్కారం కోసం ఆయన నాయకత్వంలో నాటి ప్రధాని మన్మోహన్ సింగ్‌ను కలిసినప్పుడు ప్రజలను ముంచి ప్రాజెక్టు కట్టవద్దని, కడితే నిర్వాసితులతో కలిసి అడ్డుకుంటామని హెచ్చరించిన ధీశాలి అని తెలిపారు. 20 సంవత్సరాల పాటు పోలవరం నిర్వాసితుల కోసం తనదైన శైలిలో పోరాటాన్ని ముందుకు తీసుకెళ్లారని కొనియాడారు. అల్లూరి జిల్లా కూనవరం మండలంలోని టేకులబోరులోని భాస్కర ఫంక్షన్ హాల్‌లో గురువారం సీతారాం ఏచూరి సంస్మరణ సభ జరిగింది. పలు పార్టీల నాయకులు హాజరై ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల సమయంలో కూనవరంలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొని మతోన్మాద బిజెపిని ఓడించాలని పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. అప్పటికే అనారోగ్యంతో బాధపడుతున్నప్పటికీ సభకు వచ్చిన జన ప్రవాహాన్ని చూసి ఉప్పొంగిపోయారన్నారు. నేడు ప్రజాస్వామ్యం, లౌకికవాదం ప్రమాదంలో ఉన్నాయని, దేశంలో అన్ని కులాలు, మతాలు ఐక్యంగా ఉంటేనే దేశం ఒక్కటిగా బలంగా ఉంటుందని అన్నారు.

పౌర హక్కులకు, ప్రజల స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలకు భంగం వాటిల్లకుండా కాపాడాల్సిన బాధ్యత అన్ని పార్టీలపైనా ఉందన్నారు. నరేంద్ర మోడీ తెచ్చిన జమిలి ఎన్నికలను ఏచూరి స్ఫూర్తితో వ్యతిరేకించాలని, ప్రజాస్వామ్యానికి జమిలి ఎన్నికలు గొడ్డలి పెట్టు అని అన్నారు. ఆనాడు అటవీ హక్కుల చట్టం, ఉపాధి హామీ చట్టం కోసం యుపిఎ ప్రభుత్వ కాలంలో ఏచూరి పార్లమెంట్‌లో తన గొంతు వినిపించారని కొనియాడారు. అనంతరం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ బిజెపి దుర్మార్గ వైఖరులను ధైర్యంగా ఎదుర్కొని ఇండియా బ్లాక్ ఏర్పాటుకావడంలో ఏచూరి ప్రముఖ పాత్ర వహించారన్నారు. పిసిసి సభ్యులు ఎమ్‌డి హబీబ్ మాట్లాడుతూ.. అభ్యుదయ భావాల, విప్లవ పోరాటాల ప్రతినిధి ఏచూరి అని అన్నారు. టిడిపి నాయకులు ఎడవల్లి భాస్కర్ మాట్లాడుతూ.. ఏచూరి వంటి గొప్ప మిగతా 2లో

జైళ్లలోనూ కుల వివక్షేనా?

ఖైదీలకు కులాల ఆధారంగా పనులు అమానవీయం
బందీలందరినీ సమానంగా చూడాలి
జైలు మాన్యువల్స్‌లో నిబంధనలు సవరించాలి
రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశాలు

న్యూఢిల్లీ : జైళ్లలో కుల ఆధారిత వివక్షను భారత సర్వోన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. ఆ వివక్షకు ముగింపు పలకాలని సుప్రీంకోర్టు తెలిపింది. ఖైదీలందరినీ సమానంగా చూడాలని వివరించింది. పలు రాష్ట్రాల జైలు మాన్యువల్స్‌లోని వివక్షతతో కూడిన నిబంధలను తక్షణమే సవరించాలని న్యాయస్థానం ఆదేశించింది. జైళ్లలో ఖైదీలను వారి కులంతో సంబంధం లేకుండా సమానంగా చూడాలనీ, కులం ఆధారంగా పనిని వేరు చేసి, కేటాయించే పద్ధతులను విడనాడాలని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం నొక్కి చెప్పింది. జైలు ప్రోటోకాల్‌లో ఈ మేరకు తక్షణమే మార్పులు చేపట్టాలంటూ రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. ఖైదీలందరికీ.. వారి కులాలతో సంబంధం లేకుండా, జైలు వ్యవస్థలో సమాన హక్కులు, అవకాశాలు కల్పించాలని చెప్పింది. మురుగు కాలువలు, ట్యాంకులు శుభ్రపర్చటం వంటి ప్రమాదకరమైన పనులు చేయటానికి కొంత మంది ఖైదీలను వారి కులం కారణంగా అప్పగించటం అమానవీయం, అన్యాయమని పేర్కొంది. కులం ఆధారంగా స్వీపర్ల ఎంపిక, శుభ్రపరిచే పనులు కేటాయించడం ఇకపై చెల్లదని చెప్పింది.

సామాజికవేత్తల హర్షం

కొన్ని రాష్ట్ర జైలు మాన్యువల్స్‌లో తీవ్రంగా ఉన్న కుల ఆధారిత వివక్షను ఎత్తి చూపుతూ మహారాష్ట్రలోని కళ్యాణ్ నివాసి సుకన్య శాంత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న సుప్రీంకోర్టు ధర్మాసనం జైలు వ్యవస్థలో కుల ఆధారిత వివక్షకు చోటు ఉండరాదని హెచ్చరించింది. ఖైదీలందరి గౌరవం, హక్కుల పరిరక్షణలో ఈ తీర్పు ఒక ముఖ్యమైన ముందడుగు అని సామాజికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. కులం, మతం, ప్రాంతం పేరిట ఏ వ్యక్తీ వివక్షకు గురి కాకూడదనే ఆలోచనను (ముఖ్యంగా జైలు వంటి ప్రభుత్వ సంస్థలలో) సుప్రీం బలపర్చిందని వారు పేర్కొన్నారు.

కిడ్నీ వ్యాధితో ఒకరు మృతి

ప్రజాశక్తి-గంపలగూడెం (ఎన్‌టిఆర్ జిల్లా)

సోమిలి

కిడ్నీ వ్యాధితో ఒకరు మృతి చెందిన సంఘటన ఎన్‌టిఆర్ జిల్లా గంపలగూడెం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... వినగడప గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న (తండా)కు చెందిన గుగులోతు సోమిలి (52) గత నాలుగేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. ఆమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వ్యాధి తీవ్రతరం కావడంతో ఇంటి వద్దే మరణించారు. సోమిలి భర్త కేశ్యా 15 సంవత్సరాల క్రితం ఇదే వ్యాధితో మృతిచెందారు.

చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా ఉండవల్లి గ్రామ పరిధిలోని నారా చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో మాజీ మంత్రి జోగి రమేష్ అనుచరులైన ఆరుగురు ముద్దాయిలను అరెస్టు చేసినట్లుగా మంగళగిరి నార్త్ జోన్ డిఎస్‌పి సిహెచ్ మురళీకృష్ణ గురువారం తెలిపారు. అరెస్టు అయిన వారిలో బి.అనిల్ కుమార్, జి.నాగ తేజ పద్మనాభరావు, ఎన్.మధుబాబు, వి.సుబ్బారావు, డి.మాధవరావు, కె.రాముల ఉన్నారు. వీరిని మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించారన్నారు. గతంలో ఈ కేసులో ఎనిమిది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడం జరిగిందని తెలిపారు.

నందిగం సురేష్ రిమాండ్ పొడిగింపు

వైసిపి మాజీ ఎంపి నందిగం సురేష్‌కు మంగళగిరి కోర్టు మరో 14 రోజులు రిమాండ్ విధించింది. గత వైసిపి ప్రభుత్వం హయాంలో టిడిపి కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో నందిగామ సురేష్‌ను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో సురేష్‌ను విచారించేందుకు న్యాయస్థానాన్ని పోలీసులు కస్టడీకి కోరారు. విచారణ అనంతరం ఆయనను న్యాయస్థానం ముందు హాజరపరచగా మరో 14 రోజులు రిమాండ్ పొడిగించింది.

వేతనాలు పెంచాలి

- కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న తమకు వేతనాలు పెంచాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అసోసియేషన్ రాష్ట్రస్థాయి సమావేశం గురువారం విజయవాడలో జరిగింది. గత ఐదేళ్లుగా వేతనాలు పెంచలేదని, నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులతో సమానంగా 23 శాతం పెంచాలని కోరింది. 8 నెలలుగా బకాయిపడ్డ ఇన్సెంటివ్స్ తక్షణమే విడుదల చేయాలని, పిఎఫ్ పునరుద్ధరించాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, కేంద్ర మార్గదర్శకాల ప్రకారం సిహెచ్‌ఒల రెగ్యులరైజేషన్ ప్రక్రియ సత్వరంగా మొదలుపెట్టాలని, అప్పటి వరకు ఎంటిఎం స్కేల్ అమలు చేయాలని తెలిపింది. ఈ డిమాండ్లతో రాష్ట్ర అధికారులను ఆశ్రయించినప్పటికీ ప్రయోజనం లేదని పేర్కొంది. వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చొరవ తీసుకుని తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేసింది. అప్పటి వరకు ఆందోళన కార్యక్రమాలు చేపట్టబోతున్నామని వెల్లడించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నేషనల్ హెల్త్ మిషన్ జెఎసి గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు, అసోసియేషన్ ఉపాధ్యక్షులు పులి ప్రేమ్‌కుమార్, రాజేశ్వరి, ప్రమోద్, మధుసుధాకర్, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మం కోసం చట్టం

(మొదటి పేజీ తరువాయి)

అని అన్నారు. 'లౌకికవాదం పేరుతో హిందువుల నోరు నొక్కేస్తున్నారని, హిందువులకు అన్యాయం జరిగితే మాట్లాడే హక్కు లేదు' అని చెప్పారు. ఈ క్రమంలోనే న్యాయస్థానాల మీద కూడా పవన్ కొన్ని వ్యాఖ్యలు చేశారు.

మెకాలే తెచ్చిన వివక్ష అట!

సనాతన ధర్మంలో ఎటువంటి వివక్ష లేదని కూడా పవన్ చెప్పారు. 'సనాతన ధర్మానికి రంగు లేదు, వివక్ష లేదు. ఇప్పుడు కనపడేదంతా మెకాలే తీసుకువచ్చిన వివక్ష. హిందూ సమాజాన్ని కులాలు, ప్రాంతాల వారీగా విభజించారు' అని ఆయన అన్నారు. 'మనం పళ్ల బిగువున బాధను భరించాలా? మన సమాజంలో ఐక్యత లేకపోవడమే దీనికి కారణం. మన మతం గురించి మాట్లాడుకోవాలంటే భయపడే పరిస్థితికి వచ్చాం. ధైర్యం, వీరత్వమే మన సమాజ వికాసానికి మూలం. హిందువులంతా ఏకమయ్యే రోజు వచ్చింది.' అని రెచ్చగొట్టారు.

నిర్వాసితుల గొంతు ఏచూరి

(మొదటి పేజీ తరువాయి)

కమ్యూనిస్టు మేధావి దేశానికే కాదు ప్రపంచానికే ఒక దిక్సూచి లాంటివారన్నారు. ఆయన లేని లోటు పూడ్చలేనిదన్నారు. వైసిపి నాయకులు మరియదాసు మాట్లాడుతూ.. భారతదేశానికి దిశా నిర్దేశం చేసిన గొప్ప వ్యక్తి ఏచూరి అని కొనియాడారు. సిపిఐ నాయకులు గుజ్జా మోహన్‌రావు మాట్లాడుతూ.. సీతారాం ఏచూరి సేవలు చిరస్మరణీయమన్నారు. సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ అధ్యక్షతన జరిగిన సంస్మరణ సభలో విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, జనసేన నాయకులు సాంబశివ, సిపిఎం నాయకులు లోతా రామారావు, మర్లపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ఉద్యమం ఉధృతం

- దీక్షలో రైతు సంఘాల నాయకుల హెచ్చరిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ స్టీలు ప్లాంటు ప్రైవేటీకరణను నిలిపివేయకపోతే ప్రజాఉద్యమం తీవ్రమవుతుందని రైతు సంఘాల నాయకులు హెచ్చరించారు. విశాఖ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రైతు సంఘాల ఆధ్వర్యాన గురువారం విజయవాడ ధర్నా చౌక్‌లో దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ 4,300 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. కార్మికుల తిరుగుబాటు ఫలితంగా శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందనే భయంతో మరలా పాస్‌లు ఇచ్చారని పేర్కొన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ కోసం ప్రభుత్వం తీసుకునే ఎటువంటి చర్యనైనా కార్మిక, కర్షక వర్గం తిప్పికొడుతుందని హెచ్చరించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నరసింగరావు మాట్లాడుతూ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉత్తరాంధ్రలో ఉద్యమం తీవ్రరూపం దాల్చిందని అన్నారు. ప్రతిరోజూ వేలమంది నిరసన వ్యక్తం చేస్తూ రోడ్లపైకి వస్తున్నారని చెప్పారు. విశాఖపట్నం స్టీలుప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలని, సొంతగనులు, వనరులు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో చంద్రబాబు, పవన్, పురందేశ్వరి ఇచ్చిన వాగ్దానాలు అమలుచేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు మాట్లాడుతూ ఇప్పటికే రెండు సెక్షన్లు మూసివేశారని, మూడోది కూడా మూసివేసేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. బిజెపి ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేసి బడా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ దీక్షల్లో రైతు సంఘాల నాయకులు ప్రభాకరరెడ్డి, కృష్ణయ్య, ఆంజనేయులు, సూర్యనారాయణ, హరినాథ్, వెంకటరెడ్డి, మరీదు ప్రసాద్‌బాబు, వీరబాబు, విజయబాబు, గణేష్‌బాబు, కెవివి ప్రసాదు, జమలయ్య, యలమందరావు, కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి పాల్గొన్నారు. ప్రపంచశాంతి వర్ధిల్లాలని, యుద్ధంవద్దు, శాంతి ముద్దని, ఇజ్రాయిల్, పాలస్తీనా యుద్ధం తక్షణమే ఆపాలని నేతలంతా డిమాండ్ చేశారు.

సిఐటియు, ఆశా వర్కర్స్ యూనియన్ నేతలపై కేసు కొట్టివేత

- ఏడేళ్లకుపైగా సాగిన విచారణ

ప్రజాశక్తి - విజయవాడ

ఆశా వర్కర్లకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 2017లో డిఎంహెచ్‌ఒ కార్యాలయం ముట్టడికి ప్రయత్నించిన పది మంది సిఐటియు, ఆశా వర్కర్స్ యూనియన్ నేతలపై పోలీసులు పెట్టిన అక్రమ కేసును గురువారం విజయవాడ మూడో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు కొట్టేసింది. 2005లో ఏర్పాటైన ఆశాల వ్యవస్థలో ఆశాలకు ప్రభుత్వం కేవలం పారితోషికాలు మాత్రమే ఇస్తోంది. అప్పటికి 12 ఏళ్లుగా సేవలందిస్తున్న ఆశాలు తమకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు 2017 జూన్ 12న విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా చేపట్టారు. ధర్నాకు జిల్లా నలుమూలల నుండి పయనమైన వందలాది మంది ఆశాలను పోలీసులు అడుగడుగునా అడ్డగించారు. అడ్డంకులను అధిగమించి వేలాదిగా తరలివచ్చిన ఆశాలతో విజయవాడ ధర్నా చౌక్ దద్దరిల్లింది. అయినా అధికారులు స్పందించకపోవడంతో అక్కడి నుండి ప్రదర్శనగా వెళ్లి పాత ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఉన్న జిల్లా వైద్య, ఆరోగ్యాధికారి కార్యాలయం ముట్టడికి ప్రయత్నించారు. దీంతో పోలీసులు బలవంతంగా ఆశాలను, సిఐటియు, ఆశా వర్కర్స్ యూనియన్ నేతలను అరెస్టు చేసి నగరంలోని పలు స్టేషన్లకు తరలించారు. ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి, ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల, సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్.శ్రీనివాస్, ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల నాయకులు ఎం.శ్రీనివాస్, కె.దుర్గారావు, బి.వెంకటేశ్వరరావు, వి.గంగాధర్ ప్రసాద్, సిహెచ్.జయరావు, కె.రామరాజుపై ఐపిసి 143, 149, 188, 290, 341 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసును విజయవాడ మూడో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు విచారించింది. అయితే పోలీసులు నేరాన్ని నిరూపించడంలో విఫలమయ్యారు. దీంతో కోర్టు గురువారం ఈ కేసును కొట్టివేస్తూ తీర్పు నిచ్చింది. నేతల తరపున ఆలిండియా లాయర్స్ యూనియన్ నాయకులు దుర్గా శ్రీనివాసరావు వాదించారు.

కార్గో సేవలు మరింత విస్తరణ

- మత్స్య ఉత్పత్తుల ఎగుమతులకు కేరాఫ్‌గా రాష్ట్రం
- మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల కార్యదర్శి సురేష్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కార్గో సేవలను మరింత విస్తరిస్తామని, కార్గో హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల కార్యదర్శి ఎస్ సురేష్‌కుమార్ తెలిపారు. రాష్ట్రంలో కార్గో సేవల విస్తరణపై ఎపి ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు (ఎపిఇడిబి), ఎపి ఎయిర్‌పోర్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎపిఎడిసిఎల్), కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ), ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్స్ (ఎఫ్ఐఇఒ), ఎపి ఛాంబర్స్ ఆధ్వర్యాన స్టేక్ హోల్డర్స్ కన్సల్టేషన్ కార్యక్రమం గురువారం విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో జరిగింది. కార్గో సేవల విస్తరణలో కనెక్టివిటీ చాలా ముఖ్యమని సురేష్‌కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్ర విజన్ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారని చెప్పారు. కోడిగుడ్ల ఉత్పత్తిలో రాష్ట్రం ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ఐదు పోర్టులు, మూడు ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులు ఉన్నాయని చెప్పారు. కొత్తగా కుప్పం, మూలపేట తదితర ప్రాంతాల్లో ఇండస్ట్రీ క్లస్టర్స్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారని తెలిపారు. ఈ క్లస్టర్లలో అగ్రికల్చర్, హార్టీకల్చర్, ఫిషరీస్, ఫార్మా, ఫుడ్ ప్రాసెసింగ్, హెల్త్ సెక్టార్లకు ప్రాధాన్యం ఉంటుందని వెల్లడించారు. కొత్త ఎయిర్‌పోర్టులు అందుబాటులోకి వస్తే ప్రాంతీయ కనెక్టివిటీ బాగా పెరుగుతుందని, తద్వారా సరుకు రవాణా వేగవంతమవుతుందని చెప్పారు. హార్టికల్చర్, ఆక్వాకల్చర్, ఫిషరీస్ కార్యదర్శి ఎ బాబు మాట్లాడుతూ.. క్లస్టర్ ఆధారిత విధానాన్ని అనుసరించి సామర్థ్యాన్ని పెంచి, ఎగుమతులను పెంపొందిస్తే వ్యవసాయ రంగంలో స్థిరమైన వృద్ధిని సాధించడానికి దోహదపడతాయని అన్నారు. ఇండస్ట్రీస్ అండ్ కామర్స్, ఫుడ్ ప్రాసెసింగ్ కార్యదర్శి ఎన్ యువరాజ్ వర్చువల్ విధానంలో మాట్లాడుతూ.. క్వాలిటీ ప్రొడక్టవిటీ ద్వారా గ్రోత్ సాధించవచ్చని అన్నారు. ఎపిఎడిసిఎల్ ఎమ్‌డి సివి ప్రవీణ్ ఆదిత్య, డైరెక్టర్ లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ.. ఎయిర్ కార్గో సేవలను మరింత వినియోగించుకోవడం ద్వారా అగ్రికల్చర్, హార్టికల్చర్, ఆక్వాకల్చర్, ఫిషరీస్, మెడికల్, ఫార్మా సెక్టార్లలో మరింత వృద్ధి సాధించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఐ కార్గో లాజిస్టిక్స్ అండ్ అలైడ్ సర్వీసెస్ కంపెనీ సిఇఒ అజయ్‌కుమార్, హైదరాబాద్ ఎయిర్‌పోర్టు అండ్ ప్లానింగ్ కమర్షియల్ హెడ్ కార్గో జె ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్, గంజాయి నివారణకు 'స్టేట్ టాస్క్‌ఫోర్స్'

- మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం
- మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం :అనిత

మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో మాట్లాడుతున్న లోకేష్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ లక్ష్యమని, దీనిలో భాగంగా మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపేందుకు స్టేట్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నామని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. మాదక ద్రవ్యాలు గంజాయి నివారణపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశం గురువారం వెలగపూడి సచివాలయంలో జరిగింది. సమావేశ వివరాలను మంత్రి వివరించారు. రాష్ట్రంలో నార్కోటిక్ కంట్రోల్ సెల్ ఏర్పాటు చేసి నిఘా పెంచుతామన్నారు. డ్రగ్స్ వాడకాన్ని నియంత్రించేందుకు కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల ద్వారా పోలీసు వ్యవస్థను పటిష్టం చేస్తామని వివరించారు. వ్యూహాత్మక చెక్ పోస్టులు, హాట్‌స్పాట్లు, ప్రత్యేక ఎన్‌డిపిఎస్ బీట్లను ఏర్పాటు చేసి గంజాయి స్మగ్లింగ్‌ను అడ్డుకుంటామని తెలిపారు. టోల్‌ఫ్రీ నెంబరు ఏర్పాటు చేసి గంజాయి రవాణా ఆచూకీ తెలిపిన వారికి ప్రభుత్వం తరపున రివార్డులు అందిస్తామని వివరించారు. గంజాయి రక్కసిని అంతం చేయడమే లక్ష్యంగా విధివిధానాలు రూపొందించేందుకు అన్ని అంశాలనూ పరిశీలిస్తున్నామని అన్నారు. మందు, డ్రగ్స్ వల్ల గత ప్రభుత్వ హయాంలో ఆత్మహత్యలు రెట్టింపయ్యాయని తెలిపారు. ఎన్‌సిఆర్‌బి 2020 లెక్కల ప్రకారం దేశంలో డ్రగ్స్, ఆల్కహాల్ తీసుకుని ఆత్మహత్య చేసుకునే వారి సంఖ్యలో ఎపి ఐదో రాష్ట్రంగా ఉందని అన్నారు. సైబర్ ఇంటెలిజెన్స్ ద్వారా డ్రగ్ నెట్‌వర్కును ప్రక్షాళన చేయడమే ధ్యేయంగా పోలీసు వ్యవస్థ పనిచేయనుందని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికల ద్వారా యువత డ్రగ్స్ బారిన పడకుండా అవగాహన కల్పించడమే కాకుండా ప్రత్యేక సదస్సులు నిర్వహించి మత్తు పదార్థాలు వాడకుండా ప్రజలను చైతన్యం చేస్తామని తెలిపారు. గంజాయి రవాణా ఎక్కువగా జరిగే రాష్ట్ర సరిహద్దులు, అంతర్రాష్ట్ర ప్రాంతాలను గుర్తించి ఆయా చోట్ల పటిష్ట నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. గంజాయి నివారణకు తీసుకుంటున్న చర్యలు మరింత పటిష్టం చేసే దిశగా సాగు జరిగే ప్రాంతాల్లో డ్రోన్స్, శాటిలైట్ల ద్వారా పర్యవేక్షణ చేసి గిరిజన ప్రాంతాలను అప్రమత్తం చేస్తామని వివరించారు. గంజాయికి బానిసలు కాకుండా చూడటంలో యువత పాత్ర కీలకమని, రవాణాదారులను పట్టుకునే విషయంలో గిరిజన యువతతో చర్చించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేష్, కొల్లు రవీంద్ర, సంధ్యారాణి, సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు.

'ఇసుక'కు ప్రత్యేక కార్యాచరణ

- గనులశాఖ ముఖ్య కార్యదర్శి ఎంకె మీనా
- 15 నుంచి వినియోగంలోకి 108 రీచ్‌లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వర్షాకాలం తరువాత ఇసుక సరఫరా కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలు చేయనున్నట్లు రాష్ట్ర భూగర్భ గనులశాఖ ముఖ్యకార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. దీనిపై గురువారం ప్రకటన విడుదల చేశారు. ఇసుక లభ్యతను పెంచేందుకు జారీచేసిన జిఓ 59 ప్రకారం పట్టా భూముల నుండి ఇసుక తవ్వకాలకు కూడా అనుమతి ఉందని పేర్కొన్నారు. ఈ నెల 15 నుంచి స్టాకు యార్డులు డి సిల్టేషన్ పాయింట్లు, రీచ్‌ల ద్వారా ఇసుక డిమాండ్లను తీర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. 70 లక్షల టన్నుల సామర్థ్యంతో 108 రీచ్‌లు మాన్యువల్ పద్ధతులను ఉపయోగించి పనిచేయించడం వల్ల అన్ని జిల్లాల్లో సరఫరా పెరుగుతుందన్నారు. 2023లో జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ ఇసుక రీచ్‌లకు సంబంధించి పర్యావరణ అనుమతులు రద్దుచేసి సెమీ మెకనైజ్డ్ మైనింగ్ కోసం పబ్లిక్ హియరింగ్‌ను తప్పనిసరి చేసిందన్నారు. 2024 జూన్‌కు ముందు ఎలాంటి విచారణ జరగకపోవడంతో పురోగతి లేదని వివరించారు. వాటిని కూడా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఈ ఏడాది జూన్ తరువాత 18 పబ్లిక్ హియరింగ్‌లు పూర్తయ్యాయన్నారు. వెంటనే అదనపు రీచ్‌లను అమల్లోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. వర్షాకాలంలో ఇసుక మైనింగ్ కార్యకలాపాలు పరిమితి కారణంగా జులై నుండి ఇసుక సరఫరాకు ఇప్పటికే ఉన్న నిల్వలు మాత్రమే ఆధారం అయ్యాయని మీనా తెలిపారు. వర్షాకాలం ముగిసే వరకూ నదీగర్భాల్లో రీచ్‌లు పనిచేయకపోవడం వల్ల స్టాక్‌యార్డుల సంఖ్య జులైలో 86 నుంచి 14కు తగ్గిందని, ఆగస్టు 15 నుంచి 20 డీ సిల్టేషన్ పాయింట్లు కూడా పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. ఇసుక బుకింగ్ కోసం ఎపి శాండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ప్రారంభించామని తెలిపారు. బుకింగులను వారానికోసారి విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. సరఫరాను సులభతరం చేశామని వివరించారు. అక్రమ మైనింగ్ రవాణా నియంత్రణకు జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్‌లను బలోపేతం చేశామని వివరించారు. ఇసుక బుక్ చేసుకునేందుకు శుక్రవారం కూడా అవకాశం ఉందన్నారు.

పటిష్టంగా ఆహార భద్రతా చట్టం

- మంత్రి సత్యకుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఆహార భద్రతా ప్రమాణాల్ని పటిష్టంగా అమలు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. ఆ శాఖపై గురువారం సచివాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి వల్ల కేంద్రం విడుదల చేసిన రూ.79 కోట్లలోరూ.65 కోట్లను వినియోగించలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ఫుడ్‌సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియాతో వెంటనే ఒప్పందం చేసుకుని రాష్ట్రంలో ఆహార భద్రతా చట్టం అమలుకు చేపట్టాల్సిన చర్యలపై దృష్టిసారించాలని ఆదేశించారు. పట్టణాల్లో తాగునీటి ప్రమాణాల్ని నిరంతరం పర్యవేక్షించడానికి తగు చర్యలు చేపట్టాలని, ఆరోగ్య రక్షణ అధికారుల సంఖ్యను పెంచి నిఘా పెట్టాలని సూచించారు. ఈ సమీక్షలో వైద్యారోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎమ్‌టి కృష్ణబాబు, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ, ఫుడ్‌సేఫ్టీ కమిషనర్ సి హరికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎపి-వియత్నాం నేరుగా విమాన సర్వీసు

- వియట్‌జెట్‌కు ఎపి ఛాంబర్స్ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎపి నుంచి వియత్నాంకు నేరుగా విమాన సర్వీసులు నడపాలని వియట్‌జెట్ సిఇఒకు ఎపి ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ (ఎపి ఛాంబర్స్) అధ్యక్షులు పొట్లూరి భాస్కరరావు లేఖ రాశారు. వ్యవసాయ ఆధారితమైన ఆంధ్రప్రదేశ్ తృణ, పప్పు ధాన్యాలు, ఫుడ్ ప్రాసెసింగ్, రొయ్యల పెంపకం, సుగంధ ద్రవ్యాలు, పత్తి, నూలు, ఆటో కాంపొనెంట్స్ బల్క్ డ్రగ్ పరిశ్రమలో అగ్రగామిగా ఉందని తెలిపారు. అలాగే రొయ్యలు, నూలు ఎక్కువగా వియత్నాంకు ఎగుమతి అవుతున్నాయని, ఇక్కడి నూలుతోనే అక్కడ వస్త్రాలు ఎక్కువగా తయారవుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు వియత్నాం పర్యాటక కేంద్రంగా ఉందని, ఇండియా నుంచి వియత్నాంను సందర్శించే నాలుగు లక్షల మందిలో 30 శాతం మంది రాష్ట్రం నుంచే వెళుతున్నారని తెలిపారు. ఇక్కడ విద్యార్థులు మెడిసిన్, అగ్రిఫార్మింగ్ మొదలైన ఉన్నత చదువుల కోసమూ వెళుతున్నారని, ఈ నేపథ్యంలో నేరుగా వియత్నాంకు విమాన సర్వీసు ఉంటే రవాణా మరింత పుంజుకుంటుందని సూచించారు. విశాఖ లేదా విజయవాడ నుండి విమాన సర్వీసు పెడితే నాలుగు గంటల్లో వియత్నాం చేరుకోవచ్చని తెలిపారు. ఆదాయ వనరులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రం నుండి పర్యాటకం కోసం వియత్నాం వెళ్లేవారి సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. ఇప్పటికే వియట్‌జెట్ దేశం నుండి వారానికి 35 సర్వీసులు నడుపుతోందని, వాటిల్లో రెండు రాష్ట్రానికి కేటాయించాలని కోరారు. రెండు దేశాల మధ్య ఉన్న ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంటు కూడా ఆదాయాన్ని, రవాణాను మరింత పెంచేందుకు తోడ్పడుతుందని లేఖలో సూచించారు.

సిమెంట్ ధరలు ప్రియం

హైదరాబాద్ : సిమెంట్ ధరల్లో పెరుగుదల చోటు చేసుకుంది. ధరలు పెంచిన వాటిలో అల్ట్రాటెక్, ఇండియా సిమెంట్స్, దాల్మియా భారత్, రామ్‌కో, ఎసిసి, ఇండియా సిమెంట్స్ సహా ప్రధాన సిమెంట్ కంపెనీలు ఉన్నాయి. పెంచిన ధరలు గురువారం నుంచే అమల్లోకి వచ్చాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోనూ ఈ పెరుగుదల చోటు చేసుకుంది. తెలుగు రాష్ట్రాల్లో 50 కిలోల సిమెంట్ బస్తాపై రూ.20-30 మేర ధర పెరిగిందని సమాచారం. ముడిసరుకులు, పెరుగుతున్న రవాణా ఖర్చుల్ని తగ్గించుకోవడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

ధర్నాలో మాట్లాడుతున్న అయోధ్యరామ్

హెచ్‌ఆర్‌ఎ తొలగింపు, విద్యుత్ ఛార్జీల పెంపుపై ఉక్కు కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను దెబ్బతీస్తూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తీసుకున్న నిర్ణయాలను నిరసిస్తూ ప్లాంట్‌లోని ఇడి వర్క్స్ భవనం వద్ద ఉక్కు కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. హెచ్‌ఆర్‌ఎ తొలగింపు, విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాలను వ్యతిరేకిస్తూ పెద్ద పెట్టున నినదించారు. కార్మికుల ఆర్థిక ప్రయోజనాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ధర్నానుద్దేశించి స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె. అయోధ్యరామ్ మాట్లాడుతూ కార్మికుల హెచ్‌ఆర్‌ఎను తొలగిస్తూ ఉత్తర్వులు ఇవ్వడం దారుణమన్నారు. ఉక్కు నగరం క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న కార్మిక కుటుంబాలపై విద్యుత్ ఛార్జీల భారం మోపడం తగదన్నారు. ఆ రెండు నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల తొలగింపునకు వ్యతిరేకంగా పోరాడి కాంట్రాక్ట్ కార్మికులు విజయం సాధించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్లాంట్‌ను కాపాడుకోవడానికి, ఉద్యోగుల ప్రయోజనాలను రక్షించుకోవడానికి ఎంతటి పోరాటానికైనా సిద్ధమని స్పష్టం చేశారు. తక్షణమే ప్లాంట్‌లో ఉత్పత్తికి తగ్గ ముడిసరుకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కర్మాగారాన్ని పూర్తి సామర్థ్యంతో నడిపి, లాభాల బాట పట్టించేందుకు కార్మికులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ధర్నాలో పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

తిరుపతి లడ్డూపై విచారణ నేటికి వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) మహా ప్రసాదం లడ్డూ కల్తీపై దేశ అత్యున్నత న్యాయస్థానం విచారణను నేటికి వాయిదా వేసింది. కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభ్యర్థనతో చివరి నిమిషంలో విచారణను శుక్రవారానికి సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం వాయిదా వేసింది. తిరుపతి లడ్డూ వివాదంపై కోర్టు పర్యవేక్షణలో, లేదా సిబిఐ విచారణ జరిపించాలని వైసిపి ఎంపి, టిటిడి మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, బిజెపి సీనియర్ నాయకుడు సుబ్రమణ్యస్వామి, చరిత్రకారుడు విక్రమ్ సంపత్, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు దుష్యంత్ శ్రీధర్, సుదర్శన్ న్యూస్ యాంకర్ సురేష్ చవాన్కే దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కె వి విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం విచారించింది. గత విచారణ సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తు కొనసాగించాలా? లేక స్వతంత్ర సంస్థతో దర్యాప్తు జరిపించాలా? అనే అంశంపై సుప్రీం కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని అడగాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు సూచించింది. అంతేకాదు గురువారం లోపు తమ అభిప్రాయం చెప్పమని తుషార్ మెహతాను కోరింది. అయితే గురువారం లడ్డూకు సంబంధించిన పిటిషన్లు సుప్రీం కోర్టులోని మూడో నెంబర్ కోర్టులో 301, 302 నెంబర్లలో విచారణకు జాబితా అయ్యాయి. ఈ రెండు నెంబర్లలో జాబితా అయిన కేసులు గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు విచారణ జరగాల్సి ఉంది. అయితే అదే సమయంలో సొలిటర్ జనరల్ తుషార్ మెహతా వేరే కోర్టులో ఉండటంతో నేడు (శుక్రవారం) మొదటి కేసుగా ఈ పిటిషన్లను విచారించాలని ఆయన తరపు న్యాయవాదులు అభ్యర్థించారు. అందుకు ధర్మాసనం అంగీకరించి విచారణను ధర్మాసనం శుక్రవారానికి వాయిదా వేసింది.

సూపర్ సిక్స్ అమలు చేస్తాం

- మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సూపర్ సిక్స్ హామీలు అమలు చేసి వైసిపికి సూపర్ స్ట్రోక్ ఇస్తామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సిఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జగన్ ఖాళీగా కూర్చోలేక ప్రభుత్వంపై కాలుష్యం చిమ్ముతున్నారని విమర్శించారు. అన్న క్యాంటీన్‌లను రద్దు చేసి పేదల నోటికాడి కూడును జగన్ లాగేశారని విమర్శించారు.

వీలైనంత త్వరగా వాగ్దానాలు అమలు : మంత్రి అనగాని

వాగ్దాలన్నింటినీ అమలు చేస్తామని రెవెన్యూ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం రాగానే ఐదు హామీలను నెరవేర్చిందన్నారు. జగన్ చెప్పినట్లుగానే వైసిపి అరాచక ప్రభుత్వానికి, ప్రస్తుత కూటమి ప్రజాస్వామ్య ప్రభుత్వానికి తేడాను ప్రజలు స్పష్టంగా గమనిస్తున్నారని వెల్లడించారు. జగన్ తానిచ్చిన హామీల్లో 12 శాతం మాత్రమే అమలు చేశారని, బలహీన తరగతులకు అమలవుతున్న 150 పథకాలను రద్దు చేశారని విమర్శించారు.

ఫర్నిచర్ తీసుకెళ్లండి లేదా ఖరీదు కట్టండి

- జిఎడి అధికారులకు అప్పిరెడ్డి లేఖ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ఫర్నీచర్‌ను వెంటనే తీసుకెళ్లాలని సాధారణ పరిపాలనశాఖకు వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి లేఖ రాశారు. గురువారం లేఖను మీడియాకు విడుదల చేశారు. ఫర్నీచర్ తీసుకెళ్లాలని ఇప్పటికే జూన్ 15, జూన్ 19, జులై 1, జులై 29న లేఖలు రాసినట్లు తెలిపారు. దీనిపై వైసిపి తరపున కార్యాలయ ఇన్‌ఛార్జి కూడా వ్యక్తిగతంగా సంప్రదింపులు జరిపారని పేర్కొన్నారు. అసలు ఫర్నీచర్‌ను వెనక్కు తీసుకెళ్లే ఉద్దేశం ఉందా ? లేదా? చెప్పాలని, నిందలు మోపడం కోసమే స్పందించడం లేదా? అని ప్రశ్నించారు. ఫర్నీచర్ తీసుకెళ్లకపోవడం సాధ్యం కాకపోతే ఎక్కడికి పంపాలో చెబితే అక్కడకు పంపుతామని వివరించారు. ఫర్నీచర్ తీసుకోవడం ఇష్టం లేకపోతే ఖరీదు చెబితే చెల్లిస్తామని తెలిపారు. ఫర్నీచర్ వల్ల తమ కార్యాలయంలో స్థలాభావం నెలకొందని, అందువల్ల ఏ విషయమైనా వెంటనే చెప్పాలని లేఖలో కోరారు.

దలాల్ ధమాల్

(మొదటి పేజీ తరువాయి)

రిలయన్స్ ఇండస్ట్రీస్, లర్సన్ అండ్ టర్బో, యాక్సిస్ బ్యాంక్, ఐసిఐసిఐ బ్యాంక్ షేర్లు భారీగా పడిపోవడంతో మార్కెట్లపై అధిక ఒత్తిడి చోటు చేసుకుంది. బిఎస్ఇలో మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 2.27 శాతం, 1.84 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీలో అన్ని రంగాలు నేల చూపులు చూశాయి. రియాల్టీ అత్యధికంగా 4.36 శాతం కోల్పోగా.. ఆటోమొబైల్ 2.88 శాతం, ఫైనాన్షియల్ 2.43 శాతం, బ్యాంకింగ్ 2.04 శాతం, ఐటి 1.58 శాతం చొప్పున క్షీణించాయి.

అమెరికా జోక్యంతో...

పశ్చిమాసియాలో ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు మరింత పెరగొచ్చన్న అంచనాలు మదుపర్లను కలవరానికి గురి చేశాయి. ఈ ఘర్షణలో అమెరికా తలదూర్చడంతో మార్కెట్ల భవిష్యత్తుపై ఇన్వెస్టర్లు మరింత ఆందోళనకు గురయ్యారు. మరోవైపు ఈ పరిస్థితి ముడి చమురు ధరలకు అజ్యం పోస్తోంది. వారం క్రితం వరకు 70-71 డాలర్లుగా పలికిన బ్యారెల్ ధర.. ప్రస్తుతం పరిస్థితులు అదుపుతప్పడంతో రెండు రోజుల్లోనే 75 డాలర్లకు చేరింది. ఇది 85 డాలర్లకు చేరొచ్చనే అంచనాలు మార్కెట్‌పై ప్రభావాన్ని చూపాయి. ఇరాన్ చమురు క్షేత్రాలు యుద్ధ టార్గెట్‌కు గురైతే.. భారత్ లాంటి అతిపెద్ద చమురు దిగుమతిదారుపై ప్రభావం పడనుందనే భయాలు ఇన్వెస్టర్లలో నెలకొన్నాయి.

మరికొన్ని కారణాలు

అమెరికా మార్కెట్లలో మిశ్రమ ఫలితాలు చోటు చేసుకున్నాయి. మరోవైపు జపాన్, చైనా మార్కెట్లు దూసుకుపోవడం విశేషం. చైనా ప్రభుత్వం ప్రకటించిన భారీ ఉద్దీపన చర్యలతో విదేశీ సంస్థాగత పెట్టుబడులు వివిధ దేశాల నుండి చైనాకు తరలివెళ్లాయి. మన దేశం నుండి ఈ తరహా పెట్టుబడులు చైనా బాట పట్టాయి. గడిచిన ఒక్క వారంలోనే షాంఘై కంపోజిట్ ఇండెక్స్ (ఎస్ఎస్ఇ) 15 శాతం పెరిగింది.

'పౌరసరఫరాల'పై ఆర్థికభారం

- 37,750 కోట్ల వరకు అప్పులు
- సగటున వడ్డీయే 8.76 శాతం
- అత్యధికంగా యూనియన్ బ్యాంకుకు 10.80 శాతం
- మిల్లర్లకు, సొసైటీలకు 2,786 కోట్ల బకాయి
- సబ్సిడీ బకాయిలివ్వని రాష్ట్ర ప్రభుత్వం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

పౌర సరఫరాల శాఖపై ఆర్థికభారం పెరుగుతోంది. బయటవారికి చెల్లించాల్సిన బకాయిలు పెరిగిపోతుండగా, రావాల్సిన నిధులు సక్రమంగా రాకపోవడంతో అనునిత్యం అప్పులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. అధిక వడ్డీలకు తీసుకుంటున్న రుణాలు సంస్థపై భారాన్ని పెంచుతున్నాయి. ఈ పరిస్థితిపై అనేక పర్యాయాలు ప్రభుత్వానికి లేఖలు రాస్తున్నప్పటికీ ఫలితం మాత్రం కనపడడం లేదని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. తాజా గణాంకాల మేరకు పౌర సరఫరాల శాఖకు ఏకంగా 37,750 కోట్లు అప్పులు ఉన్నట్లు తేలింది. ఇది కాక, మరో రూ. 2,786 కోట్లు మిల్లర్లు, సొసైటీలకు చెల్లించాల్సి ఉంది. వీటిని కూడా కలుపుకుని మొత్తం భారం రూ. 40,536 కోట్లకు చేరుకున్నట్లు లెక్కగట్టారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీ మొత్తం రాకపోవడం, సంక్షేమ శాఖలకు అందించిన సరుకులకు సొమ్ము రాకపోవడం, చివరకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులు కూడా పూర్తిగా రాకపోవడం వల్ల పౌరసరఫరాల శాఖ ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నట్లు తెలుస్తోంది.

సబ్సిడీల బకాయిలే అధికం..

పేదలకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందించే బియ్యం, చక్కెర, గోధుమలు వంటి వాటికి ప్రభుత్వం సబ్సిడీని కొనసాగిస్తోంది. పౌర సరఫరాల శాఖకు ఈ సబ్సిడీ మొత్తాన్ని ప్రభుత్వం వాపసు చేయాల్సి ఉంటుంది. ఎప్పుడూ కూడా పూర్తి స్థాయిలో ఆ సబ్సిడీ మొత్తాన్ని తిరిగి చెల్లించడం లేదని సమాచారం. తాజా సమాచారం మేరకు ఏకంగా రూ.26 వేల కోట్లకు పైగా సబ్సిడీ బకాయిలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

కేంద్రం కూడా..

పలు సబ్సిడీలకు కేంద్రం నుంచి కూడా నిధులు రావాల్సి ఉంటుంది. ఈ విభాగంలో కూడా రూ.1,187 కోట్ల వరకు కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు రాలేదని సమాచారం. ఈ నిధులపై కూడా కేంద్రానికి అనేక దఫాలుగా లేఖలు రాసినా ఫలితం కనిపించేదు. ప్రభుత్వ గ్యారంటీలతో తీసుకున్న రుణాలకు చెల్లించాల్సిన వడ్డీ బకాయిలు కూడా ప్రభుత్వం నుంచి భారీగానే రావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ మొత్తమే ఏకంగా రూ.15 వేల కోట్లకుపైగా ఉందని అంటున్నారు.

వడ్డీల భారం భారీగానే

పలు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలపై చెల్లించాల్సిన వడ్డీల భారం కూడా ఎక్కువగా ఉన్నట్లు కనిపిస్తోంది. ప్రతి బ్యాంకుకు 8 శాతానికన్నా ఎక్కువగా వడ్డీ చెల్లించాల్సి ఉందని తెలుస్తోంది. యూనియన్ బ్యాంకు ద్వారా తీసుకున్న రుణానికైతే ఏకంగా 10.80 శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తోంది. ఆ తరువాత ఆప్కాబ్ రుణాలకు తొమ్మిది శాతం వడ్డీగా చెల్లించాల్సి ఉంది. ఈ మొత్తమే వేల కోట్లలో ఉంటోందని పౌర సరఫరాల సంస్థ అధికారులు చెబుతున్నారు.

చెల్లించాల్సిన బకాయిల వివరాలు (రూ. కోట్లలో)

విభాగం	బకాయిలు
మిల్లర్లకు	963.33
కమిషను	769.79
మార్కెట్ ఫీజు	666.45
ఏజెన్సీలకు	307.68
జిల్లాల వ్యయం	79.31
మొత్తం	2,786.56

ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు (రూ. కోట్లలో)

విభాగం	నిధులు
కేంద్ర సబ్సిడీగా	1187.65
రాష్ట్ర సబ్సిడీగా	26,360.80
ఇతర సబ్సిడీలు	3200.00
వడ్డీగా రావాల్సింది	15,227.71
ఎఫ్‌సిఐ విత్‌హెల్డ్	161.49
ఐసిడిఎస్ నుంచి	613.94
విద్యాశాఖ నుంచి	606.90
సంక్షేమశాఖల నుంచి	217.78
మొత్తం	48,098.95

విద్యుదాఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్ (ప్రకాశం జిల్లా)

ప్రమాదవశాత్తు కరెంటు తీగ తగిలి.. విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన ఘటన ప్రకాశం జిల్లా మార్కాపురం రూరల్ పరిధిలోని బొందలపాడు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బొందలపాడు గ్రామానికి చెందిన మారంరెడ్డి వెంకట సుబ్బారెడ్డి (50)కి చెందిన ఎనిమిదెకరాల పొలం చుట్టూ కంచెను ఏర్పాటు చేసుకున్నారు. అందులో నుంచి పొలం లోపలికి వెళ్లేందుకు, బయటికి వచ్చేందుకు తీగలను పైకి ఎత్తడం, కిందకు దించడం చేసేవారు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఇంటికి వస్తున్న సమయంలో వెంకట సుబ్బారెడ్డి కంచెను కిందికి దించుతుండగా అప్పటికే విద్యుత్ తీగకు సంబంధించిన మెయిన్ లైన్ తెగిపడి సోలార్ కంచెకు తగిలి ఉంది. దీంతో ఒక్కసారిగా ఆయన విద్యుత్ షాక్‌కు గురయ్యారు. పక్కనే ఉన్న మరో వ్యక్తి సుబ్బారెడ్డిని తప్పించే క్రమంలో అతడికీ విద్యుత్ షాక్ తగిలింది. అక్కడే ఉన్న మరికొందరు రైతులు ఇద్దరినీ కాపాడే ప్రయత్నం చేశారు. వెంకట సుబ్బారెడ్డి అప్పటికే మతి చెందారు. మార్కాపురం గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ అంకమ్మరావు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కాంట్రాక్టు స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలి

- ముఖ్యమంత్రికి సిపిఐ లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రప్రభుత్వ పరిధిలోని కాంట్రాక్టు విధానంలో డిఎంఇ, ఎపివివిపి, డిపిహెచ్, ఎన్‌హెచ్‌ఎం విభాగాల్లో పనిచేస్తున్న స్టాఫ్ నర్సుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సిపిఐ రాష్ట్ర సమితి కోరింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు గురువారం లేఖ రాశారు. స్టాఫ్ నర్సులుగా 11 వేల మంది దశాబ్దకాలం పైబడి విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో వీరి సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. వీరిని రెగ్యులరైజ్ చేసి 100 శాతం గ్రాస్ జీతం అమలు చేయాలని కోరారు. పరస్పర అంగీకార బదిలీలు అమలు చేయాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నర్సింగ్ సిబ్బందిని నియమించి రాత్రి వేళల్లో తగు భద్రత కల్పించాలన్నారు. ఉద్యోగులకు రూ.5 లక్షల బీమా సదుపాయం కల్పించాలని కోరారు.

మద్యం షాపుల్లో సిబ్బందిని తొలగించొద్దు : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేస్తున్న సేల్స్ బాయ్స్, సూపర్‌వైజర్, వాచ్‌మెన్‌లను కొనసాగించాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ కోరింది. ఐదేళ్లుగా ప్రభుత్వ మద్యం షాపుల్లో 15 వేల మంది పనిచేస్తున్నారని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వై రాము, జి రామన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, ఇంటర్ అర్హత ఉన్న వారిని జిల్లా జాయింట్ కలెక్టరు ఆధ్వర్యాన ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక చేశారని గుర్తుచేశారు. కష్టపడి పనిచేస్తున్న వీరికి ప్రభుత్వం గుర్తించి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో నిరుద్యోగం విలయతాండవం చేస్తోందని, ఈ నేపథ్యంలో వీరిని తొలగిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. నూతన మద్యం పాలసీ ప్రకారం మద్యం షాపులను ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందని పేర్కొన్నారు. మద్యం వ్యాపారాన్ని ఆదాయ వనరుగా చూడటం సిగ్గుచేటని విమర్శించారు. గుడి, బడి ఉన్నచోట్ల షాపులను అనుమతించొద్దని కోరారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలో సంపూర్ణ మద్యనిషేధం విధించాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- తొలిరోజే పట్టువస్త్రాలు సమర్పించనున్న సిఎం

ప్రజాశకి- తిరుమల

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి 12 వరకు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు టిటిడి ఇఒ జె.శ్యామలరావు తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో అదనపు ఇఒ సిహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి ఇఒ మీడియాతో మాట్లాడారు. శుక్రవారం శ్రీవారికి ముఖ్యమంత్రి పట్టువస్త్రాలు సమర్పిస్తారని పేర్కొన్నారు. ఐదున పాంచజన్యం విశ్రాంతి భవనం వెనుక వైపున రూ.13.45 కోట్లతో అత్యాధునిక పరికరాలతో నిర్మించిన వకుళమాత కేంద్రీయ వంటశాలను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో యాత్రికుల రద్దీ దృష్ట్యా శ్రీవారి ఆలయంలో పలు ఆర్జితసేవలు, గరుడసేవ రోజున బ్రేక్ దర్శనాలు పూర్తిగా రద్దు చేసినట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆన్‌లైన్‌లో రూ.300ల దర్శన టికెట్లు 1.32లక్షలు అందుబాటు ఉంచామన్నారు. తిరుపతిలో ప్రతి రోజూ సర్వదర్శనం టోకెన్లు 24 వేలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న లక్ష్మణరావు, వెంకటేశ్వర్లు తదితరులు

నేటి నుంచి యుటిఎఫ్ రాష్ట్ర క్రీడోత్సవాలు

- గుంటూరులో పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

యుటిఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలలో భాగంగా అక్టోబర్ 4, 5, 6 తేదీల్లో గుంటూరులో రాష్ట్ర స్థాయి క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఇందుకు సంబంధించి గురువారం నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో క్రీడోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా స్థాయి క్రీడల్లో గెలుపొందిన దాదాపు 1500 మంది రాష్ట్రస్థాయిలో పాల్గొంటారని తెలిపారు. ఎన్‌టిఆర్ స్టేడియం, పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ ప్రాంగణం, పిచ్చుకలగుంట గ్రౌండ్, పోలీస్ పెరేడ్ గ్రౌండ్, కిట్స్ ఇంజనీరింగ్ కాలేజీ ప్రాంగణాల్లో 15 క్రీడాంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉపాధ్యాయుల సంక్షేమం, వృత్తి నైపుణ్యంతో పాటు వారిలోని క్రీడా నైపుణ్యాలను పెంపొందించటానికి యుటిఎఫ్ కృషి చేస్తుందని చెప్పారు. నాల్గవ తేదీన గుంటూరు ఎన్‌టిఆర్ స్టేడియంలో జరిగే క్రీడా ఉత్సవాల ప్రారంభోత్సవానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర యువజన, క్రీడల శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి, ఎంపి శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే గల్లా మాధవి, కలెక్టర్ నాగలక్ష్మీ, జెడ్‌పి ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, పలువురు ఎమ్మెల్యేలు హాజరవుతారని తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణలో యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు ఏఎన్.కుసుమ కుమారి, రాష్ట్ర కార్యదర్శి బి. లక్ష్మీరాజాజీ, వి.రమణ, యం.హనుమంతరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.కళాధర్, బి. ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా నిర్ణయాలు

- మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటామని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. విద్యుత్ రంగానికి సంబంధించిన ప్రైవేట్ విద్యుదుత్పత్తి సంస్థల అధిపతులతో సచివాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వంలో విద్యుత్ కొనుగోలు ఒప్పందాల రద్దు, న్యాయస్థానాల్లో ఉన్న వ్యాజ్యాలతోపాటు అనేక సమస్యలను ఎదుర్కొన్నామని విద్యుత్ పెట్టుబడిదారులు.. మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ-2024 ప్రభుత్వం త్వరలోనే ప్రకటిస్తుందని తెలిపారు. ఈ పాలసీ పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకరంగా ఉంటుందని చెప్పారు. విద్యుత్ రంగంలో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యాన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఉత్పత్తి సంస్థలు సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాల కారణంగా విద్యుత్ రంగం అనేక సమస్యలను ఎదుర్కొంటుందన్నారు. సిఎం చంద్రబాబు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నినాదంతో ముందుకు వెళ్తున్నారని చెప్పారు. జనరేషన్ బేస్డ్ ప్రోత్సాహకం, లేట్‌పేమెంట్ సర్‌చార్జ్, ట్యాక్స్‌పాస్ థ్రూ, కెపాసిటీ యుటిలైజేషన్ ఫ్యాక్టర్ తదితర సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో ఎమ్‌డి కెవిఎన్ చక్రధర్ బాబు, ట్రాన్స్‌కో జెఎమ్‌డి కీర్తి చేకూరి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధం

- తూర్పుగోదావరి జిల్లాలో 220 రైతు సేవా కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం ప్రతినిధి

తూర్పు గోదావరి జిల్లాలో ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధమైంది. జిల్లాలోని 220 రైతు సేవా కేంద్రాల పరిధిలో ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ నెల రెండో వారం నుంచి వీటిని ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న ప్రతి రైతు నుంచి గిట్టుబాటు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తామని అధికారులు తెలిపారు. ధాన్యం మిల్లుకు చేరిన 48 గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు పడేలా ఈ-క్రాప్ చేయించుకున్న రైతుల జాబితాలు, ఆధార్ అనుసంధాన బ్యాంకు ఖాతాలను సిద్ధం చేస్తున్నారు. ఈ ఖరీఫ్ సీజన్ నుంచి కేంద్ర ప్రభుత్వం క్వింటాల్ ధాన్యానికి రూ.117 మద్దతు ధర పెంచింది. ప్రస్తుతం ఎ-గ్రేడు రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.2,320, సాధారణ రకం క్వింటాల్‌కు రూ.2,300 ధరగా ప్రభుత్వం నిర్ణయించింది.

ధాన్యాన్ని సంచుల్లోకి ఎత్తుతున్న కార్మికులు

గోనె సంచుల కొరత లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికే రైతు సహాయ కేంద్రాలకు గోనె సంచులను తరలించారు. అలాగే తేమ యంత్రాలు, ఎలక్ట్రానిక్ కాటాలను ప్రతి కేంద్రం వద్ద అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టారు. గోనె సంచులను రైతులే సమకూర్చుకుంటే వాటి ఖర్చును ప్రభుత్వమే అందించనుంది. కల్లాల్లో ధాన్యాన్ని సంచుల్లో నింపడం, తూకం సంచులు కుట్టడం, లోడింగ్‌లకు హమాలీల ఖర్చులను ప్రభుత్వమే భరిస్తుంది. రైతులే హమాలీలను సమకూర్చుకుంటే లేబర్ ఛార్జీలను రైతు ఖాతాలకు నేరుగా జమ చేయనుంది. ఒక సంచికి రూ.3.39, లేబర్ ఛార్జీ ఒకరికి రూ.17.17 చెల్లించనుంది. కొనుగోళ్లలో సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు, సలహాలు సూచనల కోసం జిల్లాలో 8309487151 నెంబర్‌తో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా 1967 టోల్‌ఫ్రీ నెంబర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.

వైసిపి తప్పులను సరిదిద్దుతున్నాం

- మాజీ మంత్రి పీతల సుజాత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ఐదేళ్లలో వైసిపి నేతలు చేసిన తప్పులను సరిదిద్దుతున్నామని మాజీ మంత్రి పీతల సుజాత పేర్కొన్నారు. ప్రజలపై పన్నుల భారం మోపారని, వాటన్నింటినీ తమ ప్రభుత్వం సరిదిద్దే ప్రయత్నం చేస్తోందని అన్నారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తమ ప్రభుత్వంలో ప్రజలకు జరుగుతున్న మేలును గుర్తించలేక మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన అనుచరులు తప్పుడు ప్రచారానికి తెరలేపారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎఆర్ డెయిరీ నెయ్యి మొత్తం కల్తీనే : కొమ్మారెడ్డి పట్టాభి

జగన్ పాలనలో ఎఆర్ ఫుడ్స్ టిటిడికి సరఫరా చేసిన నెయ్యి మొత్తం కల్తీనే అని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ ఆరోపించారు. కల్తీ నెయ్యి అంశంలో నిజాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయన్నారు. ఎఆర్ ఫుడ్స్ కంపెనీకి టెండర్ ప్రకారం ఆరు నెలల్లో వెయ్యి టన్నుల నెయ్యి సరఫరా చేసే సామర్థ్యం లేదని టిటిడి టెక్నికల్ టీం 2023 నవంబరు 8న నివేదిక ఇచ్చిందని చెప్పారు. ఫ్యాటీ యాసిడ్ టెస్ట్ చేసే పరికరాలు లేవని టిటిడి ఇచ్చిన నివేదికపై వైసిపి అబద్ధాలు చెబుతోందన్నారు.

4 నెలలైనా బడ్జెట్ లేని పాలన

- వైసిపి అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి
- కేసులకు భయపడొద్దని సూచన

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నాలుగు నెలలైనా వార్షిక బడ్జెట్ లేకుండా పాలన చేస్తున్నారని, బడ్జెట్ పెట్టడానికి కూడా భయపడుతున్నారని వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. పశ్చిమగోదావరి జిల్లాల నాయకులతో వైసిపి కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. సూపర్ సిక్స్ హామీల అమల్లో విఫలమయ్యారని, ప్రజాగ్రహ భయంతోనే బడ్జెట్ పెట్టలేదన్నారు. వైసిపి హయాంలో క్రమం తప్పకుండా సంక్షేమ క్యాలెండర్ ఇచ్చామని, ఇప్పుడు ఆ పరిస్థితులు లేవని అన్నారు. పాలనలో తేడాను ప్రజలు గమనించారని, ఏది మంచి ప్రభుత్వమన్న చర్చ వారిలో జరుగుతోందని వివరించారు. చంద్రబాబు మోసాలపై ప్రజాగ్రహం పెరుగుతోందని తెలిపారు. ప్రభుత్వ పాలన అస్తవ్యస్తంగా మారిందని, రాష్ట్రంలో ప్రతిదీ స్కామేనని చెప్పారు. ఎక్కడికక్కడ క్లబ్బులు, జోరుగా మట్కా వ్యవహారం సాగుతోందని, నాలుగు నెలల్లో పరిస్థితులు మరింత దిగజారిపోయాయని వివరించారు. ప్రజా పాలనలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలకు అండగా ఉండాలని, వారితో కలిసి పోరాడాలని, వైసిపి శ్రేణులకు ఆయన సూచించారు. కేసులకు భయపడాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్రంలో అన్యాయమైన పాలన సాగుతోందని, 2029 ఎన్నికల్లో వచ్చేది వైసిపి ప్రభుత్వమేనని అన్నారు.

ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేసులు సహజమని, అటువంటి సమయంలో కార్యకర్తలకు అండగా నిలవాలని తెలిపారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా న్యాయపరమైన సహాయం చేయడంతోపాటు ప్రభుత్వ అన్యాయాలను ప్రశ్నించాలన్నారు. తిరుపతి లడ్డూపై అబద్ధాలు ప్రచారం చేశారని పేర్కొన్నారు.

శ్రీశైలంలో దసరా మహోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైల క్షేత్రంలో దసరా మహోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దసరా నవరాత్రోత్సవాల్లో భాగంగా తొలి రోజు నవదుర్గ అలంకారంలో అమ్మవారు, భృంగి వాహనంపై స్వామి అమ్మవార్లు కొలువుదీరారు. శ్రీశైల దేవస్థాన ఇఒ డి పెద్దిరాజు దంపతులు, ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు, స్థానాచార్యులు, అర్చకులు, వేదపండితులు సంప్రదాయబద్ధంగా పసుపు, కుంకుమలు, పరిపుష్పాదులతో ఆలయ ప్రవేశం చేశారు.

మీడియాతో మాట్లాడుతున్న మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, కొలుసు పార్థసారథి

ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు

- తొలిరోజు శ్రీ బాలాత్రిపుర సుందరీ దేవిగా అలంకరణ

ప్రజాశక్తి-వన్‌టౌన్ (విజయవాడ)

ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు అత్యంత వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు బాలాత్రిపుర సుందరీ దేవిగా దుర్గమ్మను అలంకరించారు. కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి వద్ద నుంచి ఏర్పాటు చేసిన మూడు క్యూ లైన్ల నుంచి యాత్రికులు అమ్మవారిని దర్శనం చేసుకున్నారు. మొదటిరోజు సుమారు 40 నుంచి 50 వేల మంది దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. దేవీ నవరాత్రుల ఉత్సవాలను సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథితో కలిసి దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రారంభించారు. ఉత్సవాలు ముగిసేంత వరకూ దుర్గా ఘాట్ వద్ద కృష్ణమ్మకు నవహారతుల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని మీడియాకు మంత్రులు ఆనం, కొలుసు పార్థసారథి తెలిపారు. కనకదుర్గమ్మను హోం మంత్రి అనిత, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు సుజనా చౌదరి, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ సృజన, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు దర్శించుకున్నారు.

దుర్గమ్మను దర్శించుకునేందుకు క్యూ లైనులో బారులు తీరిన జనం

MUNICIPAL CORPORATION::TIRUPATI

The Commissioner, Municipal Corporation, Tirupati invites Tender on e- Procurement platform. from the "eligible contractors for the following Works".

IFB.No.	Name of the Work	No. of. works	ECV Amount in Rupees in Lakhs
IFB No: Recall & 14 & 35 to 70/ GEN/24-25/TO, Date:-09-2024	Laying of 1100 mm dia pumping main line, supply and delivery of UDS rodding machine materials, Rewinding and Repair of 7.5HP, 5H.P, 3H.P, 2H.P, Providing ACP Cladding, Construction of Community Hall, Restoration of UDS Trunk Main line, Repair & Complete Rewiring of 175 HP Soft Starter with new materials, Formation of Cross Bund with sand bags, Construction of Toilets, CC Drain, Supply and delivery of Liquid Pyrosene Oil, Painting, construction of UGD manholes, GI surface pipe line, CC Patches & Potholes	44 Works	532.23
Total		44 Works	532.23

For particulars pleasecontact Municipal Engineer during office working hours (or) see e- Procurement market place:https:// tender.apeprocurement.gov.in

COMMISSIONER
Municipal Corporation, Tirupati.

ఫారం ఎ
బహిరంగ ప్రకటన
(దివాలా మరియు దివాలాబోర్డ్ ఆఫ్ ఇండియా (ఇన్‌సాల్వెన్సీ రీసోల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పోరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్, 2016 రెగ్యులేషన్ 6 క్రింద)
ఎఎస్ఆర్ ఇంజనీరింగ్ అండ్ ప్రొడక్ట్స్ క్రెడిటార్ల దృష్టికి

సంబంధిత వివరాలు

1.	కార్పొరేట్ రుణగ్రహీత పేరు	ఎఎస్ఆర్ ఇంజనీరింగ్ అండ్ ప్రొడక్ట్స్ లిమిటెడ్
2.	కార్పొరేట్ రుణగ్రహీత యొక్క విలీనం తేది	01.12.2005
3.	కార్పొరేట్ రుణగ్రహీత అధికారం క్రింద విలీనం / నమోదు చేయబడింది	కంపెనీల యాక్ట్ 1956/ఆర్‌ఓసి, విజయవాడ (ఎమ్‌సిఎ పోర్టల్ వద్ద అందుబాటులో ఉంది)
4.	కార్పొరేట్ రుణగ్రహీత యొక్క కార్పోరేట్ గుర్తింపు నంబరు	U45200AP2005PLC048258
5.	కార్పొరేట్ రుణగ్రత యొక్క నమోదిత కార్యాలయం మరియు ప్రధాన కార్యాలయం (ఏదైనా) చిరునామా	ప్లాట్ నం.27, విద్యుత్ నగర్, న్యూ టౌన్, అనంతపురం, ఆంధ్రప్రదేశ్, ఇండియా-515 001 (ఎమ్‌సిఎ పోర్టల్ వద్ద అందుబాటులో ఉంది)
6.	కార్పొరేట్ రుణగ్రతకి సంబంధించి దివాలా ప్రారంభమైన తేది	27.09.2024 (03.10.2024న ఆర్డరు కాపీ అప్‌లోడ్ చేయబడింది మరియు అందుబాటులో ఉంది)
7.	దివాలా తీర్మానం ప్రక్రియ ముగిసేవే అంచనా తేది	25.03.2025
8.	వృత్తిసంబంధమైన తీర్మానం మధ్యంతరంగా వ్యవహరించే వృత్తిసంబంధమైన దివాలా పేరు మరియు నమోదు సంఖ్య	నాగభూషణ్ భగవతి Reg. No: IBBI/IPA-001/IP-P00032/2016-17/10085
9.	బోర్డ్‌తో నమోదుకాబడిన మధ్యంతర వృత్తి సంబంధమైన తీర్మానం చిరునామా మరియు ఇ-మెయిల్	నాగభూషణ్ భగవతి, హా.నం.1-1-380/38, అశోక్ నగర్ ఎక్స్‌టెన్షన్, హైదరాబాద్-500 020 E-mail: bnagabhushan@yahoo.com
10.	మధ్యంతర వృత్తిసంబంధమైన తీర్మానంతో ఉత్తర ప్రత్యుత్తరాలకు ఉపయోగించుటకు చిరునామా మరియు ఇ-మెయిల్	నాగభూషణ్ భగవతి, హా.నం.1-1-380/38, అశోక్ నగర్ ఎక్స్‌టెన్షన్, హైదరాబాద్-500 020 E-mail: asrepl2024@gmail.com
11.	దావాలు దాఖలు చేయుటకు చివరి తేది	17.10.2024
12.	రుణదాతల తరగతులు, ఏవైనా, మధ్యంతర తీర్మానం వృత్తిసంబంధమైన వాటి ద్వారా తెలిసినవి, సెక్షన్ 21 యొక్క సబ్-సెక్షన్ (6ఎ) యొక్క క్లాస్ (బి) క్రింద	వర్తించబడదు
13.	క్లాస్‌లో రుణదాతల యొక్క అధీకృత ప్రతినిధిగా వ్యవహరించి దివాలా నిపుణులుగా గుర్తించిన పేర్లు (ప్రతి తరగతి కొరకు మూడు పేర్లు)	వర్తించబడదు
14.	(ఎ) సంబంధిత ఫారాలు మరియు (బి) అధీకృత ప్రతినిధుల వివరాలు ప్రతినిధులు లభ్యమయ్యేది :	Web link: https://ibbi.gov.in/downloadform.html భౌతిక చిరునామా : పైన కాలమ్ 10 లో ఇచ్చినది

27.09.2024 న (03.10.2024న ఆర్డరు కాపీ అప్‌లోడ్ చేయబడింది) మెసెర్స్. ఎఎస్ఆర్ ఇంజనీరింగ్ అండ్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ ఇన్‌సాల్వెన్సీ రెజల్యూషన్ ప్రాసెస్‌ను ప్రారంభించాలని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యూనల్, అమరావతి ఆదేశించినట్లు నోటీసు ఇవ్వబడింది.
మెసెర్స్. ఎఎస్ఆర్ ఇంజనీరింగ్ అండ్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ రుణదాతలను ఇక్కడ పిలువడమేమనగా ఎంట్రీ నం. 10కి ఎదురుగా ఉండి చిరునామాగా పేర్కొన్న ఇంటెరిమ్ రెజల్యూషన్ ప్రొఫిషనల్‌కు **17.10.2024**న లేదా ముందే వారి దావాల రుజువులను దాఖలు చేయుటకు కోరడమైనది.
ఆర్థిక రుణదాతలు తమ క్లెయిమ్‌లను ఎలక్ట్రానిక్ మార్గాల ద్వారా మాత్రమే రుజువుతో సమర్పించాలి. ఇతర రుణదాతలు వ్యక్తిగతంగా, పోస్ట్ ద్వారా ఎలక్ట్రానిక్ మార్గాల ద్వారా రుజువుతో క్లెయిమ్‌లను సమర్పించవచ్చు.
ఎంట్రీ నం.12కి వ్యతిరేకంగా జాబితా చేయబడిన ఒక తరగతికి చెందిన ఆర్థిక రుణదాత, సిఎ ఫారమ్‌లో తరగతికి అధీకృత ప్రతినిధిగా (వర్తించదు) వ్యవహరించడానికి ఎంట్రీ నం.13కి వ్యతిరేకంగా జాబితా చేయబడిన ముగ్గురు దివాలా నిపుణుల నుండి అధీకృత ప్రతినిధిని ఎంపిక చేస్తారు.
క్లెయిమ్ యొక్క తప్పుడు లేదా తప్పుదారి పట్టించే రుజువులను సమర్పిస్తే జరిమానాలు విధించబడతాయి.

తేది : 03.10.2024
ప్రదేశం : హైదరాబాద్

ఇంటెరిమ్ రిజుల్యూషన్ ప్రొఫెషనల్ సంతకం మరియు పేరు
నాగభూషణ్ భగవతి, ఇంటెరిమ్ రిజుల్యూషన్ ప్రొఫెషనల్
మెసెర్స్. ఎఎస్ఆర్ ఇంజనీరింగ్ అండ్ ప్రొడక్ట్స్ లిమిటెడ్

Kadapa Municipal Corporation
Yerramukkapalli, Kadapa, Andhra Pradesh - 516001

REQUEST FOR PROPOSAL
Establishment of 100 TPD Compressed Bio Gas plant at kolumulapalli dump yard in Kadapa municipal corporation

Notice

Kadapa is the district headquarters of YSR Kadapa District in Andhra Pradesh and as of the 2011 Census of India, the city had a population of 3,44,893. The District Administration and the Kadapa Municipal Corporation (KMC) are proactively working towards bringing in a conscious change in the city's development through upgradation of infrastructure as well as through new developments that are envisaged to transform the city's development landscape.
In this regard, the KMC wants to undertake the **Establishment** of 100 TPD Compressed Bio Gas plant in land measuring approximately 10 Acres.
In this regard, the KMC now invites consultants or agencies, to submit Request for proposal for **Establishment of 100 TPD Compressed Bio Gas plant at kolumulapalli dump yard in Kadapa municipal corporation for processing of segregated bio-degradable municipal solid waste of kadapa municipal corporation and convert it to Compressed Bio gas under PPP mode**.
Interested Applicants may download from the electronic procurement platform of Government of Andhra Pradesh i.e. www.apeprocurement.gov.in from **03.10.2024**. The last date for submission in the prescribed format, to the address is specified in the Document is **18.10.2024**.
Bid document download starting date & Ending date : 03-10-2024 at 4.00PM to 18-10-2024 3.00PM
Last date & Time for receipt of Bids : 18-10-2024 at 4.00PM
Technical Bid opening date : 18-10-2024 at 5.00PM

Sd/- Commissioner, KMC

THE FEDERAL BANK LIMITED
Regd. Office: Aluva, Kerala.
ZONAL OFFICE: 2nd Floor, Halcyon Complex, No.9, St Marks Road, Bangalore-560 001.e-mail:bgrr-cpc@federalbank.co.in Phone: 080-22110052

Notice regarding Locker Operation 03/10/2024

The Federal Bank ("Bank") here by gives notice that certain irregularities have been observed in the maintenance of locker(s) hired by persons whose details are furnished below. Notice(s) sent to the respective locker hirer(s) has/have been returned unserved. The locker hirer(s)/other interested parties are hereby informed that in case they fail to regularize the locker arrangement by visiting the Branch, within 15 days from the date of this notice, Bank will be constrained to force open the locker(s) and take necessary further actions, as the Bank may deem fit, at the cost and expenses of the locker hirer(s).

Locker Number	Name & Address of Hirer(s)
MSJA026	UMAMAHESHWARA RAO D.V, D.NO.34-15-9, SIRIL STREET, GNANAPURAM, VISAKHAPATANAM, ANDHRAPRADESH,530004
SSJA064	K SATHYA NARAYANA RAO,1-16-17, GANDHINAGAR COLONY, ANDHRAPRADESH- 531 001
SSJA004	KRISHNAVENI. PENTAKOTA,D.NO. 14-6-38/2, ONE WAY TRAFFIC DOWN, KASPA STREET, ANAKAPALLE, ANDHRAPRADESH,531001
SSJA024	SATYANARAYANA K,S/O K. APPALA NAIDU,HARIPALEM, THIMMARAJU PETA, ANDHRAPRADESH-531011
SSJA075	SRINIVASA RAO .S,S/O APPALA NAIDU, THIMMARAJU PET, MUNAGAPAKA POST, ANDHRAPRADESH-531001

03/10/2024 For The Federal Bank Ltd., Manager/Senior Manager/Asst. Vice President

సంపాదకీయం

పోరాటమే మార్గం...

కాంట్రాక్టు కార్మికులను తొలగించడానికి వీల్లేదంటూ ఐక్యంగా పోరాడిన విశాఖ ఉక్కు కార్మికులు ఘన విజయం సాధించడం హర్షణీయం. ప్రైవేటీకరణలో భాగంగా కాంట్రాక్టు కార్మికులను భారీగా తగ్గించడానికి యాజమాన్యం చేసిన కుట్రను ఐక్య పోరాటం ద్వారా అడ్డుకున్నారు. వేలాదిమంది కాంట్రాక్టు సిబ్బందితో పాటు రెగ్యులర్ కార్మికులు రెండు రోజుల పాటు కదం తొక్కడం, వారికి మద్దతుగా వివిధ కార్మిక, ప్రజా సంఘాలు భుజం కలపడంతో ఈ విజయం సాకారమైంది. నినాదాలు, ఆందోళనలు, రాస్తారోకోలతో బుధవారం ఉద్యమించిన కార్మిక ప్రవాహాన్ని అదుపు చేయడానికి పోలీసుల సహాయంతో యాజమాన్యం చేసిన ప్రయత్నాలు విఫలం కాక తప్పలేదు. ఎట్టకేలకు దిగివచ్చిన యాజమాన్యం కార్మిక సంఘాలతో చర్చలు జరిపి 'ఎవరినీ తొలగించం, అందరినీ విధుల్లో కొనసాగిస్తాం' అని లేబర్ కమిషనర్ సమక్షంలో రాతపూర్వకంగా ఒప్పుకోవడంతో కార్మికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తం కావడమేగాక వారి ఆత్మ విశ్వాసమూ పెరిగింది. సుదీర్ఘ చర్చల అనంతరం కాంట్రాక్టు కార్మికులను ఎవరినీ తొలగించబోమని, ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో తొలగించిన 3,700 మంది కాంట్రాక్టు కార్మికుల లేబర్ పాస్‌లను, అలాగే సిస్టంలో బయోమెట్రిక్ డేటాబేస్‌ను కూడా పునరుద్ధరిస్తామని చెప్పింది. పాత పద్ధతిలోనే గేట్ పాస్‌లను కొనసాగించడానికి అంగీకరించక తప్పలేదు. కేంద్ర లేబర్ కమిషనర్ మహంతి మాట్లాడుతూ కార్మికుల ఉపాధి పరిరక్షణ, స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి పెంపుదల వంటి అంశాలపై యాజమాన్యం దృష్టి సారించాలని సలహా చెప్పింది కార్మికుల పోరాట శక్తిని ఆయన గుర్తించినందునేనని అవగతం చేసుకోవాలి. ఇదే స్ఫూర్తితో ప్రైవేటీకరణను అడ్డుకుంటామని, సెయిల్‌లో విలీనాన్ని సాధిస్తామని కార్మిక సంఘాలు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రకటించడం కార్మికవర్గ విజయోత్సాహానికి ప్రతిబింబం.

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ప్రభుత్వ వాటాలు అమ్మేసి ప్రైవేటుకు అప్పగిస్తామని కేంద్ర ప్రభుత్వ పెట్టుబడుల ఉపసంహరణ శాఖ (దీపమ్) కార్యదర్శి ప్రకటన వెలువడినప్పటి నుండి గడచిన మూడున్నరేళ్లకు పైగా ఉక్కు కార్మికులు నిలకడగా ఐక్యంగా పోరాడుతున్నారు. కేంద్ర ప్రభుత్వం మాత్రం మొండిగా తాను అనుకున్నట్టే ప్రైవేటీకరిస్తానంటోంది. ఉద్యోగులు, కార్మికుల జీతాలు చెల్లింపునకు కూడా ఇబ్బందులు పెడుతోంది. ఉత్పత్తిని కునారిల్లజేస్తోంది. మూడు ఫర్నేసులున్న ప్లాంటులో ఒక్క ఫర్నేస్ మాత్రమే ప్రస్తుతం పని చేస్తోంది. అది కూడా ఎన్ని రోజులు నడుస్తుందో చెప్పలేని పరిస్థితి. కోకింగ్ కోల్ నిల్వలు కూడా నిండుకుంటున్నాయి. అయితే, విశాఖతోపాటు రాష్ట్రంలోనూ ఆందోళనలు సాగుతున్న నేపథ్యంలో ప్లాంటు ప్రైవేటీకరణకు పాలకులు సాహసించలేక ముడి సరుకు చాలదనీ, వర్కింగ్ క్యాపిటల్ లేదనీ సాకులు చెప్పి ఉక్కు కర్మాగారం ఉసురు తియ్యాలని కుట్రలు పన్నుతున్నారు. అందులో భాగంగానే తాజాగా నాలుగు వేలమంది కాంట్రాక్టు కార్మికుల తొలగింపు కూడా! బుధవారంనాటి విజయం ఐక్య పోరాటం వల్లనే సాధ్యమైంది. అలాగే పట్టువదలని విక్రమార్కుల్లా గట్టిగా నిలకడగా ఆందోళన చేయడంవల్లనే అటు యాజమాన్యం ఇటు ప్రభుత్వమూ లొంగివచ్చాయి. ఎన్నో ఆందోళనల్లో 'పోరాట మార్గం- సరైన మార్గం' అన్న నినాదాలు మార్మోగుతుంటాయి. అది ఎంత నిజమో బుధవారంనాడు ఉక్కు కార్మికులు మరోసారి రుజువు చేశారు. కనుక అదే మన ముందున్న మార్గం తప్ప పైరవీలు, తెరచాటు మాటలూ కాదు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, ప్రైవేటీకరణ విధానాలు మానుకోకపోతే కార్మికవర్గ ఐక్యతను, తెలుగోడి సత్తాను చూపుతామని కేంద్ర బిజెపి ప్రభుత్వానికి అర్థమయ్యేలా చేయాలి. అశేష త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటుపరం కాకుండా కాపాడుకోవడం అందుకు ఐక్యంగా పట్టుదలగా పోరాడడమే రాష్ట్ర ప్రజల ముందున్న తక్షణ కర్తవ్యం. కార్మికోద్యమాన్ని, ప్రజల సంఘీభావ కార్యకలాపాలనూ మరింత ముమ్మరం గావించాలి. తద్వారా మాత్రమే ప్రభుత్వాలపై ఒత్తిడి నిర్మించగలం. ప్రైవేటీకరణను తిప్పిగొట్టగలం.

మహనీయుల మాట

జీవితం చాలా చిన్నది. ప్రేమించడానికి, స్నేహితులను సంపాదించుకోవడానికి సమయం తక్కువ వుంది. ఎవరి ఇష్టాయిష్టాలు, ఆలోచనలు వారికుంటాయి. భిన్నాభిప్రాయాలను గౌరవించాలి.

- హృషికేష్ ముఖర్జీ,
దాదాసాహెబ్ ఫాల్కే పురస్కార గ్రహీత.

విశ్లేషణ

ఇంధన 'సర్దుపోటు' ఉపసంహరించాల్సిందే!

బి. తులసీదాస్

రాష్ట్రంలోని మూడు విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కాములు) 2022-23 సంవత్సరానికి సంబంధించిన ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్ట్ అడ్జస్ట్‌మెంట్ (ఎఫ్.పి.పి.సి.ఎ-ఇంధన కొనుగోలు వ్యయం సర్దుబాటు చార్జీలు) పేరిట వినియోగదార్లు 8113.6 కోట్ల రూపాయలు చెల్లించాలని ప్రతిపాదించడంతో, ఆ మేరకు విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ (ఇ.ఆర్.సి) 2024 సెప్టెంబర్ 30న దినపత్రికల్లో బహిరంగ ప్రకటన చేసింది. అయితే, ఇది మాత్రమే కాదు 2023-24 సంవత్సరానికి సంబంధించి మరో 11 వేల కోట్లకు పైగా సర్దుబాటు చార్జీ కూడా ఈ వరుసలోనే ఉందని వార్తలొచ్చాయి. అంటే మొత్తం దాదాపు 20 వేల కోట్ల రూపాయలు చెల్లించాలన్నమాట. ఇప్పటికే అధిక ధరలు, తరుగుతున్న ఆదాయాలతో సతమతమవుతున్న ప్రజానీకం పులి మీద పుట్రలా పడిన విద్యుత్ భారాన్ని ఎలా చెల్లించగలం అని ఆందోళన చెందుతున్నారు. జనం గందరగోళ పడుతుండగా ఈ సర్దుబాటు చార్జీలకు ఇప్పటి ప్రభుత్వానికి సంబంధం లేదని డిస్కాములు అక్టోబర్ 1న మూడు పేజీల సుదీర్ఘ వివరణ ఇచ్చాయి. డిస్కాముల ప్రతిపాదనలు, తాజాగా ఇచ్చిన వివరణల్లోని అంశాలు, ఇంధన సర్దుబాటు చార్జీల మాయాజాలాన్ని గురించిన కొన్ని విషయాలు చర్చిద్దాం.

ఈ ప్రభుత్వానికి సంబంధం లేకపోతే ఎలా వసూలు చేస్తారు?

డిస్కాముల వివరణలో 2022-23 సర్దుబాటు చార్జీలకు ప్రస్తుత ప్రభుత్వానికి సంబంధం లేదని పేర్కొన్నారు. అలాంటపుడు ఈ ప్రభుత్వ హయాంలో వాటి వసూలుకు ఎందుకు పూనుకుంటున్నారు? ప్రభుత్వం ఏదైనా చార్జీల భారం జనం మోయాల్సిందేనా? ఒకవేళ పాత ప్రభుత్వం చేసిన తప్పులకు ఇప్పటి సర్కారు బాధ్యత వహించదనుకుంటే ప్రమాణ స్వీకారం చేసిన నాడు ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు మొదలు బుధవారంనాడు బందరులో చెత్త పన్ను రద్దు వరకు ఎలా చేశారు? అంటే సర్దుపోటు పట్ల ప్రజల్లో వ్యతిరేకత వచ్చింది కనుక అది ఈ ప్రభుత్వం మీదికి రాకుండా కవరప్ చేసే ప్రయత్నంగానే ఈ వివరణ ఇచ్చారని భావించవలసి వస్తుంది. 'ట్రూ అప్, ఎఫ్‌పిపిసిఎ వంటి పేరుతో ఎప్పుడో వాడుకున్న కరెంటుకు ఇప్పుడు చార్జీ వసూలు చేయడమేమిటి? అద్దె కొంపలైతే ఎవరో వాడిన విద్యుత్‌కు ఇప్పుడున్నవారు బిల్లు చెల్లించడమేమిటి? వాటిని రద్దు చేయండి' అని ప్రజలు చాలా ఏళ్లుగా ఆందోళన చేస్తున్నా పాలకులు వెనక్కు తగ్గడంలేదు. కొద్ది సార్లు మాత్రం 'ఆ

> వాస్తవానికి సర్దుబాటు చార్జీలను ఆ యా త్రైమాసికాలనుబట్టి, ఆ యా డిస్కాములు ఎంత చొప్పున వసూలు చేయవచ్చునో ఇ.ఆర్.సి నిర్ణయిస్తుంది. ఆ ప్రకారం అది ఒక్కో డిస్కాముకు ఒక్కో త్రైమాసికానికి యూనిట్‌కు ఒక్కో విధంగా ఉంటుంది. ఈ మాత్రం లాజిక్ కూడా లేకుండా ప్రజలను మభ్యపుచ్చేందుకు ప్రభుత్వ రంగంలోని డిస్కాములు యత్నించడం దారుణం. అంతేగాక ఇది పేదలకు పెనుభారం. ప్రస్తుతం వున్న టారిఫ్ ప్రకారం రోజుకు ఒక్క యూనిట్ మించకుండా (నెలకు 30 యూనిట్లు) వాడే నిరుపేదలు ఒక్కో యూనిట్‌కు ఇంధన చార్జీగా రూ.1.90, అదే నెలకు 400 యూనిట్లకు పైబడి వాడే సంపన్నులు యూనిట్‌కు రూ. 9.75 చొప్పన చెల్లించాలి. డిస్కాముల వివరణలో పేర్కొన్న సర్దుపోటు రూ.1.27 (అది నిజం కాదు) మాత్రమే అనుకున్నా నిరుపేదల ఇంధన చార్జీకి అదనంగా 67 శాతం చెల్లించాలి. అదే సంపన్నులకు మాత్రం అది 13 శాతమే!

మొత్తాలను ప్రభుత్వమే చెల్లిస్తుంది' అని పూచీ పడుతున్నారేతప్ప ఆ విధానాన్ని మాత్రం రద్దు చేయడంలేదు. అలా చేస్తే ఆ విధానాల రూపకర్తయైన ప్రపంచ బ్యాంకు, దాన్ని ఎల్లవేళలా అనుసరించే కేంద్ర ప్రభుత్వమూ ఒప్పుకోవు గనుక రాష్ట్రంలో ఎవరు అధికారంలోవున్నా ఈ విషయంలో మాత్రం మార్పు లేదు. అందుకనే ఈ అంశంపై ఆందోళన ఇంకా తీవ్రతరం చేయాల్సిందే! అప్పుడే సర్కార్లు దిగివస్తాయి.

సర్దుబాటు చార్జీలపై రెగ్యులేషన్ ఏం చెబుతోంది?

రెగ్యులేషన్ 4/2021ని అనుసరించి ఎఫ్‌పిపిసిఎను డిస్కాములు లెక్కగట్టడం, ఆ మేరకు ప్రతిపాదించడం, ఇఆర్‌సి వాటిని పరిశీలించి బహిరంగ విచారణ నిర్వహించాక నిర్ధారించడం తదితర ప్రక్రియ సాగుతుంది. ఆ రెగ్యులేషన్ నిబంధనల ప్రకారం డిస్కాములు ప్రతి త్రైమాసికం ముగిసిన రెండు నెలల్లోగా ఇ.ఆర్.సి కి ప్రతిపాదించాలి. అనంతరం ఇఆర్‌సి వాటిని పరిశీలించి, బహిరంగ విచారణకు తేదీ నిర్ణయించి, స్టేక్‌హోల్డర్ల నుండి అభిప్రాయాలు కోరాలి. ఆ తరువాత సర్దుబాటు చార్జీలను నిర్ణయించి, ఆ మొత్తాన్ని వినియోగదార్ల నుండి ఎప్పుడు ఎన్ని వాయిదాల్లో వసూలు చేయాలో ఇఆర్‌సి ఉత్తర్వులిస్తుంది. కాబట్టి ఈ మొత్తం ప్రక్రియ ఒక త్రైమాసికం పూర్తయిన వెంటనే నిర్దిష్ట గడువులోగా పూర్తి కావాలి. కానీ ఇప్పుడు నోటిఫికేషన్ జారీ చేసింది 2022 జూన్‌తో ముగిసిన త్రైమాసికానిది. అంటే ఇప్పటికి దాదాపు రెండున్నరేళ్లు కావస్తోంది. ఎందుకింత గడువు పట్టింది అంటే సమాధానం అధికారులు లేదా అధికారంలోని పెద్దలు చెప్పరు కానీ అసలు కారణం 2024 సాధారణ ఎన్నికలే! ఇంతలేసి భారాలను ఎన్నికలకు ముందుగా ప్రతిపాదిస్తే ఆనాటి అధికార పార్టీకి జనం ఓటు వేయరు కదా (సర్దుపోటు గురించి ప్రకటించకపోయినా ప్రజలు గడచిన ఎన్నికల్లో ఆ పార్టీకి ఓట్లు వేయలేదనుకోండి!). అయితే ఈ తెలివి వైసిపిదే అనుకుంటే తప్పులో కాలేసినట్టే! విభజిత ఆంధ్రప్రదేశ్ తొలి ఐదేళ్ల పాలనాకాలంలోని మూడేళ్లకు సంబంధించిన ట్రు అప్ చార్జీలను టిడిపి సర్కారు కూడా ఆనాడు ప్రతిపాదించలేదు. కాబట్టి తమ స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రొసీజర్‌ను బైపాస్ చేసి, ఆ తరువాత ప్రజల్ని బాదడంలో రెండు పార్టీలకూ తేడా లేదన్నది మనమందరమూ తెలుసుకోవలసిన నీతి. అందుకే అధికారం ఏ పార్టీ చేతిలోవున్నా విద్యుత్ భారాలు, ఆ విధానాలూ అలాగే కొనసాగుతున్నాయి!

బహిరంగ విచారణ సమగ్రంగా జరిగేనా!

డిస్కాముల ప్రతిపాదనలను సెప్టెంబర్ 30న ప్రకటించిన ఇఆర్‌సి స్టేక్‌హోల్డర్లు అక్టోబర్ 14 లోగా తమ అభిప్రాయాలు పంపాలని కోరింది. మూడు డిస్కాములు ఒక్కోటి నాలుగు చొప్పున 12 పిటిషన్లు వాటి అనుబంధ పత్రాలు వేల పేజీల సమాచారాన్ని చదివి, విశ్లేషించి అభిప్రాయం చెప్పడానికి కేవలం రెండు వారాల గడువునివ్వడం సమంజసమా? అసలు అంత విస్తార సమాచారానిరింత తక్కువ వ్యవధిలో కూలంకషంగా పరిశీలించడం మానవమాత్రులకు సాధ్యమా? అక్కడికి నాలుగే రోజులలోనే అక్టోబర్ 18న బహిరంగ విచారణ జరుపుతామని ఇఆర్‌సి ప్రకటించింది. అంతలోనే అభ్యంతరదారులకు డిస్కాములు సరైన సమాధానాలివ్వగలవా? లేక అరకొర సమాధానాలతో సరిపెట్టాలనా? గడచిన పాతికేళ్లలో ఏ ఇఆర్‌సి కూడా ఇంత ఒత్తిడితో ఈ ప్రక్రియను నిర్వహించలేదు. ఇప్పుడే ఎందుకంటే గౌరవ ఛైర్మన్ అలాగే ఒక టెక్నికల్ సభ్యుడు అక్టోబర్ నెలాఖరుకు రిటైర్ కానున్నారు కనుక అదో కారణం కావచ్చునన్న కొందరి ఊహాగానాన్ని కొట్టి పారేయలేం. మరి అదే నిజమైతే అంత తక్కువ వ్యవధిలో తుది ఉత్తర్వులను జారీచేయడం సాధ్యమేనా అన్నది మరో ప్రశ్న. ఏది ఏమైనా గతంలో మాదిరిగా సర్దుబాటు చార్జీలపై త్రైమాసికాల వారీగా అభ్యంతరాలకు తగిన గడువునిచ్చి, ఆ తరువాత అదే క్రమంలో బహిరంగ విచారణను నిర్వహించడం సబబుగా ఉంటుంది. పునరాలోచించాలన్న పలువురి విజ్ఞప్తిని ఇఆర్‌సి మన్నిస్తుందని ఆశిద్దాం. లేనట్లయితే బహిరంగ విచారణ ప్రయోజనం నెరవేరదు.

కార్పొరేట్లకు లబ్ధి, స్వల్పకాలిక కొనుగోల్మాల్

ఒప్పందాలు కుదుర్చుకున్న ప్లాంట్ల నుండి రాష్ట్రంలో డిమాండ్‌కు తగినంత విద్యుత్ సరఫరా కావడం లేదంటూ ఓపెన్ మార్కెట్‌లో అధిక ధరకు పవర్ ఎక్స్‌ఛేంజి నుండి డిస్కాములు భారీగా కొనుగోలు చేశాయి. ప్రభుత్వరంగ జెన్‌కో ప్లాంట్లను సైతం బ్యాక్‌డౌన్ చేసి ఇటువంటి స్వల్ప కాలిక కొనుగోళ్లు చేశారు. అంతకుముందు ఒప్పందాలున్న కొన్ని సౌర విద్యుత్ కేంద్రాలకూ మొండి చెయ్యి చూపారు. పవర్ ఎక్స్‌ఛేంజి నుండి కొనేందుకు సీలింగ్, అలాగే సగటు ధర వంటి అంశాల్లో ఇఆర్‌సి కొన్ని షరతులు విధించినా వాటినీ అమలు చేశారని చెప్పలేం. ఇవన్నీ ఆనాటి ప్రభుత్వ పెద్దల ఆదేశానుసారమే జరిగాయన్న విషయం మరువరాదు. మొత్తంగా 2022-23లో 8,394 మి.యూ. విద్యుత్‌ను రూ.6,522 కోట్లు పెట్టి కొన్నారు. అంటే యూనిట్‌కు రూ.7.77 వెచ్చించారన్నమాట. ఆ ఏడాది మొత్తంలో విద్యుత్ వాడకం 64,078 మి.యూ.లలో స్వల్పకాలిక కొనుగోలు 13.1 శాతం కావడం గమనార్హం. అలాగే ప్రతిపాదిత సర్దుబాటు చార్జీ మొత్తంలో ఇది 80.4 శాతంగా ఉంది. అంటే పవర్ ఎక్స్‌ఛేంజిలోని దేశీయ, విదేశీ విద్యుత్ బేహారులను పోషించడానికి ఈ రాష్ట్రంలోని వినియోగదార్లు సర్దుబాటు చార్జీ చెల్లించాలన్నమాట! ఇంతకన్నా గోల్‌మాల్ ఏముంది?

ఇదోవైపున ఉండగానే పెద్ద కార్పొరేట్ సంస్థ హిందూజా పవర్‌కు రూ.1,234 కోట్లు బకాయి చివరి త్రైమాసికంలో చెల్లించామనీ అది కూడా ఈ సర్దుబాటు చార్జీల్లో కలపాలనీ డిస్కాములు ప్రతిపాదించాయి. అసలు ఒక్క యూనిట్ కరెంటు కూడా సరఫరా చేయకుండా హిందూజా కంపెనీకి వందల కోట్ల ప్రజా ధనాన్ని కట్టబెట్టే దారుణమైన చర్యలకు ఆనాటి సర్కారు పూనుకుంటే ఇప్పుడదంతా వినియోగదార్లే చెల్లించాలని ఈ ప్రభుత్వం చెబుతుందా? అంటే హిందూజాకు దోచిపెట్టడంలో దొందూ దొందేనని ప్రజలు అర్థం చేసుకోవాలి. ఈ రెండు ఖాతాలు కలిపితే రూ.7,756 కోట్లు. ఇది సర్దుపోటులో 95.6 శాతం కావడం గమనార్హం. ఎవరి కోసం ఈ సర్దుబాటు చార్జీలు? రాష్ట్ర ప్రజలారా బహుపరాక్!

పేదలకు పెనుభారం

ఈ సర్దుబాటు చార్జీల మూలంగా యూనిట్‌కు రూ.1.27 మాత్రమే భారం పడుతుందని డిస్కాముల వివరణ పత్రం పేర్కొన్నదీ సత్యదూరమే. రాష్ట్ర వ్యాప్త విద్యుత్ వినియోగం, సర్దుబాటు చార్జీ సగటు లెక్కించి ఆ మొత్తం తేల్చేశారు. కానీ వాస్తవానికి సర్దుబాటు చార్జీలను ఆయా త్రైమాసికాలనుబట్టి, ఆయా డిస్కాములు ఎంత చొప్పున వసూలు చేయవచ్చునో ఇ.ఆర్.సి నిర్ణయిస్తుంది. ఆ ప్రకారం అది ఒక్కో డిస్కాముకు ఒక్కో త్రైమాసికానికి యూనిట్‌కు ఒక్కో విధంగా ఉంటుంది. ఈ మాత్రం లాజిక్ కూడా లేకుండా ప్రజలను మభ్యపుచ్చేందుకు ప్రభుత్వ రంగంలోని డిస్కాములు యత్నించడం దారుణం. అంతేగాక ఇది పేదలకు పెనుభారం. ప్రస్తుతం వున్న టారిఫ్ ప్రకారం రోజుకు ఒక్క యూనిట్ మించకుండా (నెలకు 30 యూనిట్లు) వాడే నిరుపేదలు ఒక్కో యూనిట్‌కు ఇంధన చార్జీగా రూ.1.90, అదే నెలకు 400 యూనిట్లకు పైబడి వాడే సంపన్నులు యూనిట్‌కు రూ. 9.75 చొప్పన చెల్లించాలి. డిస్కాముల వివరణలో పేర్కొన్న సర్దుపోటు రూ.1.27 (అది నిజం కాదు) మాత్రమే అనుకున్నా నిరుపేదల ఇంధన చార్జీకి అదనంగా 67 శాతం చెల్లించాలి. అదే సంపన్నులకు మాత్రం అది 13 శాతమే! చూశారా ఈ గమ్మత్తు! మొత్తం విద్యుత్ సంస్కరణల మాటున జరిగేవి ఇలాంటి మాయాజాలాలే!

కూటమి హామీలు నిలబెట్టుకోవాలి

'విద్యుత్ చార్జీలు నియంత్రిస్తాం', 'విద్యుత్ బిల్లుల భారం తగిస్తాం' అని ఉమ్మడి మేనిఫెస్టో (ఆరవ పేజీలో) హామీనిచ్చి అధికారానికి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం తన మాట నిలబెట్టుకోవాలి. సర్దుబాటు చార్జీలు విద్యుత్ వాడకానికి సంబంధించినవే. అంతకన్నా ముఖ్యంగా రెండున్నరేళ్ల క్రితం వాడిన కరెంటుకు ఇప్పుడు చెల్లించాలనడం దారుణం. కూటమి సర్కారు చార్జీలను నియంత్రించడం కాదు సరికదా మరింత విశృంఖలం గావిస్తున్నది. బిల్లుల భారం తగ్గించడం గాక పెనుభారం మోపుతోంది. ఏలినవారు విజ్ఞతతో యోచించి ప్రతిపాదిత 'సర్దుపోటు'ను ఉపసంహరించడం అందరికీ శ్రేయస్కరం! ★

కవిత్వం

ధరల సునామీ

ఆర్థిక లెక్కలన్నీ
మైనస్ డిగ్రీకి చేరిపోయాయి
ఊపిరాడని సగటు బతుకులో
ధరల ఘాతుకం పిండేస్తుంటే
నాలికాడని దిగులు
నిలువునా నలిపేత్తాండాది
ఈ ధరల మంట
వంట గిన్నెల్ని బోర్లించి
పొయ్యిలో నీళ్ళు గుమ్మరించి
నవ్వుతా కూర్చుండాది.

ముట్టుకుంటే కాల్చివేసే
కూరగాయల ఆగ్రహానికి
సంచిలో ఒణుకు పుట్టి
గమ్మున మూల చేరింది
దినుసులన్నీ అగ్ని రవ్వలై
రగిలిపోతూ కనిపిస్తుంటే
మధ్యతరగతి జేబు అల్లాడిపోతూ
జ్వరమొచ్చి దుప్పటి కప్పేసింది
ఖాళీ డబ్బాలతో అల్మారా
బోసిబోయి కనిపిస్తుంటే
జీవన గతి గుక్క బట్టి ఏడ్చింది.

నూనె ధర
పైపైకి ఎగసి మండిపోతాంటే
సుబ్రమనాల్సిన పెనం
ఉసూరుమంటూ కూలబడింది
ఏది పట్టుకున్నా ధర
బుసలు కొడుతూ లేత్తాంటే
కరెన్సీ నోటుకు ఉక్కబోసింది
పంట రాబడి గోరంత
సరుకు కొనుగోలు కొండంత
చేతికందేది ఇసుమంత
సంత సరుకుల ధర అనకొండంత
ఈ ధరల సునామీ
పేగుల్ని మెలికపెట్టి మడతెట్టి
ఆర్థిక అగాధంలోకి పడేస్తోంది.

- నరెద్దుల రాజారెడ్డి
సెల్ : 9666016636

ఇంటర్వ్యూ

బిజెపి-జమాతె మ్యాచ్ ఫిక్సింగ్

జమ్ము కాశ్మీర్‌లో మునుపటి కంటే పోలింగ్ శాతం ఎక్కువగా నమోదైంది. ప్రస్తుత పరిస్థితి ఎలా వుంది?

పదేళ్ల తర్వాత జమ్ము కాశ్మీర్‌లో ఎన్నికలు జరిగాయి. ఇక్కడ చాలా అసాధారణమైన పరిస్థితి నెలకొంది. 2018 నుంచి శాసన సభ ఉనికిలో లేదు. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు, పౌర సమాజం, మీడియా, ఇతర సంబంధిత సంస్థలను ఏమాత్రం విశ్వాసంలోకి తీసుకోకుండానే, సంప్రదింపులు జరపకుండానే రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించే ఆర్టికల్ 370ని 2019లో తొలగించారు. చారిత్రక రాష్ట్రమైన జమ్ము కాశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించారు. స్వతంత్ర భారతదేశంలో ఏదైనా ఒక రాష్ట్రాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మార్చడం ఇదే తొలిసారి. దీంతో కేంద్రానికి, జమ్ము కాశ్మీర్ ప్రజలకు మధ్య సంబంధాలు మరింతగా దిగజారాయి.

అయితే సుప్రీంకోర్టు జోక్యం, దేశ ప్రజాభిప్రాయం, లౌకిక ప్రతిపక్ష పార్టీల నిరంతర ఒత్తిడి కారణంగా బిజెపి ప్రభుత్వం ఇప్పుడు జమ్ము కాశ్మీర్‌లో ఎన్నికలను నిర్వహించాల్సి వచ్చింది. దీంతో జమ్ము కాశ్మీర్‌పై కేంద్రం పట్టు సడలింది. జమ్ము కాశ్మీర్‌లో భారీ పోలింగ్ నమోదైన మాట వాస్తవమే. ప్రజలకు తమ అభిప్రాయాన్ని చెప్పేందుకు మరో మార్గం లేకపోవడంతో పెద్ద ఎత్తున కదలి వచ్చి ఓటింగ్ ద్వారా స్పందించారు.

370 రద్దుతో ప్రజల గొంతు నొక్కేశారు కదా...

2019లో ఆర్టికల్ 370 రద్దుతో బలవంతంగా రుద్దిన నిశ్శబ్దమిది. ప్రజల హక్కులపై తీవ్ర దాడి జరిగింది. పత్రికా స్వేచ్ఛను అణచివేశారు. దేశ ప్రజలకు లభించే పౌర హక్కులు జమ్ము కాశ్మీర్‌లో నిరాకరించబడ్డాయి. బిజెపి కూడా నియోజకవర్గాల పునర్విభజనను తనకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నించింది. జనాభా పెరుగుదల తక్కువగా ఉన్న జమ్మూ ప్రాంతంలో ఆరు కొత్త నియోజకవర్గాలు ప్రవేశపెట్టారు. సాపేక్షంగా అధిక జనాభా పెరుగుదల ఉన్న కాశ్మీర్‌లో కేవలం ఒక సీటు మాత్రమే జోడించారు. నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్.సి), కాంగ్రెస్ కూటమి ఏర్పడింది.

సిపిఎం పోటీ గురించి...

జమ్మూలో ఒక స్థానంలో, కాశ్మీర్‌లో రెండు స్థానాల్లో పోటీ చేయాలని సిపిఎం తొలుత నిర్ణయించింది. నేషనల్ కాన్ఫరెన్స్ నాయకుడు ఫరూక్ అబ్దుల్లాతో చర్చించిన తరువాత, కుల్గాంలో మాత్రమే పోటీ చేయాలని సిపిఎం నిర్ణయించుకుంది. బిజెపి వ్యతిరేక ఓట్లు చీలిపోకుండా ఉండేందుకు ఈ నిర్ణయం తీసుకున్నాం. 1996 నుంచి కుల్గాం నియోజక వర్గంలో సిపిఎం ఒంటరిగా పోటీ చేసి గెలుస్తోంది. జమ్ము కాశ్మీర్ ప్రజలను అవమానించిన బిజెపి కి తగిన సమాధానం చెప్పాలంటే లౌకిక పార్టీల విస్తృత కూటమి అవసరమని సిపిఎం అభిప్రాయపడింది.

బిజెపి ఎన్నికలను ఎలా ఎదుర్కొంది?

బిజెపి అధికార దుర్వినియోగానికి పాల్పడింది. ప్రజల ఐక్యతను విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నించింది. పాత షాడో కూటమి పార్టీలతో పాటు, జమ్ము కాశ్మీర్ జమాతె ఇస్లామీ, ఇంజనీర్ రషీద్ 'అవామీ ఇత్తెహాద్' వంటి కొత్త షాడో భాగస్వాములను తోడు చేసుకుంది.

జమాతె ఇస్లామీ గత కొంతకాలంగా ఎన్నికలకు దూరంగా ఉంటూ వచ్చింది. నేను 1972లో జైలులో ఉన్నాను. నేషనల్ కాన్ఫరెన్స్ నిషేధించబడింది. ఆ ఏడాది ఎన్నికల్లో పోటీ చేసిన జమాతె ఇస్లామీ ఐదు స్థానాల్లో విజయం సాధించింది. వీరిలో ఇద్దరు కుల్గాం ప్రాంతానికి చెందినవారు. 1977లో వారికి ఒక్క సీటు వచ్చింది. 1987లోనూ ఇదే పరిస్థితి. 1996 ఎన్నికలలో ఎన్.సి, సిపిఎం కు వ్యతిరేక వైఖరి తీసుకున్నారు. తర్వాత వారు పిడిపి కి మద్దతు పలికారు. ఇప్పుడు తొలిసారిగా జమాతె ఇస్లామీపై నిషేధం విధించబడింది. అయితే కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపాక చివరికి స్వతంత్రులుగా పోటీ చేసేందుకు అంగీకరించారు. అయితే అధికారికంగా నిషేధాన్ని ఎత్తివేయలేదు.

జమాతె ఇస్లామీ పోటీ చేసిన స్థానాల్లో కుల్గాం ఒకటి. అక్కడ వారు తమ శక్తులన్నీ ఒడ్డారు. మిగతా చోట్ల పోటీని సీరియస్‌గా తీసుకోలేదు. నేను సిపిఎం అభ్యర్థిగా పోటీ చేసిన కుల్గాంలో కేంద్ర ప్రభుత్వం జమాతె ఇస్లామీని ప్రోత్సహించి వారికి సకల సౌకర్యాలు కల్పించింది. జమాతె ఇస్లామీ సిపిఎంకు తొలి ప్రత్యర్థి. గతంలో వారు రాజ్యాంగాన్ని తిరస్కరిస్తూ ఎన్నికల్లో పాల్గొన్న వారిపై దాడులు చేసి చంపిసేవారు. జమ్ము కాశ్మీర్‌కు స్వేచ్ఛను కల్పించి పాకిస్తాన్‌లో కలుపుతామని 1989 నుంచి చెబుతూ వచ్చారు. వారు 'భారత ఆక్రమణ' వాదనను కూడా వినిపించారు. అయితే ఇప్పుడు దానికి విరుద్ధంగా 'యూ టర్న్' తీసుకున్నారు. జమ్ము కాశ్మీర్‌లో దశాబ్దాల తరబడి సాగించిన రక్తపాతానికి స్వస్తి పలికి శాంతిని నెలకొల్పుతామని చెప్పగలుగుతారా? ఇన్నాళ్లూ సాగించిన కిరాతకమైన నేరాలకు బాధ్యత వహిస్తారా? ఉన్నపళంగా వైఖరి మార్చేసుకోవడానికి దారితీసిన పరిస్థితులేమిటి? వారు ఏ తరహా ఒత్తిళ్లను ఎదుర్కొన్నారో ప్రజలకు వివరించాల్సి వుంది.

బిజెపి అవలంభిస్తున్న ద్వంద్వ ప్రమాణాలు ఎన్నికల తీర్పును ప్రభావితం చేస్తాయా?

సిపిఎం, ఎన్.సి, జమ్ము కాశ్మీర్ పిడిపి వంటి ప్రధాన పార్టీలను కేంద్ర ప్రభుత్వం వెంటాడి వేధిస్తోంది. అక్కడ జరుగుతున్న రక్తపాతానికి ఈ పార్టీలు బలవుతున్నాయి. మరోవైపు కేంద్రం వేర్పాటు వాదులను బుజ్జగిస్తోంది. గణతంత్ర భారత్‌కు వ్యతిరేకంగా 'జిహాద్' ప్రకటించిన వారితో అది బహిరంగంగా చేతులు కలిపింది. దీనిని దేశ ప్రజలు, ప్రజాతంత్ర శక్తులు గమనిస్తున్నారు. జమాతె ఇస్లామీ, ఇప్పుడున్న కేంద్ర ప్రభుత్వం తమ ద్వంద్వ ప్రమాణాలపై ప్రజలకు సంజాయిషీ ఇచ్చుకోవాలి.

ఈ ఎన్నికలను చూసినట్లయితే...కుల్గాం నియోజక వర్గంలో లౌకిక పార్టీలు దీర్ఘకాల సుస్థిరత, అభివృద్ధి కార్యకలాపాలు, కార్మికుల సమస్యలను ప్రజాస్వామ్య సమస్యలను ప్రస్తావించి ప్రజల దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశాయి. మతాన్ని రాజకీయ ఆయుధంగా వాడుతున్న వారి అసలు సిసలు రూపాన్ని ప్రజల ముందుంచాయి. జమాతె ఇస్లామీ, బిజెపి సమాంతర ఎజెండాను కూడా వారికి వివరించాయి. నేను గతంలో నాలుగుసార్లు గెలుపొందినప్పటికీ ఈ ఎన్నికలు కొత్త అనుభవాన్నిచ్చాయి. ప్రచారంలో మంచి స్పందన వచ్చింది. యావత్ జమ్ము కాశ్మీర్ ప్రజా తీర్పు కోసం వేచి ఉంది. ★

జనవాక్యం

ప్రాయశ్చిత్త శిక్షలా? ప్రచారానికి పాట్లా?

టిడిపి ముందు తన ఉనికిని కాపాడుకోవడానికి జనసేన తెగ అగచాట్లు పడుతున్నది. బుడమేరు వరద ముంపు సందర్భంలో ముఖ్య మంత్రితో సహా మంత్రులందరూ ముంపు ప్రాంతాల్లో పర్యటనలు చేశారు. వరద సహాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అటువంటి కీలక సమయంలో కూడా శాంతి భద్రతల రీత్యా గ్రౌండ్ లెవల్ పర్యటనలు చేయలేకపోయానని పవన్ కళ్యాణ్ తెలిపారు. వరదల్లో ఎక్కడా కనిపించ లేదు. ఆ నిరాశలో నుండి బయటకు రావడానికో లేక బిజెపి ఎజెండాను రాష్ట్రంలో రుద్దడానికో తిరుపతి లడ్డూ వివాదం వచ్చిన దగ్గర నుండి ఏదో ఒక కామెంట్ చేస్తూ ప్రతిరోజూ వార్తల్లో నిలుస్తున్నారు. మా పార్టీ విధానాలతో కొత్త సమాజాన్ని సృష్టిస్తాం అన్న నాయకుడే నేడు తన ఉనికిని కాపాడుకోవడం కోసం మతాల మధ్య వివాదాలు రగిల్చేలా మాట్లాడుతున్నారు. ప్రాయశ్చిత్తం తప్పు చేసిన వారు చేసుకోవాలి. తిరుపతి లడ్డూలలో కల్తీ జరిగిందని విమర్శ వచ్చినపుడు విచారణకు సహకరించాలి. ప్రసాదం పవిత్రత, అవినీతి విషయంలో భక్తులకు, ప్రజలకు సాంత్వన కలిగేలా వ్యవహరించాలి. అవసరం లేకుండా ప్రాయశ్చిత్త దీక్ష తీసుకుని మరో దేవుడ్ని పూజించే వారిపై విషం జల్లడం, ఆ పైన ఘర్షణలు జరిగేలా రెచ్చగొట్టడమంటే ఇంకెక్కడి పాపచింతన? ఇంకెక్కడి ప్రాయశ్చిత్తం?

- టి. గీతావాణి

మత స్వేచ్ఛ క్షీణిస్తోంది

- మైనారిటీలపై పెరుగుతున్న దాడులు, వేధింపులు
- ఆజ్యం పోస్తున్న నేతల వ్యాఖ్యలు, ప్రభుత్వ విధానాలు
- బుల్డోజర్ న్యాయాన్ని అనుసరిస్తున్న పాలకులు
- భారత్‌పై అమెరికా కమిషన్ తాజా నివేదిక

న్యూఢిల్లీ : భారతదేశంలో మతపరమైన స్వేచ్ఛ క్షీణిస్తోందని అమెరికా ప్రతినిధుల సభకు చెందిన ద్వైపాక్షిక సలహా సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. అంతర్జాతీయ మత స్వేచ్ఛపై ఏర్పడిన అమెరికా కమిషన్ (యూఎస్‌సీఐఆర్‌ఎఫ్) గాంధీజీ జయంతి రోజున మన దేశానికి సంబంధించి తాజా నివేదికను విడుదల చేసింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో భారత్‌కు చెందిన ప్రముఖ నాయకులు రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని, ముస్లింలు, క్రైస్తవులపై దాడులు పెరగడానికి ప్రభుత్వ విధానాలు ఆజ్యం పోశాయని కమిషన్ వేలెత్తి చూపింది.

ముస్లింలు, క్రైస్తవులపై దాడులు

ఈ సంవత్సరం జనవరి-మార్చి నెలల మధ్యకాలంలో క్రైస్తవులపై 161 హింసాత్మక ఘటనలు జరిగాయని అమెరికా కమిషన్ తన నివేదికలో ప్రస్తావించింది. వీటిలో ఒక్క ఛత్తీస్‌గఢ్‌లోనే 47 సంఘటనలు చోటుచేసుకున్నాయని గుర్తు చేసింది. బలవంతపు మత మార్పిడులు చేస్తున్నారన్న ఆరోపణలపై ఉత్తరప్రదేశ్‌లో జూన్, జూలై నెలలలో 20 మంది క్రైస్తవులను అరెస్ట్ చేశారని తెలిపింది. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత ముస్లింలను లక్ష్యంగా చేసుకొని దేశంలో కనీసం 28 దాడులు జరిగాయని చెప్పింది. ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రసంగాలు ముస్లిం వ్యతిరేక దాడులకు పురిగొల్పాయని తెలియజేసింది.

నేతల ప్రసంగాలలో విద్వేషం...వివక్ష

'లోక్‌సభ ఎన్నికల ప్రచారం సమయంలో భారత రాజకీయ నాయకులు ముస్లింలు, ఇతర మత మైనారిటీలకు వ్యతిరేకంగా విద్వేషపూరితమైన, వివక్షాపూరితమైన ప్రసంగాలు చేశారు. ప్రతిపక్షాలకు ఓటేస్తే హిందూ విశ్వాసాలను మంటగలుపుతాయని ప్రధాని మోడీ హెచ్చరించారు. ప్రతిపక్షాలకు అధికారం ఇస్తే షరియా చట్టాన్ని విధిస్తాయని హోం మంత్రి అమిత్ షా చెప్పారు' అని అమెరికా కమిషన్ వివరించింది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు మైనారిటీలపై హింస, నేరాలు పెరగడంపై అమెరికా నిపుణుల బృందం ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని నివేదిక గుర్తు చేసింది. మైనారిటీలపై నిఘా పెట్టి హింసించారని, వారిని లక్ష్యంగా చేసుకొని హత్యాకాండ సాగించారని, వారి ఆస్తులు ధ్వంసం చేశారని, వారిని వేధింపులకు గురి చేశారని తెలిపింది. 'ప్రభుత్వంలోని పెద్దలు తప్పుడు సమాచారం అందిస్తూ దుష్ప్రచారం సాగించారు. విద్వేష ప్రసంగాలు చేశారు. గో సంరక్షణ పేరుతో మైనారిటీలపై దాడులను ప్రేరేపించారు. జనవరిలో అయోధ్యలో రామ మందిరాన్ని ప్రారంభించిన తర్వాత ముంబయిలోని మిరా రోడ్డులో ముస్లింలపై దాడులు జరిగాయి. మతోన్మాదాన్ని రెచ్చగొట్టేలా బీజేపీ ఎమ్మెల్యేలు నితీష్ రాణే, గీతా జైన్ చేసిన ప్రసంగాలే ఈ దాడులకు ప్రేరణ ఇచ్చాయి. ఇది ఓ ఉదాహరణ మాత్రమే' అని కమిషన్ తన నివేదికలో తెలిపింది.

బుల్డోజర్ న్యాయం

మైనారిటీలపై దాడులకు పురిగొల్పడమే కాకుండా ప్రభుత్వంలోని పెద్దలు 'బుల్డోజన్ న్యాయాన్ని' పాటించారని కమిషన్ విమర్శించింది. అక్రమ నిర్మాణాల పేరుతో ముస్లింల ఆస్తులను ధ్వంసం చేశారని అంటూ ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా ఢిల్లీలోని ఆరు వందల సంవత్సరాల నాటి మసీదును కూల్చివేశారని, దీనిపై పెద్ద ఎత్తున ప్రజాగ్రహం పెల్లుబికిందని చెప్పింది. వక్ఫ్ ఆస్తులపై ప్రభుత్వ నియంత్రణకు అవకాశం కల్పించే వక్ఫ్ సవరణ బిల్లును నివేదిక తప్పుపట్టింది. ఈ బిల్లులోని నిబంధనల కారణంగా ముస్లిం సమాజం తన మత సంస్థలపై స్వయం ప్రతిపత్తిని కోల్పోతుందని తెలిపింది. 'భారతదేశంలోని ముస్లిం సమాజాలకు సంపద పంపిణీ అంటూ దుష్ప్రచారాన్ని వ్యాపింపజేసిన తర్వాత ఈ బిల్లును తీసుకొచ్చారు. ఎన్నికల ప్రచార సమయంలో ప్రధాని మోడీ కూడా అవమానకరంగా వ్యాఖ్యానించారు' అని ప్రస్తావించింది.

నిరసన గళాల అణచివేత

మత మార్పిడుల నిరోధక చట్టాలు, గోవధ చట్టాలు, ఉగ్రవాద వ్యతిరేక చట్టాలు వంటి వివక్షాపూరిత చట్టాలను అమలు చేయడం ద్వారా భారత ప్రభుత్వం మత సమాజాలను అణచివేస్తోందని, నియంత్రిస్తోందని అమెరికా కమిషన్ విమర్శించింది. మత స్వేచ్ఛ ఉల్లంఘనకు గురవుతోందంటూ మత నాయకులు, పాత్రికేయులు, మానవ హక్కుల కార్యకర్తలు సహా పలువురు గళం విప్పుతుంటే ఎలాంటి చట్టపరమైన ప్రక్రియలు పాటించకుండా వారిని అరెస్ట్ చేస్తున్నారని, కొన్ని కేసులలో సంవత్సరాల తరబడి కారాగారాలలో ఉంచుతున్నారని మండిపడింది.

మేలోనూ నివేదిక

ఈ ఏడాది మేలో కూడా భారత్‌ను 'ప్రత్యేక ఆందోళనకరమైన' దేశంగా పరిగణించాలని యూఎస్‌సీఐఆర్‌ఎఫ్ సిఫార్సు చేసింది. వాస్తవానికి 2020 నుండి కమిషన్ అమెరికా ప్రభుత్వానికి పదే పదే ఈ సిఫార్సు చేస్తోంది. అయితే దానిని ఇప్పటి వరకూ ఆ ప్రభుత్వం పట్టించుకోలేదు. కమిషన్ నివేదికపై విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందిస్తూ భారత ఎన్నికల ప్రక్రియలో యూఎస్‌సీఐఆర్‌ఎఫ్ జోక్యం చేసుకుంటోందని ఆరోపించారు. 'అమెరికా కమిషన్ పక్షపాతపూరితంగా వ్యవహరించే సంస్థ. దానికి రాజకీయ అజెండా ఉంది. వార్షిక నివేదిక ముసుగులో భారత్ వ్యతిరేక ప్రచారాన్ని కొనసాగిస్తోంది. మన వైవిధ్యభరితమైన, ప్రజాస్వామిక నీతి నియమాలను అర్థం చేసుకునేందుకు ఆ సంస్థ ప్రయత్నిస్తుందని మేము అనుకోవడం లేదు. ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామిక ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకునేందుకు వారు చేసే ప్రయత్నాలు ఫలించవు' అని ఆయన అప్పట్లో విమర్శించారు.

సోనమ్ వాంగ్‌చుక్ విడుదల

- నిషేధాజ్ఞలు వెనక్కి
- కోర్టుకు విన్నవించిన కేంద్రం

న్యూఢిల్లీ : పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, ఆయన సహచరులను నిర్బంధం నుండి విడుదల చేసినట్లు కేంద్ర ప్రభుత్వం గురువారం వెల్లడించింది. ఇందుకు సంబంధించిన కేసులో విచారణ సందర్భంగా ఢిల్లీ హైకోర్టుకు ఈ విషయాన్ని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలియజేశారు. ఢిల్లీలోని వివిధ ప్రాంతాల ప్రజలు గుమిగూడడంపై, నిరసనలు తెలియచేయడంపై పోలీసులు విధించిన నిషేధాజ్ఞలను కూడా ఉపసంహరించినట్లు తెలిపారు. వాంగ్‌చుక్ ప్రభృతులను విడుదల చేయాలని, నిషేధాజ్ఞలను ఉపసంహరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను చీఫ్ జస్టిస్ మన్మోహన్, జస్టిస్ తుషార్ రావుతో కూడిన బెంచ్ విచారిస్తోంది. రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో లడఖ్‌ను చేర్చాలని కోరుతూ రాజధానికి ప్రదర్శనగా వెళుతుండగా, వాంగ్‌చుక్‌తో పాటూ దాదాపు 120 మందిని ఢిల్లీ సరిహద్దుల్లో పోలీసులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. నెల రోజుల క్రితం లేహ్ నుండి ఢిల్లీ చలో పాదయాత్ర ప్రారంభమైంది. అయితే ఆయనను పోలీసులు నిర్బంధించారని, విడుదల చేసినట్టే చేసి మళ్లీ నిర్బంధించారంటూ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో ఆయనను విడుదల చేయాలని కోరుతూ ఈ పిటిషన్లు దాఖలయ్యాయి. అయితే వాస్తవానికి పోలీసులు ఆయనను నిర్బంధించడం వాస్తవం కాదని, వారు బుధవారం రాజ్‌ఘాట్‌ను కూడా సందర్శించారని తుషార్ మెహతా అన్నారు. అక్కడ రెండు గంటల పాటు వున్నారని, కేంద్ర హోం శాఖలో కొన్ని మెమరాండాలు కూడా ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ఆ తర్వాత వారు వెళ్ళిపోయారని మెహతా చెప్పారు. మెహతా వాదనతో పిటిషనర్ల తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ విభేదించారు. సోనమ్, ఆయన అనుచరులు జంతర్‌మంతర్ వరకు వెళ్లాలని అనుకున్నారని, కానీ పోలీసులు వారిని అడ్డుకున్నారని చెప్పారు. అక్కడికి వెళ్లకుండా వారిపై నిషేధం విధించారని చెప్పారు. వాంగ్‌చుక్‌ను ఇతరులతో కలవనివ్వకుండా విడిగా వుంచారని చెప్పారు. అయితే ఇదంతా తప్పుడు ప్రకటనలని మెహతా అభ్యంతరం వ్యక్తం చేశారు. వాంగ్‌చుక్, ఇతరుల విడుదలపై తుషార్ మెహతా ఇప్పటికే ఒక ప్రకటన చేశారని, వాంగ్‌చుక్ విడుదలయ్యారని జస్టిస్ మన్మోహన్ వ్యాఖ్యానించారు.

ఢిల్లీలో దారుణం

- డాక్టర్‌ను కాల్చి చంపిన యువకులు

న్యూఢిల్లీ : దేశ రాజధాని న్యూఢిల్లీలో చికిత్స కోసం వెళ్లిన యువకులు డాక్టర్‌ను కాల్చి చంపారు. కలింది కుంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఈ దారుణం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..జైత్‌పుర్‌లో ఉన్న నీమా ఆసుపత్రికి గాయాలతో ఇద్దరు వ్యక్తులు వెళ్లారు. డ్రెస్సింగ్ చేసిన తర్వాత డాక్టర్‌ను కలవాలని పట్టుబట్టారు. దీంతో ఆసుపత్రి సిబ్బంది నిందితులకు డాక్టర్ అప్పాయింట్‌మెంట్ ఇచ్చారు. ఆ వెంటనే క్యాబిన్‌లోకి వెళ్లిన దుండగులు డాక్టర్‌ను కాల్చి చంపారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. నిందితులు ఆసుపత్రి నుంచి బయటకు వెళ్తున్న దృశ్యాలు సిసిటివిలో రికార్డు అయినట్లు తెలిపారు. మరణించిన వైద్యుడిని యూనాని ప్రాక్టీషనర్ జావెద్ అక్తర్‌గా గుర్తించారు. నిందితులను గుర్తించేందుకు సిసిటివి ఫుటేజీని స్వాధీనం చేసుకొని పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులు చూడటానికి మైనర్లుగా కనిపిస్తున్నారని, వీరి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని చెప్పారు. దీనిపై ఆమాద్మీ పార్టీ నేత, మంత్రి సౌరభ్ భరద్వాజ్ మాట్లాడుతూ లెఫ్టినెంట్ గవర్నరు ఎల్‌జి వికె సక్సేనా కారణంగానే ఢిల్లీలో నేరాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ రాజధాని ప్రాంతంలో శాంతిభద్రతలను పరిరక్షించడంలో సక్సేనా పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.

ఐదేళ్లలో 200 భారీ రైలు ప్రమాదాలు

- గాలిలో కలిసిన 351 మంది ప్రాణాలు
- రైల్వేశాఖ నివేదిక

న్యూఢిల్లీ : గత ఐదు సంవత్సరాల కాలంలో దేశంలోని వివిధ ప్రాంతాలలో 200 భారీ రైలు ప్రమాదాలు జరిగాయి. వీటి కారణంగా 351 మంది ప్రాణాలు కోల్పోగా 970 మంది గాయపడ్డారు. దేశంలోని 17 రైల్వే జోన్ల నుంచి సేకరించిన ప్రమాదాల సమాచారాన్ని భారతీయ రైల్వేలు వెల్లడించాయి. కోల్‌కతాలోని ప్రభుత్వ రంగ సంస్థ బ్రెయిత్‌వెయిట్ అండ్ కంపెనీని తనిఖీ చేసిన అనంతరం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకరులతో మాట్లాడుతూ పది సంవత్సరాల క్రితం సంవత్సరానికి 171 రైలు ప్రమాదాలు జరిగేవని, ఇప్పుడు వాటి సంఖ్య 40కి తగ్గిందని చెప్పారు.

2019-20 నుండి 2023-24 వరకూ...గత ఐదు సంవత్సరాలలో రైల్వే శాఖ రూ.32 కోట్ల నష్టపరిహారాన్ని చెల్లించింది. ఇందులో మృతుల కుటుంబాలకు రూ.26.83 కోట్లు, గాయపడిన వారికి రూ.7 కోట్లు అందించారు. దేశంలో రైలు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారిపోయాయి. ప్రాణనష్టం జరగడం, వందలాది మంది గాయపడడం, రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడడం, రైల్వే ఆస్తులకు నష్టం జరగడం జరుగుతోంది. పట్టాలు తప్పడం, రైళ్లు పరస్పరం ఢీకొనడం, మంటలు వ్యాపించడం వంటివి రైలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఆర్‌టీఐ కార్యకర్త వివేక్ పాండే దరఖాస్తుకు స్పందిస్తూ రైల్వే శాఖ ఈ సమాచారాన్ని అందించింది.

గత సంవత్సరం జూన్‌లో బాలాసోర్‌లో మూడు రైళ్లు ఢీకొన్న ఘటన సహా మొత్తం పది భారీ ప్రమాదాలలో 297 మంది చనిపోగా 637 మంది గాయపడ్డారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్‌లో 12 ప్రమాదాలు జరగగా ఒకరు చనిపోయారు. తొమ్మిది మంది గాయపడ్డారు. ఈస్ట్ సెంట్రల్ జోన్‌లో 18 ప్రమాదాలు జరిగాయి. ఎనిమిది మంది చనిపోగా 33 మంది గాయపడ్డారు. నార్త్ సెంట్రల్ జోన్‌లో 21 ప్రమాదాలు జరగగా ఇద్దరు చనిపోయారు. 49 మందికి గాయాలయ్యాయి. నార్తరన్ రైల్వే జోన్‌లో 25 ప్రమాదాలు జరిగాయి. ఐదుగురు ప్రాణాలు కోల్పోగా అంతే సంఖ్యలో గాయపడ్డారు.

దక్షిణ మధ్య రైల్వేలో 12 ప్రమాదాలు జరిగాయి. ఒకరు చనిపోగా 26 మంది గాయపడ్డారు. సౌత్ ఈస్ట్ సెంట్రల్ జోన్‌లో తొమ్మిది ప్రమాదాలు జరిగాయి. ముగ్గురు ప్రాణాలు కోల్పోగా ఆరుగురు గాయపడ్డారు. నార్త్ ఈస్ట్ ఫ్రాంటియర్ రైల్వేలో తొమ్మిది ప్రమాదాలు జరిగాయి. తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోగా 45 మంది గాయాలపాలయ్యారు. నార్త్ వెస్టన్ జోన్‌లో పది ప్రమాదాలు జరగగా 70 మంది గాయపడ్డారు. వెస్ట్ సెంట్రల్ జోన్‌లో ఏడు ప్రమాదాలు జరగగా ఒకరు చనిపోయారు. తొమ్మిది మంది గాయపడ్డారు. వెస్టన్ జోన్‌లో 12 ప్రమాదాలు జరిగాయి. ముగ్గురు మరణించారు. నార్త్ ఈస్టన్, కొంకణ్ రైల్వే, సౌత్ వెస్టన్, సదరన్ రైల్వే జోన్లలో ప్రమాదాలు జరిగినప్పటికీ ఎవరూ మరణించలేదు.

హైబాక్స్ యాప్ కేసులో ఐదుగురికి సమన్లు

న్యూఢిల్లీ : హైబాక్స్ మొబైల్ అప్లికేషన్ ద్వారా భారీగా పెట్టుబడి పెట్టడంతో పలువురు తీవ్రంగా నష్టపోయిన ఘటనలో ఢిల్లీ పోలీసులు గురువారం చర్యలకు ఉపక్రమించారు. ఈ యాప్‌తో పెట్టుబడులు పెట్టాలంటూ సోషల్ మీడియా ద్వారా ప్రజలపై తీవ్ర ప్రభావం చూపిన ఐదుగురు ప్రముఖ వ్యక్తులకు పోలీసులు సమన్లు జారీ చేశారు. సామాజిక మాధ్యమాల్లో లక్షలాది మంది ఫాలోయర్స్ ఉన్న యూట్యూబర్లు అభిషేక్ మల్హన్, ఎల్విష్ యాదవ్, లక్షయ్ చౌదరి, పురవ్ ఝా, ప్రముఖ హాస్యనటి భారతీ సింగ్‌కు పోలీసులు సమన్లు జారీ చేశారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాలని వాంగ్మూలం ఇవ్వాలని సమన్లలో పేర్కొన్నారు.

హైబాక్స్ యాప్‌ను వీరంతా ప్రమోట్ చేసినట్లు ఫిర్యాదులందాయి. అధిక మొత్తంలో రాబడి ఎరగా వేసి హైబాక్స్ యాప్ ద్వారా రూ.500 కోట్లు పెట్టుబడులు సమీకరించి మదుపర్లను మోసం చేసినట్లు వందలాది మంది బాధితులు ఢిల్లీ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న ప్రముఖుల ప్రచారాలను నమ్మే తామంతా పెట్టుబడులు పెట్టామని, దాదాపు 30 వేల మంది మోసానికి గురైనట్లు తెలిపారు.

ఈశా ఫౌండేషన్‌పై దర్యాప్తు ఆపండి

- మద్రాస్ హైకోర్టు ఆదేశాలపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ : మహిళలు సన్యాసం తీసుకునేలా ప్రేరేపిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటోన్న ఈశా ఫౌండేషన్ తాజాగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఫౌండేషన్‌పై నమోదైన క్రిమినల్ కేసుల వివరాలను సమర్పించాలని తమిళనాడు పోలీసుల్ని మద్రాసు హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం మెట్లెక్కింది. దీనిపై తాజాగా కోర్టులో విచారణ జరిగింది. హైకోర్టు ఆదేశాలను అనుసరించి ఫౌండేషన్‌పై తదుపరి చర్యలు తీసుకోవద్దని సుప్రీం ధర్మాసనం గురువారం తమిళనాడు పోలీసులను ఆదేశించింది. అలాగే ఆ స్టేటస్ రిపోర్టు వివరాలను తమకు సమర్పించాలని వెల్లడించింది. ఇక ఈ వ్యవహారంపై ఇద్దరు యువతుల తండ్రి దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను హైకోర్టు నుంచి సుప్రీం ధర్మాసనం ముందుకు బదిలీ చేసింది.

మళ్లీ పెరిగిన వెల్లుల్లి ధర

చెన్నై : దిగుమతులు తగ్గడంతో వెల్లుల్లి ధరలు మళ్లీ పెరిగాయి. మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్తాన్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా తదితర రాష్ట్రాలతో పాటు రాష్ట్రంలోని దిండుగల్‌లో కొండ వెల్లుల్లి సాగు చేస్తుంటారు. ప్రతియేడాది ఖరీఫ్ సీజన్‌లో జూన్, జులైలో సాగు ప్రారంభించి సెప్టెంబరులో కోత చేపడుతుంటారు. ఈ నేపథ్యంలో, ఆయా రాష్ట్రాల్లో వర్షాలు, నీటి కొరత కారణంగా వెల్లుల్లి దిగుబడులు తగ్గాయి. దీంతో కోయంబేడు మార్కెట్‌కు వెల్లుల్లి దిగుమతి తగ్గడంతో మొదటి రకం వెల్లుల్లి కిలో రూ.350, రెండో రకం రూ.300, మూడో రకం కిలో రూ.260 ఉంది. విజయదశమి, దీపావళి పండగల నేపథ్యంలో, వీటి ధరలు మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు పేర్కొంటున్నారు.

వ్యవసాయ పథకాల కుదింపు

- కేంద్ర కేబినెట్ ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ కింద అమలులో ఉన్న పథకాలన్నిటినీ ఇక నుంచి రెండు పథకాల కింద కుదించాలని కేంద్ర కేబినెట్ నిర్ణయించింది. ఈ రంగాలకు సంబంధించిన కేంద్ర ప్రాయోజిత పథకాలను (సిఎస్ఎస్) అన్నిటినీ రెండు పథకాలుగా మార్చాలంటూ సదరు మంత్రిత్వశాఖ చేసిన ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (పిఎం-ఆర్‌కెవివై), కృషోన్నతి యోజన (కెవై) కిందకు ఈ పథకాలను చేర్చనున్నారు. దీంతో పాటు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

బెంగాలీ సహా ఐదు భాషలకు ప్రాచీన హోదా

దేశంలో బెంగాలీ, మరాఠీ, అస్సామీ సహా ఐదు భాషలకు ప్రాచీన హోదా కల్పించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోద ముద్ర వేసింది. ఇప్పటికే తెలుగు సహా ఆరు భాషలకు ప్రాచీన హోదా ఉంది. వీటి సరసన ఇప్పుడు మరో ఐదు భాషలు చేరనున్నాయి. బెంగాలీ, అస్సామీ, మరాఠీ, పాళి, ప్రాకతం భాషలకు ప్రాచీన హోదా కల్పించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

రైల్వే ఉద్యోగులకు ఉత్పాదక బోనస్

పండగల నేపథ్యంలో రైల్వే ఉద్యోగులకు బోనస్ చెల్లించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా 11.72 లక్షల మంది రైల్వే ఉద్యోగులకు 78 రోజుల ఉత్పాదక అనుసంధానిత బోనస్‌గా రూ.2028.57 కోట్లు చెల్లించాలని నిర్ణయించింది. ఈ విషయాన్ని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు.

- దేశీయ నూనె గింజల ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు వంట నూనెలు (ఎడిబుల్ ఆయిల్స్), నూనె గింజల జాతీయ మిషన్‌కు కూడా కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 2024-25 నుండి 2030-31 వరకు ఏడేళ్ల వ్యవధిలో ఈ మిషన్ కోసం రూ.10,103 కోట్ల ఖర్చు చేయనున్నట్లు మంత్రివర్గం పేర్కొంది.
- చెన్నై మెట్రో రైల్ ప్రాజెక్టు రెండో దశకు ఆమోద కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు ట్రాఫిక్‌ను సులభతరం చేయడంతో పాటు ఆర్థిక వృద్ధిని మెరుగుపరచడంలో సహాయపడుతుందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఫేజ్-2లో భాగంగా రూ.63,246 కోట్లతో 119కి.మీల మేర ఈ భారీ ప్రాజెక్టు చేపట్టేందుకు మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. ఈ ప్రాజెక్టు కింద మూడు కారిడార్లుగా మొత్తం 120 స్టేషన్లు నిర్మించనున్నారు.
- అంతర్జాతీయ ఇంధన సుస్థిరత మండలి (ఇంటర్నేషనల్ ఎనర్జీ ఎఫిషియెన్సీ హబ్)లో భారత్ చేరేందుకు కూడా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రపంచ వ్యాప్తంగా ఇంధన సామర్థ్యాన్ని ప్రోత్సహించడానికి అంకితమైన వేదికగా ఈ హబ్‌కు పేరుందని మంత్రి అశ్వనీ కుమార్ వైష్ణవ్ తెలిపారు.

బీరుట్ నడిబొడ్డున దాడి

- 9మంది మృతి, 14మందికి గాయాలు
- హిజ్బుల్లా ఇంటెలిజెన్స్ హెడ్‌క్వార్టర్స్‌పై దాడి చేశామన్న ఇజ్రాయిల్
- మరో దాడిలో ఇద్దరు లెబనాన్ సైనికులు మృతి
- దాడి చేస్తే చర్యలు తప్పవన్న ఇరాన్

బీరుట్, గాజా : సెంట్రల్ బీరుట్‌లో ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడిలో గురువారం 9మంది మరణించారు. 14మంది గాయపడ్డారు. వీరందరూ ఆరోగ్య, సహాయ కార్యకర్తలని అధికారులు తెలిపారు. గత 24గంటల్లో లెబనాన్‌లో మొత్తంగా 28మంది ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలు మృతి చెందారని డబ్ల్యుహెచ్‌ఓ చీఫ్ గురువారం చెప్పారు. బాంబు దాడుల కారణంగా చాలామంది కార్యకర్తలు విధులకు హాజరు కాకుండా ఆ ప్రాంతాల నుండి పారిపోయారని డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అదనామ్ ఆన్‌లైన్ మీడియా సమావేశంలో చెప్పారు. గత మూడు రోజుల్లో ఇజ్రాయిల్ దాడుల్లో 40మందికి పైగా సహాయక సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది మరణించారని లెబనాన్ ఆరోగ్య మంత్రి చెప్పారు. బీరుట్‌లో హిజ్బుల్లా ఇంటెలిజెన్స్ ప్రధాన కార్యాలయంపై గురువారం దాడి చేసినట్లు ఇజ్రాయిల్ మిలటరీ తెలిపింది. కమాండ్ సెంటర్లు, తీవ్రవాద వసతులను నాశనం చేసినట్లు పేర్కొంది.

హిజ్బుల్లా స్థావరాలు వున్నాయని అనుమానించిన చోటల్లా వరుసగా భూతల, వైమానిక దాడులకు దిగుతున్న ఇజ్రాయిల్ ఆర్మీ రాజధాని నట్టనడిబొడ్డున దాడి చేయడంతో లెబనాన్ ఆర్మీ తీవ్రంగా ప్రతిస్పందించింది. దక్షిణ లెబనాన్‌లో మిలటరీ పోస్ట్‌పై జరిగిన దాడిలో ఇద్దరు సైనికులు మరణించారని దాంతో మిగిలిన సైనికులు దీటుగా ఎదురు కాల్పులు జరిపారని తెలిపింది.

గత ఏడాది కాలంలో లెబనాన్ ఆర్మీ స్పందించడం ఇదే మొదటిసారి. మరోపక్క రాజధాని బీరుట్ కేంద్రంగా ఇజ్రాయిల్ దాడులు ఉధృతం చేయడంతో పాటూ విస్తరిస్తున్నందున ప్రజలను ప్రావిన్షియల్ రాజధాని నబటియె నుండి, లిటాని నదికి ఉత్తర ప్రాంతాల నుండి ఖాళీ చేయాలని హెచ్చరించింది. మరోవైపు తాజా పరిస్థితుల నేపథ్యంలో జపాన్, ఆస్ట్రేలియా, బ్రిటన్‌లు తమ పౌరులను లెబనాన్ నుండి తరలిస్తున్నాయి. దాదాపు 3వేల మంది రష్యన్, కామన్వెల్త్ దేశాల పౌరులు లెబనాన్‌ను వీడి వెళ్ళాలని భావిస్తున్నారు.

ఏకపక్ష సంయమనం ఇక ముగిసింది

తాము ప్రాంతీయ యుద్ధాన్ని కోరుకోవడం లేదని ఇరాన్, కతార్ ద్వారా అమెరికాకు తెలియచేసింది. అయితే ఏకపక్షంగా సంయమనం పాటించడమనేది దశ ఇక ముగిసిందని వ్యాఖ్యానించింది. ఇజ్రాయిల్ ఏ రకమైన దాడి జరిపినా తాము సాంప్రదాయేతర రీతిలో స్పందిస్తామని, ఇజ్రాయిల్ మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడంతో సహా ఏ చర్యలైనా వుండొచ్చునని స్పష్టం చేసింది. ఇరాన్ ఇటీవల జరిపిన దాడులకు ప్రతీకారం తీర్చుకునే హక్కు ఇజ్రాయిల్‌కు వుందని బుధవారం అమెరికా అధ్యక్షుడు బైడెన్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఇరాన్ స్పందన వెలువడింది.

గాజాలో దాడులు ఉధృతం

లెబనాన్‌తో పాటూ గాజాపై కూడా ఇజ్రాయిల్ దాడులను ఉధృతం చేసింది. గత 48గంటల్లో జరిగిన వేర్వేరు దాడుల్లో డజన్ల సంఖ్యలో పాలస్తీనియన్లు మరణించారు. కేవలం మరణాలే కాకుండా పెద్ద ఎత్తున తీవ్ర విధ్వంసాన్ని, నష్టాన్ని కలిగించాలన్నది కూడా ఇజ్రాయిల్ దాడుల లక్ష్యంగా వుంది. క్షేత్ర స్థాయిలో చోటు చేసుకున్న పరిస్థితులను చూస్తుంటే ఈ విషయం అర్థమవుతోంది. గురువారం తెల్లవారు జాము నుండి తూర్పు గాజాలో, నుస్రత్ శరణార్థ శిబిరం పశ్చిమ ప్రాంతాల్లో దాదాపు గంటకోసారి చొప్పున దాడులు చోటు చేసుకున్నాయి. భారీగా శతఘ్ని పేలుళ్ల వినిపిస్తూనే వున్నాయి.

పోలీసు స్టేషన్‌లోకి చొరబడి ఆయుధాల లూటీ

- మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాత్మక ఘటనలు

ఇంఫాల్ : మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు కొనసాగుతూనేవున్నాయి. రాజధాని ఇంఫాల్‌కు 79 కిలోమీటర్ల దూరంలో ఉక్రుల్ పట్టణంలో రెండు గ్రూపుల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలోనే ఒక గ్రూపునకు చెందిన అల్లరి మూక స్థానికంగా ఉండే పోలీసు స్టేషన్‌లోకి చొరబడి ఆయుధాలను లూటీ చేసిందని సంబంధిత అధికారులు గురువారం తెలిపారు. పట్టణంలోని వివాదాస్పద ప్రాంతాన్ని శుభ్రం చేయడంపై నాగా కమ్యూనిటీలోని రెండు గ్రూపుల మధ్య బుధవారం ఘర్షణ చెలరేగింది. దాంతో ఇరు గ్రూపుల మధ్య కాల్పులు కూడా చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు మరణించారు. మరో 20 మంది పైగా గాయపడ్డారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఆ ప్రాంతమంతటా అధికారులు నిషేధాజ్ఞలు విధించారు. మొబైల్ సేవలను నిలిపివేశారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి అదనపు బలగాలను మోహరింపజేశారు. గతేడాది కాలంగా అల్లర్లు, హింస చెలరేగుతున్నా.. నాగా మెజారిటీ గల ప్రాంతంలో ఇలా పోలీసు స్టేషన్‌పై దాడి చేయడం ఇదే తొలిసారి అని పోలీసులు తెలిపారు.

మళ్లీ నోరు జారిన కంగనా రనౌత్

- జాతిపిత అంటూ ఎవరూ లేరని గాంధీ జయంతి రోజే ట్వీట్



న్యూఢిల్లీ : వివాదస్పద బిజెపి ఎంపి, నటి కంగనా రనౌత్ మరోమారు నోరు జారారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా కొత్త వివాదాన్ని లేవదీశారు. లాల్ బహదూర్ శాస్త్రి 120వ జయంతి సందర్భంగా నివాళి అర్పిస్తూ, జాతిపితగా మహాత్ముని స్థాయిని కించపరిచేలా ఆమె పోస్టు పెట్టారు. "జాతిపిత అంటూ ఎవరూ లేరు, వున్నదల్లా పుత్రులే, వీరందరూ భరతమాత పుత్రులు' అని ఆమె సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దేశంలో పరిశుభ్రతపై మహాత్ముని వారసత్వాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ముందుకు తీసుకెళుతున్నారని ఆ తర్వాత మరో పోస్టులో పేర్కొన్నారు. కాగా, గాంధీపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలంటూ కంగనా పోస్టులపై కాంగ్రెస్ నేత సుప్రియా శ్రినెట్ తీవ్రంగా విమర్శించారు. 'గాడ్సే అభిమానులు బాపూ, శాస్త్రీజీల మధ్య తేడాల గురించి చెబుతున్నారు. ఈ కొత్త గాడ్సే భక్తురాలిని నరేంద్ర మోడీగా మనస్ఫూర్తిగా క్షమిస్తారా? జాతి పిత వున్నారు. పుత్రులు వున్నారు, అమరులు వున్నారు, ప్రతి ఒక్కరికీ గౌరవం దక్కాల్సిందే.' అని సుప్రియా శ్రినెట్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. పంజాబ్‌కి చెందిన మరో సీనియర్ బిజెపి నేత మనోరంజన్ కలియా కూడా రనౌత్ తాజా వ్యాఖ్యలను విమర్శించారు. వివాదాస్పద ప్రకటనలు చేయడం ఆమెకు అలవాటుగా మారిందన్నారు.

మారిషస్‌కు చాగోస్ దీవులను అప్పగించిన బ్రిటన్

లండన్ : చాగోస్ దీవుల సార్వభౌమాధికారాన్ని మారిషస్‌కు అప్పగిస్తున్నట్లు బ్రిటన్ ప్రకటించింది. దశాబ్దాల క్రితం నిర్వాసితులైన ప్రజలు తిరిగి వారి ఇళ్ళకు రావడాన్ని అనుమతించేందుకు కుదిరిన ఒప్పందం మేరకు ఈ ప్రకటన వెలువడింది. అయితే డిగో గార్షియాలో బ్రిటీష్-యుఎస్ మిలటరీ స్థావరాన్ని వినియోగించుకునే హక్కును బ్రిటన్ తన వద్దే అట్టిపెట్టుకుంది. అమెరికాతో కలిసి సంయుక్తంగా నిర్వహించే ఈ వ్యూహాత్మకమైన సైనిక స్థావరం డిగో గార్షియాను ఈ ఒప్పందం పరిరక్షిస్తోందని బ్రిటన్ గురువారం తెలిపింది. డిగో గార్షియా మిలటరీ బేస్ దీర్ఘకాలిక కార్యకలాపాలు ముప్పును ఎదుర్కొనే పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో నేడు కుదుర్చుకున్న ఒప్పందం, కీలకమైన సైనిక స్థావరం భవితవ్యానికి హామీ కల్పించిందని బ్రిటన్ విదేశాంగ మంత్రి డేవిడ్ లామీ ఒక ప్రకటనలో తెలిపారు.

హమాస్ కీలక నేత రావీ ముష్తాహాను చంపేశాం

- ఇజ్రాయిల్ బలగాల వెల్లడి



గాజా : హమాస్ కీలక నేత, గాజా ప్రధానిగా వ్యవహరిస్తున్న రావీ ముష్తాహాను ఇజ్రాయిల్ బలగాలు హత్య చేశాయి. ఈ విషయాన్ని ఇజ్రాయిల్ భద్రతా దళం (ఐడిఎఫ్) గురువారం ప్రకటించింది. కొన్ని నెలల క్రితమే తాము జరిపిన దాడుల్లో ఆయన చనిపోయినట్లు పేర్కొంది. ముష్తాహాను లక్ష్యంగా చేసుకుని ఐడిఎఫ్ దళాలు మూడు నెలల క్రితం గాజాలో భీకర దాడులు సాగించాయి. ఆ దాడుల్లో ఆయనతో పాటు హమాస్ పొలిటికల్ బ్యూరో సీనియర్ నేత సమీ అల్ సిరాజ్, జనరల్ సెక్యూరిటీ చీఫ్ సమి ఒదేహ్ చనిపోయినట్లు ఐడిఎఫ్ తెలిపింది. అయితే వీరి మరణాలను హమాస్ ఇప్పటి వరకు ధ్రువీకరించలేదు.

తండ్రి ఉద్యోగ విరమణ దస్త్రంపై తనయుడి సంతకం

జైపూర్ : రాజస్థాన్‌లో అరుదైన ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. ఒక తండ్రి ఉద్యోగ విమరణ ఉత్తర్వులకు సంబంధించిన దస్త్రంపై ఆయన తనయుడే ఉన్నతాధికారిగా సంతకం చేశారు. భరత్‌పూర్ డివిజనల్ కమిషనర్‌గా ఉన్న సీనియర్ ఐఎఎస్ సంవర్మాల్ వర్మ ఉద్యోగ విరమణ చేయగా..అందుకు సంబంధించిన ఉత్తర్వులపై ఆయన తనయుడు కార్మిక విభాగం సంయుక్త కార్యదర్శి హోదాలో కనిష్క కటారియా సంతకం చేశారు. ఈ విషయాన్ని కనిష్క సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. 2010లో జెఇఇలో 44వ ర్యాంకు సాధించిన కనిష్క ఐఐటి బాంబేలో బిటెక్ చేశారు. 2016లో దక్షిణ కొరియాలో శ్యామ్‌సంగ్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశారు. అయితే తండ్రి కోరిక మేరకు రూ.లక్షల వేతనం వదులుకుని 2018లో యుపిఎస్‌సి పరీక్ష రాశారు. తొలి ప్రయత్నంలో మొదటి ర్యాంక్ సాధించి ప్రశంసలు పొందారు. 2019 బ్యాచ్ ఐఎఎస్‌గా బికనీర్‌లో అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేశారు. తర్వాత కోటాలోని రాంగంజ్ మండిలో ఎస్‌డిఎంగా పనిచేశారు. తదనంతరం కార్మిక విభాగం జాయింట్ సెక్రటరీగా ఉద్యోగోన్నతి పొందారు.

కశ్మీర్‌లో 63.45 శాతం పోలింగ్

శ్రీనగర్ : మూడు దశల్లో కలిపి జమ్మూకశ్మీర్ శాసనసభ ఎన్నికల్లో 63.45 శాతం ఓట్లు పోలయ్యాయని, ఇది ఇటీవల లోక్‌సభ ఎన్నికల కంటే ఎక్కువని కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) వెల్లడించింది. మంగళవారం నాటి తుది దశ పోలింగ్‌లో సుమారు 69.65 శాతం మంది ఓటర్లు తమ హక్కును వినియోగించుకున్నారని, వీరిలో గత 75 ఏళ్లుగా ఓటు హక్కులేనివారు కూడా ఉన్నారని ఇసి ఒక ప్రకటనలో పేర్కొంది.

రక్త పరీక్షల పేరుతో దోపిడీ!

- ఒక్కో టెస్టుకు రూ.500 నుంచి రెండు వేలు
- నామమాత్రంగా అధికారుల తనిఖీలు
- ప్రజల జేబుకు చిల్లు

ప్రజాశక్తి - హిందూపురం

వైద్యాన్ని వ్యాపారంగా మార్చేసిన ప్రయివేటు ఆసుపత్రులు కనీసం రోగుల నాడి అయినా పట్టకుండా ఎడాపెడా దోచేస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 250కు పైగా ప్రయివేటు ఆసుపత్రులు ఉండగా అందులో వందకు పైచిలుకు ఆసుపత్రులు అనంతపురం జిల్లా కేంద్రంలోనే ఉన్నాయి. ఇక హిందూపురంలో దాదాపు 40 దాకా ఉన్నాయి. వీటిలో అధికశాతం ఆసుపత్రులకు చిన్నపాటి సమస్యతో వెళ్లినా స్కానింగ్‌లు, రక్త పరీక్షలు అంటూ హడావుడి చేసి స్కానింగ్ సెంటర్ల పర్సంటేజీలకు కక్కుర్తి పడుతున్నాయి. కొందరు వైద్యులు కనీసం రోగి నాడి కూడా పట్టి చూడకుండా రిపోర్టుల ఆధారంగానే కుప్పలు తెప్పలుగా మందులు రాసేస్తున్నారు. ఏ అసుపత్రికి అనుమతులు ఉన్నాయో...ఏ అసుపత్రికి అనుమతులేవో ఎవరికి అర్థం కావడం లేదు. వైద్యులు చెప్పిందే వేదం. ఆస్పత్రికి వెళ్లిన రోగిని వివిధ రకాల రక్తపరీక్షలు చేయించుకురావాలంటూ సూచిస్తారు. ల్యాబొరేటరికి వెళ్తే వారు నిలువునా దోచుకుంటున్నారు. జిల్లాలో చాలా చోట్ల అనధికారిక రక్త పరీక్షా కేంద్రాలు నడుస్తున్నాయి. అనుమతులు లేక పోయినా అధికారుల సహకారంతో ఆయా కేంద్రాలు సాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కేవలం నిర్వాహకులు ఆయా ల్యాబ్‌లలో ఆరు నెలలు మాత్రమే పని చేసి ఇతర ప్రాంతాల్లో ల్యాబొరేటరీలు ఏర్పాటు చేసుకుంటారు. వీరికి ఏ అర్హత ఉండదు. చాలా చోట్ల సహాయకులుగా చేరేవారే రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. ఇక ప్రయివేటు ఆస్పత్రులకు అనుబంధంగా ఉన్న ల్యాబ్‌లలో టెక్నీషియన్లకు సరైన అర్హత లేకపోయినా వైద్యులు వారి వద్దనే రక్తపరీక్షలు చేయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సాధారణ రక్త పరీక్షలు చేయాలంటే డిఎంఎల్‌టి, డిఎస్‌బిఎంఎల్‌టి, ఎంఎస్‌డిఎల్‌టి పూర్తి చేయాలి. చాలా మందికి అర్హత లేకపోయినా ప్రయివేటు కేంద్రాల్లో పని చేస్తున్నారు. ప్రతి కేంద్రంలో ఆయా పరీక్షలకు సంబంధించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ఇలాంటి సూచిక బోర్డులు ఎక్కడా కనిపించవు. అలాంటి ల్యాబ్‌లలో రక్తపరీక్షలు చేయించుకుని తప్పుడు ఫలితాలు రావడం వల్ల తమకేదో రోగం ఉందని కొందరు కుంగిపోతున్నారు. అదే మరో కేంద్రంలో పరీక్ష చేయించుకుంటే ఎలాంటి అనారోగ్యం లేదని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్న సంఘటనలు కోకొల్లలు. కొన్ని ప్రయివేటు ఆసుపత్రులు వాటికి అనుబంధంగా ఉన్న ల్యాబొరేటరీల్లోనే పరీక్షలు చేయించుకోవాలని సూచిస్తారు.

ఆర్థికంగా పీల్చి పిప్పి చేస్తున్న ల్యాబ్ నిర్వాహకులు

చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా ప్రయివేటు ఆరోగ్య కేంద్రానికి వెళ్తే రోగుల బలహీనతను సొమ్ము చేసుకుంటారు. ధనార్జనే ధ్యేయంగా ఆరోగ్య సమస్య లేకపోయినా లేని పోని అపోహలు తలెత్తెలా అన్ని రకాల రక్తపరీక్షలు చేయించి రోగుల జేబులు ఖాళీ చేయిస్తున్నారు. అందులో వైద్యులకు భారీగా పర్సంటేజీలు ఇస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఒక్కో రక్త పరీక్షకు రూ.500 నుంచి 2వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. ఒక వైద్యుడి వద్ద చేయించిన రక్త పరీక్షలను మరో డాక్టరు తిరస్కరిస్తారు. మళ్లీ చేయించుకోవాలని సూచిస్తారు. దీంతో రోగి ఆర్థికంగా చితికి పోతున్నాడు. జిల్లాలో ఈ ప్రయివేటు ల్యాబొరేటరీలను అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో సుమారు 6వందలకు పైగా ఈ రక్త పరీక్షా కేంద్రాలున్నాయి. ఎటువంటి అనుమతి లేని పలు రక్తపరీక్షా కేంద్రాలను తనిఖీలు చేయకపోవడంతో వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

సిండికేట్‌గా ఏర్పడిన నిర్వాహకులు

వ్యాధి నిర్ధారణ కోసం వెళ్తే గతంలో ఒక్కో డయాగ్నోస్టిక్ కేంద్రంలో అక్కడ ఉన్న వైద్య పరికరాల నైపుణ్యతను బట్టి ఈ ధరలు ఉండేవి. ఈ నేపథ్యంలో తక్కువ ఫీజులు తీసుకునే డయాగ్నోస్టిక్ కేంద్రాలకు రోగులు ఎక్కువగా వెళ్లేవారు. గత మూడు నెలలుగా ఇప్పుడు ఎక్కడ చూసినా ఒకే రకమైన ఫీజులు తీసుకుంటున్నారు. ఫీజుల వసూలుకు ఒక నిబద్ధత, నియంత్రణ అనేది లేకుండా పోయింది. ఈ విషయంలో జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందుతున్నా ఈ సెంటర్లను నియంత్రించే అధికారం తమకు లేదని వారు చేతులెత్తేసే పరిస్థితి కనిపిస్తోంది. చట్టంలో లొసుగులను ఆసరా చేసుకుని అడ్డగోలుగా దోస్తున్నారని, నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రోగులతో వైద్యుల చెలగాటం...?

ప్రయివేటు డయాగ్నోస్టిక్ సెంటర్ల దోపిడీకి తోడు వైద్యులు రోగులతో చెలగాటమాడుతున్నారు. తక్కువ ధర ఉన్న సెంటర్లకు వెళ్లి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుంటే ఆ ఫలితాలను రెఫర్ చేసిన వైద్యులు అంగీకరించడం లేదు. రక్త, మూత్ర పరీక్షలు సదరు ప్రయవేటు అసుపత్రికి అనుబంధంగానే ఎక్కువగా నిర్వహిస్తుంటారు. అంతే కాకుండా డాక్టర్లకు డయాగ్నోస్టిక్ సెంటర్లకు విడదీయరాని కమీషన్ల బంధం ఉందనేది జగమెరిగిన సత్యం. ఫలానా డయాగ్నోస్టిక్ సెంటర్‌కే వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని కొందరు వైద్యులు రోగులకు ఆర్డర్లు వేస్తుంటారు. వారు చెప్పినట్లు వినక ఇతర సెంటర్లకు వెళ్తే వ్యాధి నిర్ధారణ సరిగా లేదని వంకలు పెట్టడం పరిపాటిగా మారింది. వ్యాధి నిర్ధారణ ఎలా ఉన్నా ఫరావా లేదు.. తమకు కమీషన్లు వస్తే చాలనుకునే వైద్యులు కోకొల్లలు ఉన్నారు.

బెంగళూరు మార్కెట్లోకి పౌలోమి ఎస్టేట్స్

- రూ.800 కోట్లతో హైరైజ్ నివాస ప్రాజెక్టు
- డైరెక్టర్ ప్రశాంత్ రావు వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రీమియం రియాల్టీ కంపెనీ పౌలోమి ఎస్టేట్స్ బెంగళూరు మార్కెట్లోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. అక్కడ రూ.800 కోట్లతో 35 అంతస్తుల్లో 850 నివాసాలను అందుబాటులోకి తేనున్నామని పౌలోమి ఎస్టేట్స్ డైరెక్టర్ ప్రశాంత్ రావు వెల్లడించారు. గురువారం హైదరాబాద్‌లో ఆ సంస్థ స్ట్రాటజీ వైస్ ప్రెసిడెంట్ ఎం మారుతి రావుతో కలిసి ప్రశాంత్ రావు మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లో తాము ఎనిమిది ప్రాజెక్టులను చేపట్టామని.. ప్రస్తుతం కోకాపేటలో రెండింటి నిర్మాణం కొనసాగుతుందన్నారు. తాజాగా ఉత్తర బెంగళూరులోని తనిసంద్రలో 18 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన ప్రాజెక్టును చేపడుతున్నామని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో రెండు దశల్లో దీన్ని పూర్తి చేయనున్నామన్నారు. ఫ్లాట్ కనీస ధరను రూ.1.4 కోట్లుగా ఉండొచ్చన్నారు. 1450-2550 చదరపు అడుగుల విస్తీర్ణంలో నివాసాలు ఉంటాయన్నారు.

హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌కు డోకా లేదన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడు సాధారణంగానే రియాల్టీ కొనుగోళ్ల పట్ల వినియోగదారులు వేచి చూసే ధోరణితో వ్యవహరిస్తారన్నారు. దీంతో గడిచిన ఆరు నెలలుగా కొంత తగ్గినట్లుగా కనిపిస్తున్నప్పటికీ.. మళ్లీ పుంజుకోనుందన్నారు. మౌలిక వసతుల కల్పన పెంచడం ద్వారా కాలక్రమేణ రియాల్టీకి మరింత డిమాండ్ పెంచొచ్చన్నారు. గత నాలుగైదు ఏళ్లుగా నిర్మాణ వ్యయం 35 శాతం మేర పెరిగిందన్నారు. ఇప్పటికే భారీగా పెరిగిన భూముల ధరల వల్ల నివాసాల ధరలు పెరిగాయన్నారు. హైదరాబాద్‌లో తమ సంస్థ 22.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆరు నివాస ప్రాజెక్టులు, 10 లక్షల చదరపు అడుగుల్లో రెండు వాణిజ్య ప్రాజెక్టులను చేపట్టామన్నారు. కోకాపేటలో చేపడుతున్న ఇన్ఫినిట్ ప్రాజెక్టు వచ్చే ఏడాది జులై కల్లా పూర్తి కానుందన్నారు. ఇందులో ఇప్పటికే 75 శాతం విక్రయాలు పూర్తి అయ్యాయని తెలిపారు. హైదరాబాద్‌లోని విజయాలను బెంగళూరులో పునరావృతం చేయగలమని ప్రశాంత్ రావు విశ్వాసం వ్యక్తం చేశారు.

స్కిల్ డెవలప్‌మెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా 'అంబికా'

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

కేంద్ర లేబర్, టెక్స్‌టైల్స్, స్కిల్ డెవలప్‌మెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. అనంతపురం పార్లమెంట్ సభ్యులుగా తొలిసారి ఎన్నికైన అంబికా లక్ష్మీనారాయణ ఇప్పటికే కేంద్ర ఒబిసి, సిల్క్ బోర్డు సంక్షేమ సభ్యులుగా ఉండగా, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన లేబర్, టెక్స్‌టైల్స్, స్కిల్ డెవలప్‌మెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా నియమించింది. దీంతో ఎంపీకున్న బాధ్యతలు మరింత పెరిగాయి. లేబర్, టెక్స్‌టైల్స్, స్కిల్ డెవలప్‌మెంట్ స్టాండింగ్ కమిటీకి బసవరాజ్ బొమ్మాయి చైర్మన్‌గా నియామకం కాగా, కమిటీ సభ్యులుగా లోక్‌సభకు చెందిన 21 మంది ఎంపీలు, రాజ్యసభకు చెందిన 10 మంది ఎంపీలు ఉంటారు. వీరిలో ఒకరిగా అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను నియమించారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా మాట్లాడుతూ.. కేంద్ర లేబర్, టెక్స్‌టైల్స్, స్కిల్ డెవలప్‌మెంట్ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా అవకాశం కల్పించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు.

సౌదీ జైల్లో రామన్నపాలెం యువకుడు

- విడిపించాలని కేంద్ర మంత్రికి మాజీ ఎమ్మెల్యే వినతి

ప్రజాశక్తి - మొగల్తూరు (పశ్చిమగోదావరి జిల్లా)

ఉపాధి నిమిత్తం సౌదీ అరేబియా వెళ్లి జైలు పాలైన పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు మండలం రామన్నపాలెంకి చెందిన యాతం జీవాను స్వదేశానికి తీసుకురావాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. గురువారం భీమవరంలో సహాయ మంత్రి కార్యాలయంలో మాధవ నాయుడును శ్రీనివాస్ వర్మ కలిశారు. ఈ సందర్భంగా దీనికి సంబంధించిన విషయాలను ఆయనకు తెలిపారు. మొగల్తూరు మండలం, రామన్నపాలెంకు చెందిన యాతం నాగేశ్వరరావు కుమారుడు జీవా అయిదేళ్ల క్రితం బతుకుతెరువు కోసం సౌదీ అరేబియా వెళ్లి డ్రైవర్‌గా పనిచేశాడు. నాలుగేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదం కారణంగా అక్కడి ప్రభుత్వం భారతదేశ కరెన్సీలో సుమారు రూ.50 లక్షలు జరిమానా విధించడం జరిగిందన్నారు. అతని ఆర్థిక పరిస్థితి దృష్ట్యా జరిమానా కట్టలేనందున జీవా సౌదీ ప్రభుత్వం జైల్లో ఉన్నాడు. ఇటీవల నరసాపురం మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడుని బాధితుని తండ్రి నాగేశ్వరరావు తన సమస్యను వివరించాడని తెలిపారు. ఈ సమస్యపై స్పందించిన కేంద్ర మంత్రి విదేశీ వ్యవహారాల శాఖకు ఈ సమస్యను తెలిపి సౌదీలో మన ఎంబిసిని సంప్రదించి యాతం జీవా విడుదల అయ్యేలా చర్యలు తీసుకుంటానని శ్రీనివాస్ వర్మ భరోసా ఇచ్చారని మాధవ నాయుడు తెలిపారు.

నేటి నుంచి విశాఖలో 'ఐబిడి' సదస్సు

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్

బ్రిక్స్ ఐబిడి 'ఇన్ఫ్లమేటరీ బౌల్ డిసీజ్ (ఐబిడి) సదస్సును విశాఖ నొవాటెల్ హోటల్‌లో శుక్ర, శని, ఆదివారాల్లో మూడు రోజులపాటు నిర్వహించనున్నట్టు ఆంధ్రా మెడికల్ కళాశాల గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాధిపతి, సదస్సు ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ ఎల్ఆర్ఎస్ గిరినాథ్ తెలిపారు. గురువారం కెజిహెచ్ అంకానా హాల్‌లో కిమ్స్ వైద్యులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎఎస్ చలపతిరావుతో కలిసి మీడియా సమావేశంలో సదస్సు వివరాలు వెల్లడించారు. సిసిఎఫ్ ఇండియా సహకారంతో బ్రిక్స్ దేశాల ఐబిడి కన్సార్టియంను 8వ జాతీయ సదస్సుగా నిర్వహించనున్నామన్నారు. అత్యంత విషమమైన ఇన్ఫ్లమేటరీ బౌల్ డిసీజ్ (పేగు పోత జబ్బు)పై సదస్సులో పాల్గొనే నిపుణులు విపులంగా చర్చించడంతోపాటు, తమ పరిశోధనల్ని వివరిస్తారన్నారు. పేగు పోత వ్యాధిపై పరిశోధన పురోగతి, ఈ వ్యాధి తీవ్రత అంశాలపై లోతైన అవగాహనకు సదస్సులో నిష్ణాతులైన వైద్యులు పలుసూచనలు చేస్తారన్నారు. ఐబిడి రంగంలో ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ నిపుణులు యుఎస్ఎ, యూకే, బ్రెజిల్, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా, నేపాల్, జింబాబ్వే వంటి దేశాల ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్టులు హాజరుకానున్నారని తెలిపారు. పెద్ద ప్రేగులో సోకే ఈ వ్యాధి తీవ్రమైనదని, మధుమేహ వ్యాధి వలే రోగి జీవితాంతం మందులు వాడాల్సి ఉంటుందన్నారు. దేశంలో ఈ వ్యాధిని ప్రారంభంలో గుర్తించలేదని, క్షయవ్యాధిగా భావించి వైద్యం అందించే వారిన్నార. దేశంలో ఒకప్పుడు పేగు పోత జబ్బు అంతగా ఉండేది కాదని, అయితే మారుతున్న ఆహార అలవాట్లు వల్ల ఇది దేశంలో ప్రవేశించి,ఇప్పుడిప్పుడే తీవ్రస్థాయికి చేరుకుంటోందన్నారు. నీళ్ల విరోచనాలు, రక్తం రావడం, బరువు తగ్గడం ఈ వ్యాధి లక్షణాలన్నారు. కిమ్స్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, సదస్సు నిర్వహణ ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ ఆచంట చలపతిరావు మాట్లాడుతూ, ఐబిడి అనేది ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మంది జీర్ణాశయాంతర పరిస్థితిని ప్రభావితం చేస్తుందన్నారు.

భారతదేశంలో పెరుగుతున్న కేసులు, రోగుల ఫలితాలను మెరుగుపరచడానికి, మెరుగైన నిర్వహణ కోసం, కొత్త రోగ నిర్ధారణ, చికిత్సా వ్యూహాలను ఈ సదస్సులో లోతుగా చర్చిస్తారన్నారు. ఈ వ్యాధిని సమర్థవంతంగా నిర్వహించడానికి అవసరమైన వినూత్న చికిత్సలు, రోగి కేంద్రీకృత సంరక్షణ, మల్టీ డిసిప్లినరీ విధానాలను సదస్సు అన్వేషిస్తుందన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి సుమారు 600 మంది ప్రతినిధులు, ఆంధ్ర మెడికల్ కళాశాల పీజీ విద్యార్థులు 100 మంది హాజరవుతారన్నారు. ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ అధినేత డాక్టర్ డి. నాగేశ్వరరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తారన్నారు.

బూసి వెంకటస్వామికి కలామ్ జాతీయ ప్రతిభా పురస్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు విభాగ ఆచార్యులు డాక్టర్ బూసి వెంకటస్వామిని 2024 సంవత్సరానికిగాను డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్ జాతీయ ప్రతిభా పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఎస్‌పిఎల్‌టిఒ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కెఎస్.లక్ష్మణరావు, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ నాగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలలో అత్యంత ప్రతిభావంతులైన, వివిధ రంగాలలో నిష్ణాతులైన వారిలో తనను ఎంపిక చేయటం ఆనందంగా ఉందని, తెలుగు భాష, సాహిత్యాలలో కృషి చేస్తున్నందుకుగాను ఈ సత్కారం అందుకోన్నానని వెంకటస్వామి మీడియాకు తెలియజేశారు. ఈ నెల 5వ తేదీన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం, 15వ తేదీన భారత మాజీ రాష్ట్రపతి, మిసైల్ కింగ్ డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్‌ల జయంతులను పురస్కరించుకుని 20వ తేదీన గుంటూరులో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డు అందుకోనున్నట్లు తెలిపారు. డాక్టర్ బూసి వెంకటస్వామి ఇప్పటికే దాశరథి స్మారక పురస్కారం, గుర్రం జాషువా స్మారక పురస్కారం, గురజాడ స్మారక పురస్కారం పొంది ఉన్నారు.

455 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- పెదబయలు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

పెద్దబయలు మండలంలోని సీతగుంట పంచాయతి రోగుల పేట జంక్షన్ వద్ద బుధవారం సాయంత్రం 455 కేజీల గంజాయిని ముందస్తు సమాచారం మేరకు మాటువేసి పట్టుకున్నట్లు జి మాడుగుల. సర్కిల్ ఇన్స్పెక్టర్ శిహెచ్ వెంకటరావు గురువారం విలేకరులకు తెలిపారు. గంజాయి తరలిస్తుండగా అనుమానంతో సిబ్బంది బైక్‌లను ఆపి గంజాయిని పట్టుకున్నామన్నారు. ఏడుగురిలో నలుగురు తప్పించుకొని పరరయ్యారన్నారు. మొబైల్ ఫోన్లు, నగదు స్వాధీన పరచుకొని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. గంజాయి విక్రయం, రవాణా చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమణ పాల్గొన్నారు.

'మండలి'కి సమాయత్తం

- ఓటర్ల నమోదులో యంత్రాంగం
- 15 వరకూ కొత్త ఓటు నమోదుకు అవకాశం
- నవంబర్ 6న తుది ఓటర్ల జాబితా

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నికకు రంగం సిద్ధమైంది. ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఖాళీ ఏర్పడింది. ఈ స్థానానికి మళ్లీ ఎన్నికలు నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఓటర్ల నమోదు ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. కాకినాడ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాలతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 116 మండలాల పరిధిలో అర్హులైన ఉపాధ్యాయుల ఓటు నమోదుకు జూలై 29 నుంచి ఫారం-19 ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. గత నెల 3తో దరఖాస్తుల గడువు ముగిసినట్లు అధికారులు తెలిపారు. వచ్చిన దరఖాస్తుల జాబితాలను గత నెల 24న పోలింగ్ కేంద్రాలైన తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల్లో ప్రదర్శించారు. గత నెలలో గడువు ముగిసేటప్పటికి నియోజకవర్గ పరిధిలో ఉపాధ్యాయుల నుంచి 14,388 దరఖాస్తులు రాగా అందులో 13,677 దరఖాస్తులను అంగీకరించగా 79 దరఖాస్తులను తిరస్కరించారు.

15 వరకూ కొత్తగా ఓట్ల నమోదు

గడువులోగా దరఖాస్తు చేసినా పేరు లేకపోతే మళ్లీ దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చారు. ఈనెల 15 వరకూ మరోసారి అవకాశం ఉంది. క్లెయిమ్‌లు, అభ్యంతరాలను గతనెల 24 నుంచి మొదలైంది. ఈనెల 30 వరకూ పరిష్కరిస్తారు. అలాగే సప్లిమెంట్‌లను తయారు చేసి ముద్రిస్తారు. నవంబర్ 6న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. అనంతరం ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయనుంది. ఉపాధ్యాయుడిగా మూడేళ్లపాటు సేవలందించిన వారికే ఓటరుగా అర్హత ఉంటుంది. జిల్లా బయటి నుంచి వచ్చి ఉద్యోగం చేసే వారికి ఓటు పొందే అవకాశం లేదు. జిల్లాలో నివాసం ఉండే ఉపాధ్యాయులకే ఓటు వేసే ఛాన్స్ ఉంటుందని ఎన్నికల సంఘం నిబంధనలు రూపొందించింది.

ఆసక్తిగా మారిన ఉప ఎన్నిక

ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఉప ఎన్నిక అశక్తిగా మారనుంది. ఎక్కువమంది టీచర్లు ఓటర్లుగా నమోదు చేసుకోవడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. ఈసారి కూడా పోటీ ఎలా ఉంటుందోనన్న చర్చ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో జోరుగా సాగుతోంది. ఇప్పటికే 4 దఫాలు ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలు జరిగాయి. 2007 నుంచి 2009 వరకూ శేషారెడ్డి, రెండవసారి 2010 నుంచి 2015 వరకూ చైతన్యరాజు మూడవసారి రాము సూర్యారావు, నాలుగోసారి 2021 మార్చి 17న జరిగిన ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సిగా షేక్ సాబ్జీ విజయం సాధించారు. ఆయన 2023 డిసెంబర్ 15న రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ నియోజకవర్గంలో మొత్తం 17,467 మంది ఓటర్లు ఉండగా,16,054 ఓట్లు పోలవ్వగా 11 మంది స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ పడ్డారు. షేక్ సాబ్జీకి 7,987 ఓట్లు రాగా, వైసిపితో పాటు పిఆర్‌టియు, ఇతర ఉపాధ్యాయ సంఘాల మద్దతుతో బరిలోకి దిగిన సమీప ప్రత్యర్థి గంధం నారాయణరావుకు 6,453 ఓట్లు పోలయ్యాయి. దీనితో షేక్ సాబ్జీ 1,534 ఓట్ల మెజారిటీతో మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే విజయం సాధించారు. ఈ ఎన్నికల్లో టిడిపి మద్దతు తెలిపిన చెరుకూరి సుభాష్ చంద్రబోసు 106 ఓట్లు, బిజెపి మద్దతుతో పోటీ చేసిన ఇళ్ల సత్యనారాయణకు 300 ఓట్లు పడ్డాయి. పిడిఎఫ్ తరుపున ఎంఎల్‌సిలుగా పని చేసిన రాము సూర్యారావు, సాబ్జీ పనితీరుపై ఉపాధ్యాయ వర్గాల్లో పూర్తి సంతృప్తి వ్యక్తమవుతోంది. దీంతో మరోసారి పిడిఎఫ్, యుటిఎఫ్ కలిసి తమ అభ్యర్థిని రంగంలోకి దింపే అవకాశం ఉంది. అతి త్వరలోనే అభ్యర్థిని ప్రకటించనున్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా పిడిఎఫ్ విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని పలువురు భావిస్తున్నారు.

పాఠశాల స్థాయిలోనే పర్యావరణ విద్యను బోధించాలి : రిజిస్ట్రార్ ధనుంజయరావు

ప్రజాశక్తి-విశాఖపట్నం

పాఠశాల స్థాయిలోనే పర్యావరణ విద్యను బోధించాలని, తద్వారా యువతలో పర్యావరణ స్పృహ పెరుగుతుందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్.ధనుంజయరావు అన్నారు. గురువారం వరల్డ్ నేచర్ డేను పురస్కరించుకుని ఏయూ విద్య విభాగం ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బిఇడి, ఎంఇడి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, భవిష్యత్ ఉపాధ్యాయులగా నిలిచే మీరంతా పాఠశాలల్లో విద్యార్థులకు మొక్కల ఆవశ్యకత, పర్యావరణం ప్రాధాన్యత తెలియజేయాలన్నారు. మొక్కలు నాటి, పెంచే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. వృక్షాలతోనే మానవ మనుగడ ముడిపడి ఉందనే వాస్తవాన్ని వారికి వివరించాలన్నారు. వివిధ వేడుకల్లో మొక్కలనే బహూకరించే సంప్రదాయాన్ని అవలంభించాలని సూచించారు. విద్య విభాగాధిపతి ఆచార్య టి.షారోన్ రాజు మాట్లాడుతూ పర్యావరణాన్ని సంరక్షిస్తూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ రాము, డాక్టర్ ప్రవీణ, డాక్టర్ మూర్తి, డాక్టర్ వినీల కుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.

5న మురళీ మోహన్‌కు అక్కినేని స్మారక పురస్కారం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ)

అక్కినేని శత జయంతోత్సవాల ముగింపు సందర్భంగా ఈ నెల 5వ తేదీన ప్రముఖ సినీ నటుడు, మాజీ ఎంపీ ఎం.మురళీ మోహన్‌కు డాక్టర్ అక్కినేని స్మారక పురస్కారం ప్రదానం చేయనున్నట్టు హైదరాబాద్‌కు చెందిన కిన్నెర ఆర్ట్ థియేటర్స్ కన్వీనర్ కె.రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.

ఈ మేరకు గురువారం ఉదయం ఎంవిపి.కాలనీలోని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు తన క్యాంపు కార్యాలయంలో పురస్కార వేడుక పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో న్యూ రోషన్ లాల్ ఆర్కెస్ట్రా అధినేత, ప్రోగ్రాం కన్వీనర్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 5న సాయంత్రం 6 గంటలకు మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో అక్కినేని నటించిన చిత్ర గీతాలతో సినీ సంగీత విభావరి జరుగుతుందన్నారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ముఖ్య అతిథిగానూ, మాజీ రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు, మాజీ మంత్రి దాడి వీర భద్రరావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు గౌరవ అతిథులుగానూ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి చెన్నా తిరుమలరావు, మెలోడీ క్రియేటర్స్ అధ్యక్షులు సత్యనారాయణ, కళాంజలి సభ్యులు కెఎస్.ప్రకాశరావు పాల్గొన్నారు.

వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించలేం

- సుప్రీంకోర్టులో కేంద్రం అఫిడవిట్

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం తన మనువాద పురుషాధిపత్య ధోరణిని మరోమారు చాటుకుంది. వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించాల్సిన అవసరం ఉందని సర్వత్రా డిమాండ్ వ్యక్తమవుతుంటే.. మోడీ సర్కార్ మాత్రం అబ్బే ఆ అవసరం లేదని, ఇందుకు సంబంధించి ఇప్పటికే అనేక చట్టాలున్నాయని సుప్రీంకోర్టుకు తెలిపింది. ఇది చట్టబద్ధమైన అంశానికి మించిన సామాజిక సమస్య అని.. సమాజంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని తెలిపింది. అందుకే దీనిపై ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు భాగస్వామ్యపక్షాలతో విస్తృత సంప్రదింపులు జరపాల్సిన అవసరముందని పేర్కొంది. ఈ మేరకు సుప్రీంకోర్టులో గురువారం నాడు కేంద్రం అఫిడవిట్ దాఖలు చేసింది. వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించాలంటూ సర్వోన్నత న్యాయస్థానంలో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిని వ్యతిరేకించిన కేంద్ర ప్రభుత్వం, మైనర్ కాని భార్యను లైంగికంగా బలవంతం చేస్తే అత్యాచారంగా పరిగణించలేమని పేర్కొంది. ఒకవేళ అలా చేస్తే దాంపత్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, వివాహ వ్యవస్థలోనూ తీవ్ర అవాంతరాలకు దారితీస్తుందని తెలిపింది. వైవాహిక అత్యాచారాన్ని నేరంగా పరిగణించే అంశం సుప్రీం కోర్టు పరిధిలోకి రాదని అన్ని రాష్ట్రాలు, భాగస్వామ్య పక్షాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా దీనిపై ఓ నిర్ణయం తీసుకోలేమని వెల్లడించింది. వివాహం చేసుకోవడం వల్ల మహిళ సమ్మతి తొలగిపోయినట్లు కాదని, దాన్ని ఉల్లంఘిస్తే తగువిధంగా శిక్షలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. వివాహిత సమ్మతిని రక్షించేందుకు చట్టపరమైన నిబంధనలు సహా ఇతర పరిష్కార మార్గాలను పార్లమెంట్ అందించిందని తెలిపింది.

విభిన్న రేడియోలతో గిన్నిస్‌లోకి...

- యూపీ వ్యక్తి ఘనత

లక్నో : ఉత్తర ప్రదేశ్‌లోని ఒక వ్యక్తి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ద్వారా గుర్తింపు పొందాలనే తన చిరకాల వాంఛను తీర్చుకున్నారు. అతిపెద్ద రేడియో సేకరణ ద్వారా ఆయన ఈ ఘనతను సాధించారు. 1,257 రకాల ప్రత్యేక రేడియోలను కలిగి ఉన్న రామ్ సింగ్ బౌద్ధ్ ఎట్టకేలకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో తన పేరును లిఖించుకున్నాడు. దాదాపు ఒక ఏడాది తర్వాత గిన్నిస్ రికార్డు కీపరుతీ విషయాన్ని ధ్రువీకరిచారు. అమ్రోహ జిల్లా గజ్రౌలాకు చెందిన రామ్‌సింగ్.. వాస్తవానికి 1400 రేడియోలను కలిగి ఉన్నాడు. గిన్నిస్ మార్గదర్శకాలు ప్రతి రేడియో ప్రత్యేకంగా ఉండాలని నిర్దేశించాయి. ఫలితంగా, 'డూప్లికేట్'లు మినహాయించబడ్డాయి. దీంతో ఆ సంఖ్య 1257కు పడిపోయినా.. రికార్డు మాత్రం రామ్ సింగ్‌కే సొంతమైంది. 2005 జులైలో 625 విభిన్న రేడియోల సేకరణను చేసిన ఎం.ప్రకాశ్ రికార్డులకెక్కారు. ఇప్పుడు ఆయన పేరును రామ్ సింగ్ చెరిపేశారు. రామ్ సింగ్.. వేర్ హౌజ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో సూపర్‌వైజర్‌గా పదవీ విరమణ చేశారు. ఇటీవలి విజయం.. తన స్వగ్రామంలో రేడియోలకు అంకితమైన మ్యూజియాన్ని స్థాపించాలనే ఆశను ఆయనలో రేకెత్తించింది. మ్యూజియం నిర్మించటానికి తన ప్రయత్నాలు భవిష్యత్ తరాలకు మన సమాజంపై రేడియో ప్రభావం గురించి తెలుసుకోవటానికి సహాయపడతాయని తాను ఆశిస్తున్నట్టు రామ్ సింగ్ చెప్పాడు. రామ్ సింగ్ కలెక్షన్లలో పురాతనమైనది 1920కి చెందిన రేడియో కావటం విశేషం.

సైక్లిస్టుల హక్కులపై కేంద్రానికి ఎన్‌హెచ్‌ఆర్‌సి నోటీసు

- నివేదిక సమర్పించటానికి ఆరు వారాల గడువు

న్యూఢిల్లీ : భారత్‌లో సైక్లిస్టుల హక్కులపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి) స్పందించింది. అధికార యంత్రాంగాల నిర్లక్ష్యం, నిష్క్రియాత్మకత కారణంగా పర్యావరణ అనుకూల ప్రయాణికులైన వారి హక్కులు, మరణాలు, వారికి అయ్యే గాయాల విషయంలో చర్య తీసుకోవాలని భారత రోడ్డు, రవాణ రహదారుల మంత్రిత్వశాఖ కార్యదర్శిని ఆదేశించింది. సుప్రీంకోర్టు న్యాయవాది, మానవ హక్కుల కార్యకర్త రాధాకాంత త్రిపాఠి దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందిస్తూ ఎన్‌హెచ్‌ఆర్‌సి ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఆరువారాల్లోగా నివేదికను అందించాలని ఆదేశించింది.

రోడ్డు ప్రమాదాల్లో దేశవ్యాప్తంగా 2022లో సగటున రోజుకు కనీసం పది మంది సైక్లిస్టులు చనిపోయారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సిఆర్‌బి) డేటా ప్రకారం.. దేశవ్యాప్తంగా 3,435 మంది సైక్లిస్టులు రోడ్డు ప్రమాదాల్లో మరణించగా, 6,426 మంది గాయపడ్డారని త్రిపాఠి తన పిటిషన్‌లో పేర్కొన్నారు. 2022లో ఉత్తర ప్రదేశ్‌లో రోడ్డు ప్రమాదంలో అత్యధిక సంఖ్యలో సైక్లిస్టులు మరణించారు. 2021లో బీహార్‌లో ఈ మరణాలు ఎక్కువగా ఉన్నాయి. సమగ్ర చట్టాలు లేని దేశాలలో భారత్ ఉన్నదని రహదారి భద్రతపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) వివరించింది. సైక్లిస్టుల విషయంలో రోడ్డు, రవాణ రహదారుల మంత్రిత్వశాఖ పటిష్టమైన చర్యలు తీసుకోవాలనీ, వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని సామాజిక కార్యకర్తలు సూచిస్తున్నారు. ఈ విషయంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సైతం చొరవ తీసుకోవాలని అంటున్నారు.

వాతావరణ మార్పుల ఎఫెక్ట్

- కఠిన విత్తనాల అభివృద్ధికి దారి తీస్తున్న పరిస్థితులు
- పరిశోధన సంస్థలు, శాస్త్రవేత్తలపై పెరుగుతున్న ఒత్తిడి

బెంగళూరు : భారత్‌లో అనూహ్యమైన వర్షాలు, పెరుగుతున్న వేడి వంటి వాతావరణ పరిస్థితులు భారత్‌లోని రైతన్నలకు కష్టాలను తెచ్చి పెడుతున్నాయి. అన్నదాతలు ఇప్పటికే పంట నష్టంతో తీవ్రంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అయితే, ఈ వాతావరణ పరిస్థితులు వ్యవసాయంలో కొన్ని మార్పులకూ కారణమవుతున్నాయి. అనూహ్య వాతావరణ మార్పులను తట్టుకునేలా కఠిన విత్తనాలను అభివృద్ధి చేయాల్సిన పరిస్థితులు దేశంలోని వ్యవసాయ శాస్త్రవేత్తలకు ఏర్పడుతున్నది. భారత్‌లోని వ్యవసాయ పరిశోధన సంస్థలు గత కొన్నేండ్లుగా ఈ మేరకు ప్రయోగాలను చేస్తున్నాయి.

భారత్ ప్రధానంగా గోధుమలు, బియ్యం ఉత్పత్తికి పేరుగాంచింది. ప్రపంచవ్యాప్తంగా ఈ రెండు పంటల విషయంలో భారత్ అతిపెద్ద ఉత్పత్తిదారుగా ఉన్నది. దీంతో భారత్‌లోని వ్యవసాయ శాస్త్రవేత్తలు గోధుమ, వరి పంటలపై దృష్టిని సారించారు. దిగుబడిని పెంచి, కరువును తట్టుకునే విత్తనాలను తయారు చేసే ప్రయత్నాలను పరిశోధనా సంస్థలు చేస్తున్నాయని కొందరు వ్యవసాయ నిపుణులు చెప్తున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఇలాంటి పరిశోధనలు చాలా అవసరమని సూచిస్తున్నారు.

ఈ ఏడాది ప్రారంభంలో విడుదలైన ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం.. గతేడాది 70 కోట్ల కంటే ఎక్కువ మంది ప్రజలు ఆకలితో ఉన్నారు. ప్రపంచ జనాభాలో మూడోవంతు మంది ఆరోగ్యకరమైన ఆహారాన్ని కొనుగోలు చేయలేకపోతున్నారు. ఆహారాన్ని విశ్వసనీయంగా ఉత్పత్తి చేయగల విత్తనాల ఆవశ్యకతను ఈ పరిస్థితులు కల్పించాయి. భారత్ మాత్రమే కాకుండా, యూఎస్ ప్రభుత్వ కార్యక్రమం, ప్రయివేటు నిధులతో కూడిన ప్రాజెక్టులతో సహా ఇతర కార్యక్రమాలు ఆఫ్రికా, మధ్య అమెరికా, ఇతర ఆసియా దేశాలలో వాతావరణ పరిస్థితులను తట్టుకునే పంటలను అభివృద్ధి చేయటంలో సహాయపడుతున్నాయి. వాతావరణ ప్రభావాలకు అత్యంత ముప్పును ఎదుర్కొనే దేశాలలో భారత్ ఒకటి. దీంతో, కొత్త విత్తనాలు ప్రజలకు, ఎగుమతికి తగినంత ఆహారాన్ని ఉత్పత్తి చేసేలా చూసుకోవటం అవసరమని వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. ఇలాంటి కఠిన విత్తనాలు భారత్‌లో ఐదెకరాల కంటే తక్కువ వ్యవసాయ భూమిని కలిగి ఉన్న దాదాపు 12 కోట్ల మంది రైతులకు ధైర్యాన్ని కలిగిస్తాయని అంటున్నారు.

పాకిస్తాన్ కెప్టెన్ ఫాతిమాను అభినందిస్తున్న క్రీడాకారిణులు

బంగ్లాదేశ్, పాకిస్తాన్ బోణి

- ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్

షార్జా: ఐసిసి మహిళల టీ20 ప్రపంచ కప్‌లో బంగ్లాదేశ్, పాకిస్తాన్ జట్లు బోణీ కొట్టాయి. గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ జట్టు స్కాట్లాండ్‌పై 16పరుగుల తేడాతో, పాకిస్తాన్ జట్టు శ్రీలంకపై 31పరుగుల తేడాతో విజయం సాధించాయి. షార్జా వేదికగా జరిగిన గ్రూప్-బిలో ఈ రెండు మ్యాచుల్లోనూ స్వల్ప స్కోర్లే నమోదయ్యాయి. తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 7వికెట్ల నష్టానికి 119పరుగులు చేసింది. బంగ్లా బ్యాటర్లు శోభన(36), షాతీ రాణి(29), నిగర్ సుల్తానా(18) బ్యాటింగ్‌లో రాణించారు. బంగ్లాదేశ్‌ను స్కాట్లాండ్ బౌలర్లు సస్కియా హొర్లే(3/13), ఒలివియా బీల్(1/23)లు రాణించారు. స్వల్ప ఛేదనలో స్కాంట్లాండ్ ఆది నుంచి తడబడింది. ఓపెనర్ సస్కియా హొర్లే(8)ను ఫహిమా ఖాతూన్ ఔట్ చేసి స్కాంట్లాండ్‌ను దెబ్బకొట్టింది. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ క్యాథరిన్ బ్రిసే(11), ఐసా లీస్టర్(11)లు సైతం ఎక్కువ సేపు క్రీజులో నిలువలేకపోయారు. ఓవైపు వికెట్లు పడుతున్నా ఓపెనర్ సరాహ్ బ్రైస్(49 నాటౌట్) మాత్రం పట్టు వదల్లేదు. బంగ్లా బౌలర్లు ఒత్తిడి పెంచుతున్నా సరే.. జట్టును గెలిపించేందుకు చివరిదాకా పోరాడింది. కానీ, మరుఫా అక్తర్, రితు మోనిలు పరుగులు కట్టడి చేసి బంగ్లాను గెలుపు దిశగా నడిపించారు. బంగ్లా బౌలర్లులో రీతు మోనికి రెండు, మరుఫా అక్తర్, నహిద అక్తర్, ఫాతిమా, రబయా ఖాన్‌లకు ఒక్కో వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ రీతు మోనికి లభించింది.

పాకిస్తాన్ మహిళల సంచలనం...

మరో మ్యాచ్‌లో పాకిస్తాన్ మహిళలు శ్రీలంక స్పిన్నర్ల ముందు స్వల్ప స్కోర్‌కే పరిమితమయ్యారు. ఆసియా కప్ చాంపియన్ శ్రీలంక స్పిన్నర్ల ధాటికి పాక్ బ్యాటర్లు తేలిపోయారు. సుగంధిక కుమారి(3/19), కెప్టెన్ చమరి ఆటపట్టు (3/18)ల విజంభణతో వరుసగా పెవిలియన్‌కు క్యూ కట్టారు. కెప్టెన్ ఫాతిమా సనా ఖాన్(30)కి తోడు నిదా ధార్(23) బ్యాటింగ్‌లో రాణించారు.

ఆ తర్వాత చమరి సైతం తిప్పేయగా పాక్ అమ్మాయిలు చేతులెత్తేశారు. 13వ ఓవర్లో వరుస బంతుల్లో ఇద్దరిని ఔట్ చేసిన లంక కెప్టెన్ పాక్‌ను దెబ్బ తీసింది. 84కే 8 వికెట్లు పడిన దశలో ఫాతిమా సనా ఖాన్ కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడింది. దీంతో పాకిస్తాన్ నిర్ణీత 20 ఓవర్లలో 116 పరుగులకే పరిమితమైంది. స్వల్ప ఛేదనలో శ్రీలంక ఓపెనర్ గుణరత్నే(20) రాణించినా.. మిగిలిన బ్యాటర్లు నిరాశపరిచారు. 3వికెట్ల నష్టానికి 47పరుగులతో పటిష్టంగా ఉన్న లంక జట్టును పాకిస్తాన్ బౌలర్లు ఫాతిమా(2/10), సదియా ఇక్బాల్(3/17), సొహైల్(2/17), సంధు(2/15) కట్టడి చేశారు. దీంతో శ్రీలంక జట్టు పవర్‌ప్లే ఓవర్లు ముగిసాక వరుసగా వికెట్లు కోల్పోయింది. లంక జట్టు 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 85పరుగులే చేయగల్గింది. దీంతో పాకిస్తాన్ 31పరుగుల తేడాతో ఘన విజయం సాధించగా.. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఫాతిమాకు లభించింది.

స్కాట్లాండ్‌పై గెలుపుతో బంగ్లాదేశ్ క్రీడాకారిణుల సంబరాలు

ఇంజక్షన్ వికటించి వ్యక్తి మృతి

నార్పల ప్రాథమిక వైద్యశాల ఘటన

మృతదేహంతో ఆందోళనకు దిగిన బంధువులు

ప్రజాశక్తి - నార్పల

అనంతపురం జిల్లా నార్పల ప్రాథమిక వైద్యశాలలో ఇంజక్షన్ వికటించి వ్యక్తి మృతిచెందాడు. గురువారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నైట్‌డ్యూటీలో ఉన్న నర్స్ భర్త సూదిమందు వేయడం వల్లనే తన భర్త మృతిచెందాడని మృతుని భార్యతో పాటు, ఎంఆర్‌పిఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి మృతుని బంధువులు, వైద్యసిబ్బంది తెలిపిన వివరాల మేరకు...మండల కేంద్రంలోని బేల్దారి కాలనీకి చెందిన కుళ్లాయప్ప (38) గురువారం అర్ధరాత్రి అస్వస్థతకు గురికావటంతో తెల్లవారుజామున మూడు గంటల సమయంలో కుటుంబ సభ్యులు నార్పల ప్రాథమిక వైద్యశాలకు తరలించారు. అక్కడ కుళ్లాయప్పకు ఇంజక్షన్ వేశారు.

కొద్ది సేపటికే అతను మృతిచెందాడు. వైద్యశాలలో నైట్ డ్యూటీలో ఉన్న నర్సు(ఎఫ్ఎన్ఒ) భర్త ఇంజక్షన్ వేయడం వల్లనే తన భర్త మృతిచెందాడని మృతుని భార్య, ఎంఆర్‌పిఎస్ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు వారు ఆసుపత్రి ఎదుట ఆందోళకు దిగారు. అయితే ఇంజక్షన్ తానే వేశానని తనకు ఆరోగ్యం బాగా లేకపోతే తన భర్త తోడుగా వచ్చాడని నర్సు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఎవరు ఇంజక్షన్ వేశారో తెలుసుకోవడానికి పోలీసులు వైద్యశాలలోని సిసి కెమెరా ఫుటేజీలను పరిశీలించడానికి ప్రయత్నించగా అవి పనిచేయడం లేదని వైద్య సిబ్బంది తెలిపారు. మృతినిభార్య దేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్

Can Fin Homes Ltd (Sponsor : CANARA BANK) HOME LOANS ✦ DEPOSITS Translating Dreams into Reality

40-5-9/17, 1వ అంతస్తు, సిద్ధార్థ కాలేజ్ బస్ స్టాప్ దగ్గర, మొగల్‌రాజపురం, విజయవాడ-520010. ఫోన్ : 0866-2474781
E-mail: vijaywada@canfinhomes.com CIN:L85110KA1987LC008699

సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు 2002 (నెం. 54 యొక్క 2002) లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు

డిమాండ్ నోటీసు

వీరికి, 1) శ్రీ అన్వేష్ బూసి (అప్లికెంట్), 15-91, కృష్ణనగర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520007. **2) శ్రీమతి కళ్యాణి దుర్గా గరికిపాటి (కో-అప్లికెంట్),** 15-91, కృష్ణనగర్, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520007.

మీరు అనగా నెం. 1 మరియు 2 గారితో కలిసి మా శాఖ నుండి హౌసింగ్ రుణాలను దిగువ ఆస్తులు తనఖా ఉంచి పొందియున్నారు. **కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్** వారికి **శ్రీ అన్వేష్ బూసి (అప్లికెంట్)** వారు **రూ.31,91,629/- (అక్షరాలా ముప్పై ఒక్క లక్షల తొంభై ఒక్క వేల ఆరు వందల ఇరవై తొమ్మిది రూపాయలు మాత్రమే) బకాయి అయినవారు ది. 01-10-2024** నుండి తదుపరి భవిష్య వడ్డీని కాంట్రాక్టు రేటు ప్రకారం సదరు సొమ్ముపై చెల్లించ వలసియున్నది.

తనఖా ఆస్తి యొక్క వివరములు

షెడ్యూలు-ఎ: కృష్ణా జిల్లా, విజయవాడ, పటమట యస్ఆర్‌ఓ లిమిట్స్, యనమలకుదురు గ్రామపంచాయతీ, ఆర్.యస్.నెం.85/2, హెచ్.నెం.12-47/3 నందు 242 చ॥గ॥ విస్తీర్ణముగల మొత్త స్థలములో నిర్మించిన లక్ష్మీ నిలయం, మూడవ అంతస్తులో 1008 చ॥అ॥ నిర్మాణపు ఏరియా లోని రెసిడెన్షియల్ ఫ్లాట్ నెం.టిఎఫ్-1 మరియు మొత్తం స్థలములో అవిభాజ్యపు భాగమైన 25 చ॥గ॥ల స్థలముతో సహా యావదాస్తి. **స్థలమునకు హద్దులు: తూర్పు:** రవి ప్రసాద్ యొక్క ఆస్తి; **పడమర:** 30 అ॥ వెడల్పుగల రోడ్డు; **దక్షిణం:** రవి ప్రసాద్ యొక్క ఆస్తి; **ఉత్తరం:** యమ్.ఉమా మహేశ్వరరావు యొక్క ఆస్తి. **ఫ్లాట్‌నకు హద్దులు: తూర్పు:** శూన్యాకాశము; **పడమర:** ఉమ్మడి వరండా మరియు మెట్లు; **ఉత్తరం:** శూన్యాకాశము; **దక్షిణం:** శూన్యాకాశము.

పైన తెలిపిన సదరు యాక్టు ప్రకారం, ఋణగ్రహీత ఆఖరిసారి తెలిపిన చిరునామా వద్ద దిగువ సంతకందారు ద్వారా ఈ నోటీసులు అతికింపచేసినారు. మీలో నెం. 1&2 లను SARFAESI యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) క్రింద రిజిస్టర్డ్ డిమాండ్ నోటీసు పంపడమైనది. కానీ రెండు నోటీసులు మీకు బట్వాడా కాకుండానే తిరిగి వచ్చినవి. కావున ఈ ప్రకటన ప్రచురించడమైనది. అయినప్పటికీ సదరు ఆమోదించబడిన నిబంధనలను ఉల్లంఘించినందున మీ ఖాతాను ఎన్‌హెచ్‌బి సూచనలను అనుసరించి తేది: **28-09-2024**న నిరర్థక ఆస్తులుగా వర్గీకరించడమైనది. కావున ఇందుమూలముగా మీకు తెలుపడమేమనగా పైన తెలిపిన మొత్తమును **ది.01-10-2024** నుండి ఒప్పంద రేటు ప్రకారం వడ్డీతో ఈ నోటీసు తేది నుండి **60 రోజులలోగా** తిరిగి చెల్లించమని కోరడమైనది. విఫలమైనట్లయితే SARFAESI యాక్ట్ క్రింద పైన తెలిపిన సెక్యూరిటీ పై ఈ క్రింద సంతకందారు తగిన చర్యలు తీసుకొనుటకు ఉపక్రమించెదరు. ఇంకా తెలుపునది ఏమనగా ఋణగ్రహీత / హామీదారులు సెక్యూర్డు ఆస్తులను విడిపించుకొనుటకు గల కాలపరిమితి గురించి సెక్షన్ 13లోని సబ్ సెక్షన్ (8) నందు గల నియమములు పరిశీలించవలసినదిగా కోరడమైనది.

తేది: 03-10-2024, ప్రదేశం: విజయవాడ సం/- అధీకృత అధికారి, కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్

కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్

CanFinHomes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS ✦ DEPOSITS Translating Dreams into Reality

బ్రాంచి ఆఫీస్ : డి.నెం.76-14-95/11, 1వ అంతస్తు, ఆర్‌టిసి వర్క్‌షాప్ రోడ్డు, భవానీపురం, గొల్లపూడి, విజయవాడ-520012. ఫోన్ : 0866-2975223, 76250 79223
ఇ-మెయిల్ : gollapudi@canfinhomes.com
CIN No.L85110KA1987PLC008699

ఉద్దేశించిన అమ్మకం నోటీసు

Under Rule 8 (6) సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002

టు

1) శ్రీ జమ్మలమడక సుబ్రమణ్యం ప్రసాద్ (ఋణగ్రహీత-1), తండ్రి. శివరామ్, ఫ్లాట్ నెం.402, జైపీ గ్రీన్స్ పవేలియో కోర్ట్, సెగ్గర్‌పూర్, సెక్టార్ 128, నోయిడా, ఉత్తరప్రదేశ్-201.04.

2) శ్రీమతి జమ్మలమడక పద్మావతి, (ఋణగ్రహీత-2), భర్త. శివరామ్, డోర్ నెం.8-93, మహాలక్ష్మీ మను, గొడవర్రు, కంకిపాడు మండలం, కృష్ణా జిల్లా-521151.

నెం.1 & 2 దిగువ ఆస్తుల తనఖా ద్వారా మా బ్యాంకు శాఖ నుండి మీలో **నెం.1** కి చెందిన ఆస్తి పై గృహ ఋణం పొందినారు. సదరు ఋణం **తేది.29.05.2024** నాటికి ఎన్.పి.ఏ. అనగా నిరర్థక ఆస్థిగా వర్గీకరించబడినది. అందుచే మీరు **తేది.04.06.2024** నాటి **డిమాండు నోటీసు** ప్రకారం బకాయి మొత్తం చెల్లించవలసినదిగా కోరడమైనది.

స్థిరాస్తి వివరములు

ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ రెవెన్యూ డివిజన్, ఇబ్రహీంపట్నం గ్రామం & గ్రామ పంచాయితీ ఏరియా, ఆర్.ఎస్.నెం.91/2సి వద్ద గల విస్తీర్ణం 631-06 చ॥గ॥లు లేదా 527-65 చ॥మీ॥లులోని **"ఉమేష్ ఎన్‌క్లేవ్"** అను పేరుతో ఉన్న అపార్ట్‌మెంట్ నందు బ్లాక్-బి, 2వ అంతస్తులోని ఫ్లాట్ నెం.302. **హద్దులు : తూర్పు :** మేక వెంకటేశ్వర రావు గారికి అమ్మిన ఆస్తి, **దక్షిణం :** కె. విజయలక్ష్మీ & ఇతరులు యొక్క ఆస్తి, **పడమర :** చల్లా గాయత్రీ దేవి గారి ఆస్తి, **ఉత్తరం :** 21 అ॥ల వెడల్పు బజార్.

"ఉమేష్ ఎన్‌క్లేవ్" నందు 56 చ॥గ॥లు లేదా 46-82 చ॥మీ॥ల అవిభాజ్యపు అనిర్దేశ్యపు వాటాతో 2వ అంతస్తులో గల ఫ్లాట్ నెం.302, ఫ్లింత్ ఏరియా 1173 చ॥అ॥లు, కార్ పార్కింగ్ ఏరియా 100 చ॥అ॥లు, అన్ని సౌకర్యాలు మరియు ఈజుమెంటరీ హక్కులతో సహా. **హద్దులు : తూర్పు :** ఓపెన్ టు స్కై, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **పడమర :** కారిడార్ & మెట్లు, **ఉత్తరం :** ఓపెన్ టు స్కై.

డిమాండ్ నోటీసు ప్రకారం మీరు బకాయి చెల్లించలేదు. అందుచే దిగువ సంతకందార అయిన అధీకృత అదికారి సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8 తో చదివే సెక్షన్ 13(4) యొక్క ప్రొవిజన్ ప్రకారం సెక్యూర్డు స్థిరాస్తులను స్వాధీనం చేసికొన్నారు.

ఇందుమూలంగా కోరునది ఏమనగా లోన్ మొత్తం బకాయిలన్నీ అనగా **తేది.04.06.2024** నాటికి బకాయిలు **రూ.31,45,625/-** దీనితో కాంట్రాక్టు రేటు ప్రకారం అయిన వడ్డీ & ఖర్చులు చెల్లించవలసినదిగా కోరియున్నారు. ఈ విషయము గురించి మీకు ఆఖరిసారిగా ఇచ్చిన చిరునామాకు రిజిష్టర్డు పోస్టు ద్వారా నోటీసును పంపియున్నాము. అది అందకుండానే తిరిగి వచ్చినది. అందుచే ఈ పత్రికా ప్రకటన జారీ చేయడమైనది.

ఇది ఆఖరిసారిగా సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)లోని రూలు 8(6) ప్రకారం జారీ చేసిన నోటీసు. మీరు ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా పూర్తిగా బకాయి చెల్లించవలెను. విఫలమైనచో దిగువ సంతకందారు గారు వేలం తేదీ నిర్ణయించెదరు. వేలం నోటీసును ప్రచురించి సెక్యూర్డు స్థిరాస్తులను సెక్యూరిటైజేషన్ & రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ప్రకారం అమ్మకం చేసి, సెక్యూర్డు బకాయిలను రాబట్టుకొనెదరు.

తేది : 03.10.2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : గొల్లపూడి కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్

పావరగ్రిడ
పవర్ గ్రిడ్

నోటీసు

1. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమీషన్ (టారీఫ్ రెగ్యులేషన్స్ షరతులు మరియు నిబంధనలు) 2024 తో చదువుతూ సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమీషన్ (వ్యాపారం నిర్వహణ) రెగ్యులేషన్స్, 2023 యొక్క రెగ్యులేషన్ 23 మరియు రెగ్యులేషన్ 15(1) (ఎ) క్రింద మరియు ఎలక్ట్రిసిటీ యాక్ట్, 2003 యొక్క సెక్షన్ 79(1) తో చదువుతూ సెక్షన్ 62 క్రింద అరాసుర్ సబ్ స్టేషన్ వద్ద "1×500 ఎమ్‌విఎ, 400కెవి / 230కెవి ఐసిటి (4వ) ద్వారా ట్రాన్స్‌ఫర్మేషన్ కెపాసిటీ పెంపుదల" క్రింద అరాసుర్ సబ్ స్టేషన్ వద్ద అనుబంధ బేలు మరియు పరికరాలతో పాటు 1×500 ఎమ్‌విఎ, 400/230 కెవి ఐసిటి (4వ) కొరకు టారీఫ్ నిర్ణయం కొరకు పిటీషన్.

పైన పేర్కొన్న ట్రాన్స్‌మిషన్ సిస్టం యొక్క లబ్ధిదారులు: (ఎ) TANGEDCO (బి) TSNPDCL (సి) KSEB (డి) TSSPDCL (ఇ) ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ గోవా (ఎఫ్) ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ పుదుచ్చేరి (జి) APEDCL (హెచ్) APSPDCL (ఐ) CESC (జె) MESCOM (కె) BESCOM (ఎల్) GESCOM (ఎం) HESCOM & (n) APCPDCL.

2. టారీఫ్ వివరాలు :

అస్తి యొక్క పేరు	అరాసుర్ సబ్ స్టేషన్ వద్ద అనుబంధ బేలు మరియు పరికరాలతో పాటు 1×500 ఎమ్‌విఎ, 400/230 కెవి ఐసిటి (4వ)
షెడ్యూల్ డిఓసిఓ (ఎఫ్ఆర్)	24.02.2024
డిఓసిఓ (వాస్తవమైన)	30.06.2024
ఎఫ్ఆర్ ఆమోదించబడిన ఖర్చు	4804.45
అంచనా పూర్తి ఖర్చు **(రూ. లక్షలో)**	5375.94
సంవత్సరం కొరకు టారీఫ్ **(రూ. లక్షలో)**	
2024-25	671.21
2025-26	1016.86
2026-27	1012.77
2027-28	1004.52
2028-29	997.51

4. ఒక కాపీ అప్లికేషన్‌ను తయారుచేసి సుంకం నిర్ధారణకు వెబ్‌సైట్‌కు **www.powergrid.in** అప్లికేషన్‌ను పోస్టుచేయాలి.

5. సలహాలు మరియు అభ్యంతారాలు, అప్లికేషన్‌లో నిర్ణయించబడిన సుంకం గురించి ముందుగా లబ్ధిదారులను కలుపుకొని ఏవరైన వ్యక్తి చేత ఫైలు చేయబడితే వారు సెక్రటరీ, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమీషన్, 6వ, 7వ మరియు 8వ అంతస్తులు, టవర్ బి, వర్ల్డ్ ట్రేడ్ సెంటర్, నౌరోజి నగర్, న్యూ ఢిల్లీ-110 029 (లేదా వేరొక చిరునామ కమీషన్ కార్యాలయం ఎక్కడ ఉన్నదో అక్కడ) ఒక కాపీతో అప్లికెంట్ దీని కార్పొరేట్ ఆఫీస్ వద్ద నోటీసు ప్రచురించబడిన 30 రోజులలోగా తెలుపవచ్చు.

ప్రదేశం : గుర్‌గావ్ సం/-
తేది : 03.10.2024 సిజిఎమ్ (కమర్షియల్/ఆర్‌సి)

PG/CC/Notice-85/Advt-115/2024-25 Isha Advertising

పవర్ గ్రిడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్
(భారత ప్రభుత్వ రంగ సంస్థ)
కార్పొరేట్ కార్యాలయం: "సౌధామిని", ప్లాట్ నం.2, సెక్టార్-29, గుర్‌గావ్-122 001 (హర్యానా) టెలి: 0124-2571700-719
నమోదిత కార్యాలయం: బి-9, క్వాతబ్ ఇన్‌స్టిట్యూషనల్ ఏరియా, కట్వారియా సరాయ్, న్యూ ఢిల్లీ-110016 టెలి: 011-26560112, 26560121
CIN : L40101DL1989GOI038121; Website: www.powergrid.in
ఎ మహారత్న పిఎస్‌యు

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate A Government of India Undertaking

గుంటూరు మెయిన్ బ్రాంచ్
హిందూ హైస్కూల్ క్యాంపస్ మెయిన్‌రోడ్, గుంటూరు-522003, ☎ 0863-2221751

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు సెక్షన్ 13(8) క్రింద
REDEMPTION NOTICE

టు:
(1) M/s **విజయభువనేశ్వరి కాటన్ ఫైబర్స్, ప్రొప్రయిటర్: కంచర్ల అరుణ కుమారి,** డి.నెం: 4-5-27/11ఎ, 4/2 రింగ్‌రోడ్డు, గుంటూరు-522007. **(2) శ్రీ కంచర్ల అరుణ కుమారి, భర్త: కె శంకర రావు,** డి.నెం: 4-5-27/11ఎ, 4/2 విద్యానగర్, గుంటూరు-522007. **(3) శ్రీ కంచర్ల శంకర రావు, తండ్రి: పెద మల్లయ్య,** డి.నెం.4-5-27 4/2వ లేన్, విద్యానగర్, గుంటూరు-522007. **(4) శ్రీ గుండా పూర్ణ చంద్రరావు, తండ్రి: గాలేశ్వరరావు,** డి.నెం.4-5-29/38/48, 3/7 విద్యానగర్, గుంటూరు-522007.
డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధలనలతో చదవబడు సర్ఫేసి చట్టం, 2002 సెక్షన్ 13(8) క్రింద తిరిగి పొందు హక్కు ఉపయోగించుకోవాల్సిందిగా కోరుతూ 30 రోజుల ప్రకటన.

తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గౌరవనీయ హైకోర్టు, హైదరాబాద్ న్యాయవ్యవస్థ నిర్ధేశించిన ప్రతిపాదనకు అనుగుణంగా అమ్మకపు నోటీసు ప్రచురణ తేదికి ముందుగా, సెక్యూర్డ్ ఆస్తుల ను విడిపించుకోవడానికి తనఖాదారునికి 30 రోజుల ప్రత్యేక నోటీసు జారీచేయబడుచున్నది.

లోను అకౌంట్ M/s **విజయభువనేశ్వరి కాటన్ ఫైబర్స్** వారిని బకాయి **రూ. 9,83,91,308.5 (అక్షరాల తొమ్మిది కోట్ల ఎనభై మూడు లక్షల తొంబై ఒక్క వేల మూడు వందల ఎనిమిది రూపాయలు మరియు ఐదు పైసలు)** మరియు వడ్డీతో కలిపి మొత్తం చెల్లించవలసినదిగా కోరుతూ **కెనరా బ్యాంక్, గుంటూరు మెయిన్ బ్రాంచ్** అధీకృత అధికారి **తేది 16.11.2016** న డిమాండ్ నోటీసును జారీచేయడమైనది.

పైన తెలిపిన డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో మీరు విఫలమైనందున **కెనరా బ్యాంక్** యొక్క అధీకృత అధికారి **తేది. 22.03.2017** న మీ సెక్యూర్డ్ ఆస్తులను **లాంఛనాత్మక/భౌతిక స్వాధీనం తీసుకున్నారు మరియు చట్ట ప్రకారం సదరు స్వాధీనత నోటీసును సాక్షి (తెలుగు) & ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్ (ఇంగ్లీష్) వార్తాపత్రికలలో తేది.28.03.2017** న ప్రచురించడమైనది.

ఈ నోటీసు తేది నుండి 30 రోజులలోగా మీరు తేది. **16.11.2016** నాటి డిమాండ్ నోటీసులో పేర్కొన్న బకాయి **రూ. 9,83,91,308.5 (అక్షరాల తొమ్మిది కోట్ల ఎనభై మూడు లక్షల తొంబై ఒక్క వేల మూడు వందల ఎనిమిది రూపాయలు మరియు ఐదు పైసలు)** + వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తంను చెల్లించి బ్యాంకు వారు స్వాధీనం చేసుకున్న మీ ఆస్తులను విడిపించుకొనుటకు ఆఖరి మరియు చివరి అవకాశం ఇవ్వబడినది. ఒకవేళ మీరు చెల్లించుటలో విఫలమైనట్లయితే, దిగువ వివరించిన ఏదేని విధానాల ద్వారా అమ్మకం జరుపుటకు దినపత్రికలో అమ్మకం ప్రకటన ప్రచురితమవుతుంది.(ఎ) ఇటువంటి సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయువారినుండి లేదా సెక్యూర్డ్ ఆస్తులను కొనుగోలు చేయు ఆసక్తి గల వారి నుండి కొటేషన్లు ఆహ్వానించుట లేదా (బి) ప్రజలనుండి టెండరు ఆహ్వానించుట లేదా సి) ఇ-వేలం పద్ధతిలో బహిరంగ వేలంను నిర్వహించుట లేదా (డి) ప్రైవేట్ ట్రీటీ. దిన పత్రికలలో అమ్మకం ప్రకటన ప్రచురణ తేదీకి ముందుగా సర్ఫేసి చట్టం యొక్క సెక్షన్ 13(8) ప్రకారం మీరు మీ సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనే హక్కు కలిగి ఉంటారు, ఒకవేళ విఫలమైనచో సెక్షన్ 13(8) ప్రకారం ఆస్తిని విడిపించుకొనే హక్కును కోల్పోవుదురు.

చట్టం నందు / అమలులోనున్న ఏదైన ఇతర న్యాయ పరిధిలో బ్యాంకునకు ఎలాంటి ఇతర హక్కులకు భంగం వాటిల్లకుండా లేకుండా ఈ నోటీసు జారీ చేయడమైనది.

తేది: 13.09.2024, ప్రదేశం: గుంటూరు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

గవర్నర్‌పేట బ్రాంచి (01451) :
డి.నెం. 27-18-85, కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డు, గవర్నర్‌పేట, విజయవాడ, ఎ.పి - 520002

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ మరియు రీ కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట బ్రాంచి అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సదరు చట్టం నందలి రూలు 8(6) ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ సాధారణ ప్రజానీకమునకు ముఖ్యంగా ఋణగ్రహీతలకు / హామీదారులకు నోటీసు ఇచ్చి తెలియజేయునదిఏమనగా బ్యాంకు వారు దిగువ పేర్కొన్న బకాయిలను, తదుపరి వడ్డీ, ఛార్జీలు మొ॥నవి తిరిగి రాబట్టుకొనుటకు వారికి హామీగా ఉంచి, భౌతికంగా స్వాధీనత చేసుకోబడిన స్థిరాస్తులను క్రింద సూచించిన విధముగా ఇ-వేలం ద్వారా బ్యాంకు వారిచే అమ్ముటకు నిర్ణయించడమైనది. దిగువ స్థిరాస్తి **అమ్మకం "ఎక్కడ ఏది ఉన్నదో, అది, ఎలా ఉన్నదో అలా మరియు అక్కడ ఏది ఉంటే అది"** ప్రాతిపదిన దిగువ పేర్కొనబడిన ఋణగ్రహీతలకు మరియు హామీదారుల నుండి రావలసిన **బకాయి మొత్తమును** ఒప్పంద రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో రాబట్టుకొనేందుకు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గవర్నర్‌పేట బ్రాంచి, ఇవిబి (01451) వారిచే** ఇ-వేలం అమ్మకం ద్వారా **ది. 29-10-2024**న ఆస్తులను విక్రయించేందుకు నిర్ణయించడమైనది. **బిడ్లు సమర్పించుటకు ఆఖరుతేది : ఈ-వేలం ప్రారంభానికి ముందు వరకు రిజర్వు ధర మరియు ధరావత్తు మొత్తము ఈ క్రింది విధముగా ఉన్నవి.**

ఋణగ్రహీత / హామీదారుల వివరములు : 1) శ్రీమతి వేములపూడి దీక్షిత కృష్ణ, భర్త : ప్రేమ్ కుమార్, డి.నెం. 68-6-5ఎ, రామాలయం వీధి, పటమటలంక, బెంజి సర్కిల్, విజయవాడ - 520010. **2) వేములపూడి హోషిత,** తండ్రి : ప్రేమ్ కుమార్, డి.నెం. 68-6-5ఎ, రామాలయం వీధి, పటమటలంక, బెంజి సర్కిల్, విజయవాడ - 520010. **3) వేములపూడి జోషిత్,** తండ్రి : ప్రేమ్ కుమార్, డి.నెం. 68-6-5ఎ, రామాలయం వీధి, పటమటలంక, బెంజి సర్కిల్, విజయవాడ - 520010.
బకాయి మొత్తం : ది. 05-07-2024 నాటికి రూ. 19,95,250.21/- (అక్షరాలా పంధొమ్మిది లక్షల తొంభై ఐదు వేల రెండు వందల యాభై రూపాయల ఇరవై ఒక్క పైసా మాత్రమే) మరియు ది. 31-01-2020 న ఒప్పందం చేసుకున్న రేటు ప్రకారం తదుపరి వడ్డీ మరియు ఇతర ఖర్చులు.
ఆస్తి వివరములు : శ్రీ వేములపూడి ప్రేమ్ కుమార్, తండ్రి : వి. రమణ గారి పేరిట విజయవాడ - 520010, పటమట, మున్సిపల్ వార్డు నెం. 32/3, 27ఎ, రామాలయం వీధి, అసిస్ట్ నెం. 262017, ఆర్.ఎస్.నెం. 81 (పాత డోర్ నెం. 68-6-5) డి.నెం. 68-6-5/1 వద్ద మొత్తం విస్తీర్ణం 36 + 55.43 = 91.43 చ॥గ॥ల విస్తీర్ణంలోని నివాస భవనము దానికి చెందిన గ్రౌండ్ మరియు ఫస్ట్ ఫ్లోర్స్.
